www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
గుంటూరు సిటీ

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 12-8-2025 | పేజీలు: 14 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 157

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: తదియ ఉ.8:41 తదుపరి చవితి, నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.11:52 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: రా.8:56-10:26, దుర్ముహూర్తం: ఉ.8:32-9:23, రా.10:22-11:06, అమృతఘడియలు: లేవు రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 6:01, సూర్యాస్తమయం: 6:39

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇజ్రాయెల్ దాడుల్లో ఐదుగురు జర్నలిస్టుల మృతి

2



అనస్ అల్ షరీఫ్, మొహమ్మద్ క్రీకె, ఇబ్రహీం జహీర్

- గాజాలో ఆస్పత్రి ఆవరణలో మీడియా టెంట్‌పై బాంబులు
- తీవ్రంగా గాయపడి మరణించిన అల్ జజీరా పాత్రికేయులు, ఇద్దరు పౌరులు
- ఇజ్రాయెల్ దారుణాలను వెల్లడిస్తున్నందుకే చంపుతున్నారు: అల్ జజీరా
- గాజాలో గత 22 నెలల్లో 200 మంది జర్నలిస్టుల మృతి

మద్యం కాదు.. 'విషం' అమ్మారు!



ప్రాణాలు తోడేశారు

జనం ప్రాణాలతో జగన్ సర్కారు చెలగాటం



కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజు

పేగులు కాలిపోయాయి

వైసీపీ ప్రభుత్వంలో కొత్త రకం మద్యం తాగి అనారోగ్యానికి గురవుతూ వచ్చాను. ఏడాదిగా మద్యం బంద్ చేశాను. మూడు నెలల క్రితం రక్తపు వాంతులయ్యాయి. మలమూత్రాలకు వెళ్లినపుడు రక్తం పడేది. మా కుటుంబ సభ్యులు కర్నూలు ఆస్పత్రిలో చేర్పించారు. మద్యం తాగడం వల్ల పేగులు పాడయ్యాయని, కిడ్నీలు, లివర్ చెడిపోయాయని వైద్యులు చెప్పారు. రెండు సార్లు ఆపరేషన్ చేసి పాడైన పేగులు తొలగించారు. నేటికీ కర్నూలు ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాను. ఇప్పటి వరకు రూ.8 లక్షలు ఖర్చయింది. అప్పు తెచ్చి వైద్యం చేయించుకుంటున్నాను. ఎకరా పొలం ఉంది. దానిని అమ్మినా అప్పు తీరదు.

- రాజు, ఆటోడ్రైవర్, దిబ్బనకల్లు గ్రామం, ఆదోని మండలం, కర్నూలు జిల్లా

జేబులో డబ్బులే కాదు... ఒంట్లోని రక్త మాంసాలనూ పీల్చేశారు! ప్రభుత్వ దుకాణాల్లో మద్యం పేరుతో మెల్లగా ప్రాణాలను తోడేసే విషాన్ని విక్రయించారు! ఒకవైపు మాయదారి 'బటన్' నొక్కుతూ... మరోవైపు కిడ్నీ, కాలేయాలను గుల్ల చేశారు. సరిగా శుద్ధి చేయని నాసిరకం మందును అంటగట్టి... మనుషుల ప్రాణాలతో చెలగాటమాడారు. డబ్బు కోసం ఇంత నీచానికి ఒడిగట్టాలా? ముడుపుల కక్కుర్తికి బలహీనులను బలిచేయాలా? జగన్ హయాంలో జరిగిన 'మద్యం స్కామ్'లో ఆర్థిక నేరం ఒక్కటే కనిపిస్తోంది. ఆ లెక్కలు 'సిట్' తవ్వి తీస్తోంది. మరి... వందల కుటుంబాల కన్నీళ్లకు జవాబు చెప్పేదెవరు? నాసిరకం మద్యానికి అవయవాలు దెబ్బతిని జీవచ్ఛవాలుగా బతుకుతున్న వారికి దిక్కెవరు? ఇది... కేవలం ఒక స్కామ్ కాదు! మానవ విషాదాన్ని సృష్టించిన మహా నేరం! జగన్ హయాంలో మద్యమనే 'విషానికి' బలైపోయిన కుటుంబాలు ఎన్నో! అవయవాలు దెబ్బతిని ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న వారు ఎందరో! మనసులను కదిలించే... బండరాళ్లను సైతం కరిగించే వారి విషాద గాథలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం...

- కాసుల కక్కుర్తికి ఎందరో పేదలు బలి
- పీల్చి పిప్పిచేసిన నాసిరకం జే బ్రాండ్లు
- నడి వయసులోనే ఎందరో మృత్యువాత
- అనారోగ్యంతో మరికొందరు ఆస్పత్రుల పాలు
- శుద్ధిచేయని స్పిరిట్ వాడటం వల్లే
- ఇందులో మలినాలు, ప్రమాదకర పదార్థాలు
- మరోవైపు అధిక రేట్లతో జేబులకూ చిల్లు
- రోడ్డున పడ్డ ఎన్నో కుటుంబాలు



(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

వైసీపీ హయాంలో ఊరూ పేరూ లేని నాసిరకం బ్రాండ్లు విచ్చలవిడిగా అమ్మారు. పాపులర్ బ్రాండ్లను రాష్ట్రం నుంచి తరిమేసి ప్రభుత్వ మద్యం షాపుల ద్వారా జే బ్రాండ్లను అధిక ధరలకు బలవంతంగా అమ్మించారు. ఫలితంగా పేదలు ఇల్లు, ఒళ్లు.. రెండూ గుల్ల చేసుకున్నారు. అనారోగ్య సమస్యలతో ఎందరో ఆస్పత్రుల పాలయ్యారు. ఐదు పదులు కూడా దాటకనే మరణించారు. గత ఐదేళ్లలో

మిగతా 12వ పేజీలో...

వైద్య ఆరోగ్య శాఖ సర్వే ప్రకారం.. మద్యం కారణంగా కాలేయం వ్యాధుల బారినపడిన వారు 2014-19 మధ్య 14,026 మంది ఉంటే, 2019-24 మధ్య ఆ సంఖ్య 29,369కి పెరిగింది. వారిలో 4,850 మంది మహిళలూ ఉన్నారు. నరాల బలహీనతతో నాడీ వ్యవస్థ దెబ్బతిన్నవారు 2014-19 మధ్య 1,276 మంది ఉండగా, 2019-24 మధ్య ఆ సంఖ్య ఏకంగా 12,663కు చేరింది. ఇక మద్యంతో కిడ్నీ వ్యాధుల బారినపడినవారు 2014-19 మధ్య 49,060 మంది ఉంటే, 2019-24 మధ్య ఆ సంఖ్య 90,385కు పెరిగింది.

భర్త, కొడుకును కోల్పోయా..



గత ప్రభుత్వంలో మద్యం తాగి నా భర్త, ఉన్న ఒక్క కొడుకూ చనిపోయారు. గత ఏడాది మే నెలలో నా భర్త పైబావి చిన్న ఆంజనేయ (55) కాలేయం, మూత్రపిండాలు దెబ్బతిని మరణించాడు. ఈ ఏడాది మే 6న నా కుమారుడు నర్సిరెడ్డి(31) లివర్ దెబ్బతిని మృతి చెందాడు. నేను చిన్న టీకొట్టు పెట్టుకుని ఒంటరిగా జీవనం సాగిస్తున్నాను. భూమి ఏమీ లేదు. ఇంత వరకు పింఛన్ రాలేదు. కూటమి ప్రభుత్వం నన్ను ఆదుకోవాలి.

- నరసమ్మ, మాధవరం గ్రామం, మంత్రాలయం మండలం, కర్నూలు జిల్లా

సగం మంది మద్యం బాధితులే

గుంటూరు జీజీహెచ్‌లోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ విభాగానికి చికిత్స కోసం వస్తున్న రోగుల్లో సగం మంది ఆల్కహాల్ బాధితులే ఉంటున్నారు. గతంలో మద్యపాన వ్యసనంతో చికిత్సలకు వచ్చే వారిలో 40-45 ఏళ్ల వయసు వారు కనిపించేవారు. ఇప్పుడు 20-25 ఏళ్ల యువకులూ రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ రోగుల్లో ఎక్కువగా కడుపు నొప్పి, పేగుపూత, ఎక్యూట్, క్రానిక్ పాంక్రియాటైటిస్, లివర్ వాపు, లివర్ సిర్రోసిస్, ఫ్యాటీ లివర్, హెపటైటిస్, మల్టీ ఆర్గాన్ డిస్‌ఫంక్షన్ సిండ్రోమ్ వంటి జబ్బులు వేధిస్తున్నాయి. ఇటీవల మద్యపానం చేసే వారిలో పెద్ద పేగు కేన్సర్, యూరిన్ బ్లాడర్ కేన్సర్ కేసులు కనిపిస్తున్నాయి. చీప్ లిక్కర్, కల్లుతో పాటు ఆల్కహాల్ పర్సెంటేజీ అధికంగా ఉండే విస్కీ, రమ్ వంటివి తీసుకొనేవారిలో ఈ దుష్ఫలితాలు అధికంగా కనిపిస్తున్నాయి. చిన్న వయసులోనే లివర్ సిర్రోసిస్ కేసులు పెరుగుతున్నాయి. గత నాలుగేళ్లుగా ఈ తరహా కేసులు బాగా పెరిగాయి.



- డాక్టర్ షేక్ నాగూర్ బాషా, అసిస్టెంట్ ప్రొఫెసర్, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు జీజీహెచ్



పాత పార్లమెంటు భవనం మీదుగా ఈసీ ఆఫీసుకు ర్యాలీగా బయల్దేరిన ఇండియా కూటమి ఎంపీలు

కదం తొక్కిన విపక్షం

ఓట్ల చోరీ, ఎస్ఐఆర్‌పై 300 మంది ఎంపీల నిరసన

- పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయానికి.. ఇండియా కూటమి ఎంపీల భారీ నిరసన ప్రదర్శన
- ర్యాలీలో పాల్గొన్న లోక్‌సభ, రాజ్యసభ విపక్ష ఎంపీలు
- మధ్యలోనే అడ్డుకుని నిర్బంధించిన ఢిల్లీ పోలీసులు
- బారికేడ్లు ఎక్కి నిరసన తెలిపిన మహిళా ఎంపీలు
- పోలీసులతో వాగ్వాదం.. తోపులాట.. తీవ్ర ఉద్రిక్తత
- రాహుల్, ఖర్గే, ప్రియాంక సహా పలువురు అరెస్టు

నేడే పార్లమెంట్ నిరవధిక వాయిదా?

- వారం ముందుగానే వాయిదాకు కేంద్రం నిర్ణయం!
- ప్రతిపక్షాల నిరసనలతో ఆత్మరక్షణలో ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ తీరును నిరసిస్తూ ఢిల్లీలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు కదం తొక్కారు. బిహార్‌లో ఓటర్ల జాబితా విస్తృత సవరణ పేరుతో భారీగా ఓట్లను తొలగిస్తున్నారని, దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపిస్తూ.. సోమవారం నిరసన చేపట్టారు. పార్లమెంట్ భవనం నుంచి ఈసీ కార్యాలయం దాకా ఎంపీలు ప్రదర్శన చేపట్టగా.. వారిని ఢిల్లీ పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకొని నిర్బంధించారు. ఈ క్రమంలో పోలీసులు, ఎంపీల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు నేతలు బారికేడ్లు ఎక్కి ముందుకెళ్లే యత్నం చేయడం, పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఇద్దరు మహిళా ఎంపీలు కళ్లుతిరిగి పడిపోయారు. ఎంపీల శాంతియుత నిరసనను అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని

మిగతా 2వ పేజీలో...

'ఓటు చోరీ'పై మహోద్యమం.. 15 లక్షల మంది రిజిస్టర్.. 10 లక్షల మిస్డ్ కాల్స్: రాహుల్‌గాంధీ

ఎక్కడి నుంచి ఎక్కడికైనా!

- 'స్త్రీ శక్తి' శుక్రవారం నుంచే అమలు 14
- 5 రకాల ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- 8,458 బస్సులు సిద్ధం.. 'ఆధార్'తో టికెట్
- 'సూపర్ సిక్స్'లో మరో హామీ అమలుకు రెడీ



హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో జాతీయ పతాకంతో సీఎం చంద్రబాబు

13

సరుకు రవాణాకు.. లాజిస్టిక్స్ కార్పొరేషన్

- రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల కార్గో నిర్వహణా చేపట్టాలి: చంద్రబాబు
- సరుకు రవాణా మార్గాలకు కేంద్రంగా రాష్ట్రం
- ఎకనమిక్ హబ్‌గా రేవులు, ఎయిర్‌పోర్టులు
- శాటిలైట్ టౌన్‌షిప్పుల అభివృద్ధి జరగాలి
- సమీకృత పురోగతికి బ్లూ ప్రింట్
- షిప్ బిల్డింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు
- పరిశ్రమలు, మౌలిక వసతులపై సీఎం సమీక్ష

మూలం ఆ ముగ్గురే!

చార్జిషీట్‌లో ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్, బాలాజీ గోవిందప్ప పేర్లు

- ఏసీబీ కోర్టుకు రెండో అభియోగపత్రం
- మద్యం నోట్‌ఫైల్స్ సైతం ధ్వంసం
- సరఫరా ఆర్డర్ల వివరాలు మాయం
- ఐపీఎస్ పీఎస్ఆర్ సూచనతోనే ఫైళ్ల నాశనం
- దీనిపై చర్యలకు యత్నించిన రజత్ భార్గవపై ఒత్తిడి
- చార్జిషీట్‌లో ఆయన వాంగ్మూలాన్నీ జతచేసిన సిట్
- లిక్కర్ ముడుపులతో భారీగా భూములు.. ఆస్తులు
- ఎక్కడెక్కడ ఏం కొన్నదీ పక్కా ఆధారాలతో నిర్ధారణ



అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): "ఆ ముగ్గురే మద్యం ముడుపుల రూటింగ్ చేశారు. బినామీ, కుటుంబ సభ్యుల పేర్లతో అక్రమాస్తులు పోగేసుకున్నారు. సీనియర్ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులు సూచన మేరకు మద్యం ఆర్డర్ల వివరాలు ధ్వంసం చేశారు" అని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) కోర్టుకు వివరించినట్టు తెలిసింది. జగన్ హయాంలో జరిగిన రూ.3500 కోట్ల మద్యం స్కామ్‌పై 'సిట్' ఇప్పటికే ఒక చార్జిషీటు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనికి అనుబంధంగా సోమవారం మరో చార్జిషీటును కోర్టుకు సమర్పించింది. ఇందులో... ముగ్గురు నిందితుల పాత్రను వివరించినట్లు తెలిసింది. మాజీ సీఎం కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణ మోహన్ రెడ్డి, భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప... ఈ ముగ్గురూ ముడుపులు భారీగా తీసుకుని బినామీలు, కుటుంబ సభ్యుల పేరుతో స్థిరాస్తులు కొనుగోలు చేసినట్లు స్పష్టంగా పేర్కొన్నట్టు సమాచారం. మద్యం ఆర్డర్లకు సంబంధించిన ఓఎఫ్ఎస్ ఆధారాలను వడ్డేశ్వరంలో(తాడేపల్లి దగ్గర్లో) ధ్వంసం చేశారని వెల్లడించింది. 2023 నవంబరు 2న సమావేశమై ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు సూచన, సిఫారసు మేరకు ధ్వంసం చేసినట్లు కోర్టుకు తెలిపినట్టు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. లిక్కర్ స్కామ్ కేసులో కింగ్ పిన్ రాజ్ కసిరెడ్డి, సత్యప్రసాద్, పీఎస్ఆర్ ఆంజనేయులు, వాసుదేవ రెడ్డి, ధనుంజయ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి పలుమార్లు సచివాలయంలో, తాడేపల్లిలో సమావేశమైనట్లు ఆయా లొకేషన్లను 'సిట్' సాంకేతిక ఆధారాలతో గుర్తించింది. ఆ వివరాలను చార్జిషీటులో పొందుపరిచింది. లిక్కర్ కుంభకోణంతో

మిగతా 12వ పేజీలో...

మెగా డీఎస్సీ తుది మార్కులు విడుదల

14

- టెట్ మార్కులపై అభ్యంతరాలకు అవకాశం
- సవరించుకునేందుకు 2 రోజుల సమయం

రేపు అల్పపీడనం

- వాయుగుండంగా బలపడే అవకాశం
- రాష్ట్రానికి భారీ వర్షసూచన
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో భారీ వర్షం
- ప్రమాదకరంగా కుందూనది
- నీట మునిగిన పంటలు
- లోతట్టు కాలనీలు జలమయం
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

14

ఏ పని కోసం ఈ పెరోల్?

- అతడిపై రెండు స్టేషన్లలో రౌడీ షీట్లు
- హత్యకేసులో యావజ్జీవ ఖైదీ
- జైలు నుంచి పారిపోయిన చరిత్ర
- రెండు జిల్లాల ఎస్పీలు 'నో' అన్నారు
- జైలు సూపరింటెండెంట్ వద్దన్నారు
- హోం జాయింట్ సెక్రటరీ నో అన్నారు
- కానీ.. 15 రోజుల్లోనే మారిన చిత్రం
- నెల పెరోల్ ఇస్తూ సెక్రటరీ ఉత్తర్వులు



రెండు జిల్లాల పోలీసు అధికారులు 'వద్దు' అని మొత్తుకున్నా... 'అతను బయటికి వస్తే ప్రమాదం' అని హెచ్చరించినా... 'నిబంధనలు ఒప్పుకోవు' అని లిఖితపూర్వకంగా తమ అభిప్రాయం వెల్లడించినా... సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ససేమిరా అన్నా... చివరికి, హోంశాఖ జాయింట్ సెక్రటరీయే 'రిజెక్టెడ్' అని ఉత్తర్వులు ఇచ్చినా... ఒక ఖైదీ పెరోల్ మీద బయటికి వచ్చాడు. తెరవెనుక ఎవరు సహకరించారో గానీ... 30 రోజులు పెరోల్ ప్రసాదిస్తూ రాష్ట్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది చూసి పోలీసు అధికారులే అవాక్కయ్యారు. ఇవీ ఆ వివరాలు...

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన అవిలే శ్రీకాంత్ ఒక రౌడీ షీటర్. ఒకటి కాదు... రెండు స్టేషన్లలో రౌడీషీట్లు ఉన్నాయి. 2007లో అతను ఒక బ్రాందీ షాపు మేనేజర్‌ను హత్య చేసినట్లు రుజువు కావడంతో... న్యాయస్థానం అతనికి యావజ్జీవ శిక్ష విధించింది. శ్రీకాంత్ 2010 అక్టోబరు నుంచి నెల్లూరు సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. 2014 ఫిబ్రవరి 12న తప్పించుకుని పారిపోయాడు. నాలుగున్నర సంవత్సరాల తర్వాత... 2018 నవంబరు 15న తప్పనిసరి పరిస్థితుల్లో లొంగిపోయాడు. అయితే...

మిగతా 13వ పేజీలో...



వివేకా హత్య గురించి జగన్‌కు అంతా తెలుసు!

- కేసును రాజకీయంగా వాడుకుని వదిలేశారు
- న్యాయం జాప్యం కాలేదు.. తిరస్కరణకు గురైంది
- సుప్రీంకోర్టు పునర్విచారణకు ఆదేశించాలి
- దర్యాప్తును నాటి వైసీపీ ప్రభుత్వం అడ్డుకుంది
- సీబీఐ అధికారులపైనే తప్పుడు కేసులు పెట్టించింది
- అసలు దోషులను గుర్తించకుండానే దర్యాప్తు పూర్తయిందని సీబీఐ తేల్చేసింది
- చార్జిషీటులోనూ కీలకాంశాలు దాచింది
- వివేకా కుమార్తె సునీతారెడ్డి వెల్లడి

13

ఇక కొత్త ఆదాయ పన్ను చట్టం!

- బిల్లును ఆమోదించిన లోక్‌సభ
- కొత్త చట్టంలో ఆలస్యంగా రిటర్న్‌లు ఫైల్ చేసినా రిఫండ్స్



న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఆదాయ పన్ను (ఐటీ) చట్టం మరింత సులభతరంకానుంది. ఇందుకోసం ఆదాయ పన్ను బిల్లు, 2025 పేరుతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బిల్లును లోక్‌సభ సోమవారం మూజువాణి ఓటుతో ఆమోదించింది. పన్ను చెల్లింపుదారుల ందరికీ సులభంగా అర్థమయ్యేలా ఈ బిల్లును రూపొందించినట్టు ప్రభుత్వం వెల్లడించింది. రాజ్యసభ ఆమోదం తర్వాత రాష్ట్రపతి ఆమోద ముద్ర వేస్తే వచ్చే ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ బిల్లు 'ఆదాయ పన్ను చట్టం, 2025' పేరుతో అమల్లోకిరానుంది. ఈ బిల్లులోని ప్రధానాంశాలు ఏమిటంటే..

రిఫండ్స్‌పై ఊరట..

కొత్త ఐటీ చట్టంలో ఆలస్యంగా ఐటీ రిటర్న్‌లు దాఖలు చేసే వారికి రిఫండ్స్ రద్దు చేస్తారనే ప్రచారం జరిగింది. అయితే అలాంటిదేమీ లేకుండా ఆలస్యంగా రిటర్న్‌లు ఫైల్ చేసే వారికీ రిఫండ్స్‌ను అనుమతించబోతున్నారు. అనారోగ్యం, సాంకేతిక సమస్యలతో సకాలంలో ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేయలేని వారికి ఇది పెద్ద ఊరట కానుంది. ఇక టీడీఎస్ చెల్లింపుదారులకూ కొత్త ఐటీ చట్టం ఊరట కల్పించనుంది. ఈ వివరాలు ఆలస్యంగా ఫైల్ చేసినా జరిమానాలు ఉండవు. అలాగే టీడీఎస్ చెల్లింపు భారం లేని పన్ను చెల్లింపుదారులు ముందుగానే 'నిల్ టీడీఎస్' సర్టిఫికెట్ పొందేందుకూ అవకాశం లభించనుంది.

కమ్యూటెడ్ పెన్షన్‌పై..

ప్రస్తుతం ఉద్యోగులకు కమ్యూటెడ్ పెన్షన్‌పై పన్ను మినహాయింపు సదుపాయం ఉంది. ఇప్పుడు ఈ ప్రయోజనాన్ని ఉద్యోగేతరులకూ విస్తరించబోతున్నారు. ఎల్ఐసీ పెన్షన్ ఫండ్ వంటి ప్రత్యేక ఫండ్స్ నుంచి ఒకేసారి ఏకమొత్తంలో పెన్షన్ అందుకునే వారికీ ఈ ప్రయోజనం లభిస్తుంది.

ఆస్తి పన్నుపై స్పష్టత

గృహ ఆస్తుల ఆదాయం పన్ను మదింపుపైనా కొత్త చట్టంలో ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. మునిసిపల్ ట్యాక్స్‌లు పోగా వచ్చే వార్షిక ఆదాయం నుంచి 30 శాతాన్ని స్టాండర్డ్ డిడక్షన్‌గా అనుమతిస్తారు. ఇల్లు కొనేందుకు, నిర్మించేందుకు లేదా మరమ్మతు చేయించేందుకు చేసిన అప్పులపై చెల్లించే వడ్డీకి కూడా గృహ యజమానులు ఈ ఆదాయం నుంచి డిడక్షన్ పొందవచ్చు. గృహాస్తి మొత్తాన్ని లేదా కొంత భాగాన్ని మాత్రమే అద్దెకు ఇస్తే.. సముచిత లేదా వాస్తవ అద్దె ఆదాయం.. ఈ రెండింటిలో ఏది ఎక్కువైతే దాన్ని మాత్రమే గృహాస్తి ఆదాయంగా పరిగణిస్తారు. కాగా, కొత్త చట్టంలో ప్రస్తుత ఆదాయ శ్లాబులు యథాతథంగా ఉండనున్నాయి.

లోకం తీరు



నేడే పార్లమెంట్ నిరవధిక వాయిదా?

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఉభయ సభలను మంగళవారం నిరవధికంగా వాయిదా వేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. వర్షాకాల సమావేశాలను ఈ నెల 21 వరకు కొనసాగించాలని కేంద్రం ముందుగా నిర్ణయించినా.. వారం ముందే వాయిదా వేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. బిహార్‌లో ఓటర్ల జాబితా విస్తృత సవరణ (ఎస్ఐఆర్), దేశవ్యాప్తంగా ఓట్ల చోరీపై ప్రతిపక్షాల నిరసన ఉధృతం కావడం, గత మూడు వారాలుగా ఉభయ సభలు స్తంభించిపోవడంతో ఆత్మరక్షణలో పడిన కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సోమవారం ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యులు గందరగోళం సృష్టించి ఎన్నికల కమిషన్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లడంతో.. కీలకమైన బిల్లులను ఎన్డీయే భాగస్వామ్య పార్టీల మద్దతుతో ఆమోదించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అత్యంత కీలకమైన జాతీయ క్రీడా పాలనా బిల్లు, జాతీయ యాంటీ డోపింగ్ (సవరణ) బిల్లు, ఆదాయ పన్ను బిల్లు వంటి వాటిని లోక్‌సభ ఆమోదించింది. మరోవైపు రాజ్యసభలో మర్చంట్ షిప్పింగ్ బిల్లు, గోవా అసెంబ్లీలో ఎస్టీ ప్రాతినిధ్యాన్ని సవరించే బిల్లును ఆమోదించారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించే ప్రతిపాదనల్లేవు: నిర్మల

న్యూఢిల్లీ, ఆగస్టు 11: పాత పెన్షన్ పథకాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించే ప్రతిపాదన ఏది ప్రస్తుతం కేంద్రం పరిశీలనలో లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఖజానాపై దీర్ఘకాలిక భారం పడుతుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఓపీఎస్ స్థానంలో జాతీయ పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్)ను తీసుకువచ్చినట్లు సోమవారం లోక్‌సభలో చెప్పారు. సైన్యాన్ని మినహాయించి కేంద్ర సర్వీసులలో జనవరి 1, 2004 తర్వాత చేరిన ఉద్యోగులకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్పీజీలో తొలి మహిళా అధికారి 'అదాసో కపెసా'



ప్రధాని మోదీ భద్రతా విభాగంలో అధికారిగా అదాసో కపేసా

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇటీవల యూకే పర్యటనలో ఉన్నప్పుడు సోషల్ మీడియాలో ఓ ఆసక్తికరమైన ఫొటో వైరల్‌గా మారింది. అది ప్రధాని మోదీది కాదు ఆయన వెనుక అచంచలంగా నిలబడి ఉన్న ఓ మహిళా అధికారిది. ఆమె పేరు అదాసో కపెసా భారత ప్రధాని వ్యక్తిగత భద్రతా విభాగం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీజీ)లో చేరిన తొలి మహిళా అధికారిగా ఆమె గుర్తింపు పొందారు. 1885లో ఏర్పాటైన ఎస్పీజీలో ఓ మహిళా అధికారి విధులు నిర్వర్తించడం ఇదే తొలిసారి కావడం విశేషం. మణిపుర్‌లోని సేనాపతి జిల్లా కైబీ గ్రామానికి చెందిన కపెసా ప్రస్తుతం ఎస్పీజీలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. అంతకుముందు ఆమె సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ)లో చేరి 55వ బెటాలియన్‌లో ఉత్తరాఖండ్‌లోని పిథోర్‌గఢ్‌లో సేవలందించారు. ఓ మారుమూల గ్రామం నుంచి ఎస్పీజీలో అధికారిగా ఎదిగిన కపెసా ప్రయాణం తన వ్యక్తిగత విజయం మాత్రమే కాకుండా తనలాంటి ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

యుద్ధాన్ని ఆపేందుకు సహకరిస్తాం

- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఉక్రెయిన్ యుద్ధానికి సాధ్యమైనంత త్వరలో, శాంతియుత పరిష్కారం కనుగొనేందుకు అన్ని రకాలుగా సహకరిస్తామని ప్రధానమంత్రి మోదీ చెప్పారు. సోమవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడిన మోదీ.. ఈ విషయాన్ని ఆయనకు స్పష్టం చేశారు. మూడు రోజుల కిందట రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో చర్చించిన మోదీ.. తాజాగా ఉక్రెయిన్ అధ్యక్షుడితోనూ మాట్లాడారు. శాంతియుత పరిష్కారం కనుగొనేందుకు అన్ని విధాలా సహకరిస్తామని చెప్పారు. అలాగే భారత్-ఉక్రెయిన్ సంబంధాల బలోపేతానికి కూడా కట్టుబడి ఉన్నామని తెలిపారు. శాంతి ప్రయత్నాల్లో మోదీ మద్దతుగా నిలుస్తామని ప్రకటించడాన్ని అభినందిస్తూ జెలెన్‌స్కీ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. అయితే, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించాలని సూచించారు. యుద్ధాన్ని ముగించడంపై చర్చించేందుకు 15న అలాస్కాలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ కానున్న నేపథ్యంలో మోదీ ఉక్రెయిన్ అధ్యక్షుడితో మాట్లాడడం గమనార్హం.

ధర్మస్థళ వివాదంపై ఎన్‌హెచ్ఆర్‌సీ ఆరా

బెంగళూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ వివాదంలో జాతీయ మావన హక్కుల కమిషన్ జోక్యం చేసుకుంది. సిట్ కార్యాలయానికి మానవ హక్కుల కమిషన్ ప్రతినిధులు సోమవారం వచ్చారు. ఫిర్యాదుదారుడికి కల్పిస్తున్న భద్రత గురించి వారు ఆరా తీసినట్టు తెలిసింది. కేసు పూర్వాపరాలు, ఇప్పటి వరకూ సేకరించిన సమాచారాన్ని సిట్ అధికారులు అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. కాగా, మృతదేహాలను గుర్తించేందుకు సిట్ అధికారులు సాంకేతికతను వినియోగించడం ప్రారంభించారు. పాయింట్ నంబరు 13లో గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్‌ను(జీపీఆర్) ఉపయోగిస్తున్నారు. భూమిలోపల ఉన్న అనుమానాస్పద వస్తువులను గుర్తించేందుకు సిట్ బృందం జీపీఆర్, డ్రోన్‌లను వినియోగిస్తోంది.

న్యూఢిల్లీ-వాషింగ్టన్ నాన్‌స్టాప్ సర్వీసులు రద్దు

- విమానాల కొరత కారణంగా ఎయిరిండియా నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి న్యూఢిల్లీ, వాషింగ్టన్ డీసీ మధ్య నాన్‌స్టాప్ విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. విమానాల కొరత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. సెప్టెంబరు 1 తర్వాత న్యూఢిల్లీ నుంచి వాషింగ్టన్‌కు వెళ్లేవారుగానీ, వాషింగ్టన్ నుంచి న్యూఢిల్లీకి వచ్చేవారుగానీ తమ విమానాలను బుక్ చేసుకుంటే.. వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని ఎయిరిండియా ప్రకటించింది. వారి వెసులుబాటును బట్టి రీ బుకింగ్‌కు అవకాశం కల్పిస్తామని లేదంటే పూర్తి రిఫండ్‌తో టికెట్ డబ్బులు వెనక్కి ఇచ్చేస్తామని తెలిపింది.

ఎల్ఏసీ సమీపం నుంచి చైనా భారీ రైల్వే లైన్!

బీజింగ్, ఆగస్టు 11: భారత సరిహద్దులకు సమీపంలో భారీ రైల్వే మార్గం నిర్మాణానికి చైనా సిద్ధమైంది. జింజియాంగ్ ప్రావిన్స్‌లోని హోటన్ నుంచి టిబెట్‌లోని లాసా వరకు నిర్మిస్తున్న ఈ రైల్వే మార్గంలో కొంత వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ)కు బాగా దగ్గరి నుంచే వెళుతుంది. ఈ ఏడాదే ఈ రైల్వే మార్గం పనులు ప్రారంభం కానున్నాయని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ తాజా కథనంలో వెల్లడించింది. ఇది రక్షణ పరంగా, వ్యూహాత్మకంగా చైనాకు ప్రయోజనకరమని పేర్కొంది. మొత్తంగా టిబెట్‌ను చైనాలోని కీలక ప్రాంతాలకు అనుసంధానించేందుకు.. సుమారు రూ.4 లక్షల కోట్ల (45 బిలియన్ డాలర్లు) వ్యయంతో 5 వేల కిలోమీటర్ల పొడవునా చైనా చేపట్టిన నాలుగు రైల్వే మార్గాల్లో ఇది ఒకటని తెలిపింది. హిమాలయాల్లోని కారకోరం, కైలాష్, కున్‌లున్ పర్వత శ్రేణుల మీదుగా ఈ మార్గం సాగుతుందని పేర్కొంది. భారత్‌ను రక్షణపరంగా ఇది చికాకుపరిచేదేనని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ ఉద్రిక్త పరిస్థితులేవైనా తలెత్తితే.. ఎల్ఏసీ సమీపంలోకి భారీగా, వేగంగా సైన్యాన్ని, ఆయుధ సామగ్రిని తరలించేందుకు చైనాకు ఈ రైల్వే మార్గం ఉపకరిస్తుందని పేర్కొంటున్నారు.

కదం తొక్కిన విపక్షం

(మొదటిపేజీ తరువాయి)

పలువురు నేతలు మండిపడ్డారు. సోమవారం ఉదయం పార్లమెంట్ సమావేశం కాగానే.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను రద్దు చేయాలి.. ఓట్ల చోరీని నిలిపివేయాలి అని నినాదాలు చేస్తూ ప్రతిపక్ష సభ్యులు ఉభయ సభలను స్తంభింపజేశారు. దీంతో సభలు వాయిదా పడ్డాయి. అనంతరం ఉభయ సభలకు చెందిన దాదాపు 300 మంది ఇండియా కూటమి ఎంపీలు అక్కడి నుంచి ఎన్నికల కమిషన్ కార్యాలయానికి ప్రదర్శనగా బయలుదేరారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, ఎంపీ ప్రియాంకగాంధీ, సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్, ఎన్సీపీ-ఎస్పీ నేత శరద్‌పవార్, శివసేన నేతలు సంజయ్ రౌత్, ప్రియాంక చతుర్వేది, డీఎంకే నేత టీఆర్ బాలు, తృణమూల్ నేత డెరెక్ ఒబ్రెయిన్ సహా ఆర్జేడీ, లెఫ్ట్, ఆప్ నేతలు సైతం ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంతో ఎన్నికల కమిషన్ కుమ్మక్కై.. బీజేపీని గెలిపిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ మకర ద్వారం నుంచి బయలుదేరి ప్రదర్శనగా వెళుతుండగా.. పోలీసులు అడుగడుగునా బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకున్నారు.

బారికేడ్లు ఎక్కి.. నినాదాలు..

సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మహిళా ఎంపీలు మహువా మొయిత్రా, సంజనా జాదవ్, జ్యోతిమణి, ఎన్సీపీ నేత సుప్రియా సూలే.. బారికేడ్లపైకెక్కి ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఎంపి ప్రియాంకగాంధీ.. నిరసన జరిగినంతసేపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరకు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంకగాంధీ వాద్రా, అఖిలేశ్ యాదవ్, సంజయ్ రౌత్, ప్రియాంక చతుర్వేది సహా పలువురిని పోలీసులు బస్సుల్లోకి ఎక్కించి పార్లమెంట్ వీధిలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ తరువాత కొద్దిసేపటికి విడుదల చేశారు. కాగా, 30 మంది ఎంపీలను కలుసుకునేందుకు మాత్రమే ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చిందని, కానీ.. 200 మందికి పైగా నేతలు ర్యాలీలో పాల్గొన్నారని డిప్యూటీ పోలీస్ కమిషనర్ దేవేశ్‌కుమార్ మహా తెలిపారు. శాంతిభద్రతలను పరిరక్షించేందుకు వారిని నిలువరించి నిర్బంధించాల్సి వచ్చిందన్నారు. బారికేడ్లు దాటి ముందుకెళ్లే ప్రయత్నంలో పోలీసులతో ఘర్షణ పడిన తృణమూల్ ఎంపీలు మహువా మొయిత్రా, మిథాలీ బాగ్ స్పృహ తప్పి పడిపోయారు. వారికి రాహుల్‌గాంధీ సాయం అందించడంతో మహువా తేరుకున్నారు. మిథాలీ తేరుకోకపోవడంతో ఆమెను లోహియా ఆస్పత్రికి తరలించారు.



ర్యాలీకి ముందు పార్లమెంటు వద్ద విపక్ష ఎంపీలు, సొమ్మసిల్లి పడిపోయిన మహువాకు నీళ్లు తాగిస్తున్న రాహుల్

రాజకీయ యుద్ధం కాదు..

తమది రాజకీయ పోరు కాదని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు చేస్తున్న యుద్ధమని రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలో ఓట్లను కొల్లగొట్టి బీజేపీకి అనుకూలంగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరుపై తాము పోరాడుతున్నామని చెప్పారు. ఎన్నికల కమిషన్‌తో తాము మాట్లాడలేకపోతున్నామనేది వాస్తవమని, తమకు స్వచ్ఛమైన, నిజమైన ఓటర్ల జాబితా కావాలని డిమాండ్ చేశారు. ఒకే వ్యక్తికి ఒకే ఓటు ఉండాలన్న దానిపై తాము పోరాడుతున్నామని, వాస్తవాలను దేశ ప్రజలకు తెలియజేశామని పేర్కొన్నారు. కాగా, ఓట్ల చోరీపై తాము శాంతియుతంగా ప్రదర్శన చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు భయపడుతోందో తెలియడం లేదని ఖర్గే అన్నారు. మరోవైపు రాహుల్‌గాంధీ లేవనెత్తిన ప్రశ్నలకు ఎన్నికల కమిషన్ జవాబు ఇవ్వకుండా.. ప్రమాణం చేయడాలనడం విడ్డూరమని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యానించారు. పోలీసులతో నిర్బంధించడం ద్వారా ప్రతిపక్షాల గొంతు నొక్కలేరని అఖిలేశ్ యాదవ్ అన్నారు.

'ఓటు చోరీ'కి భారీ స్పందన

న్యూఢిల్లీ, ఆగస్టు 11: దేశవ్యాప్తంగా ఓట్ల చోరీకి నిరసనగా చేపట్టిన పోరాటానికి ప్రజల నుంచి భారీ స్పందన వస్తోందని రాహుల్‌గాంధీ తెలిపారు. 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా తాము ప్రారంభించిన వెబ్‌పోర్టల్‌లో ఇప్పటికే 15లక్షల మందికి పైగా రిజిస్టర్ అయ్యారని, 10 లక్షలకు పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయని పేర్కొన్నారు. ఈ ఉద్యమం మహోద్యమంగా మారిందని 'ఎక్స్'లో రాహుల్ పోస్ట్ చేశారు. "దేశంలో నిజమైన ప్రజాస్వామ్యానికి ఇది నిదర్శనం. అణచివేతకు గురైన గొంతుకలు మా ఉద్యమం ద్వారా ఎలుగెత్తుతున్నాయి" అని రాహుల్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఓట్ల చౌర్యం వ్యవహారంలో పార్టీ అగ్రనేత రాహుల్ ఓ వైపు పోరాటం చేస్తుండగా, 'ఎన్నికలప్పుడు కళ్లు మూసుకున్నారా..?' అని కర్ణాటక మంత్రి రాజణ్ణ చేసిన వ్యాఖ్యలు ఆయన పదవికి ఎసరు తెచ్చాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆదేశాలతో సీఎం సిద్దరామయ్య ఆయనను పదవి నుంచి తప్పించారు.

ప్రమాణ పత్రమైనా ఇవ్వండి క్షమాపణలైనా చెప్పండి

- ఓట్ల చోరీ ఆరోపణలపై రాహుల్‌కు మరోసారి ఈసీ డిమాండ్

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఓట్ల చోరీ జరిగిందంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై ఎన్నికల కమిషన్ (ఈసీ) మరోసారి తన వైఖరిని స్పష్టం చేసింది. "ఇంకా సమయం ఉంది. ఓట్ల చోరీ జరిగిందన్న ఆరోపణలను రుజువు చూపిస్తూ ప్రామాణిక డిక్లరేషన్‌పై సంతకం చేసి సమర్పించండి. లేదంటే దేశానికి క్షమాపణ చెప్పండి" అని డిమాండు చేసింది. కర్ణాటక, హరియాణా ప్రధాన ఎన్నికల అధికారులు రాహుల్ గాంధీకి నోటీసులు పంపించిన నేపథ్యంలో ఈసీ తన వాదనను పునరుద్ఘాటించింది. ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ విలేకరులకు చూపించిన పత్రాల్లో శకున్ రాణి అనే మహిళ రెండు సార్లు ఓటు వేసినట్టు ఉంది. తాము దర్యాప్తు జరపగా తాను రెండు సార్లు ఓటు వేయలేదని ఆమె చెప్పిందని, ఆమె ఓటు వేసినట్టు రెండు చోట్ల ఉన్న పత్రాల్లో టిక్ ఉండడం కూడా వాస్తవం కాదని కర్ణాటక ఎన్నికల అధికారి చెప్పారు. ఇదిలా ఉండగా, బిహార్‌లో ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాలపై ఇంతవరకు ఏ పార్టీ కూడా విజ్ఞప్తులు సమర్పించలేదని ఈసీ తెలిపింది. పేర్లు చేర్చాలనిగానీ, తొలగించాలనిగానీ కోరుతూ ఎలాంటి దరఖాస్తులు ఇవ్వలేదని పేర్కొంది.

హైకోర్టు జడ్జిల సామర్థ్యంపై సుప్రీం జడ్జిల కామెంట్లు వద్దు!

- హైకోర్టులు సుప్రీంకోర్టుకు సబార్డినేట్ కావు
- పనితీరు మెరుగుదలకు అంతర్గతంగా సూచనలు చేయవచ్చు: సీజేఐ గవాయ్

న్యూఢిల్లీ, ఆగస్టు 11: దిగువస్థాయి కోర్టుల న్యాయమూర్తుల సామర్థ్యం మీద ఉన్నతస్థాయి కోర్టుల జడ్జీలు వ్యాఖ్యలు చేయటం సరైనది కాదని సీజేఐ జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ జడ్జిపై ఇటీవల సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు తీవ్ర అలజడి సృష్టించటం, ఆ వ్యాఖ్యల్ని సదరు ధర్మాసనం ఉపసంహరించుకోవటం తెలిసిన విషయమే. ఈ నేపథ్యంలోనే, ఒక ఆంగ్లపత్రికతో సీజేఐ మాట్లాడుతూ.. ఈ స్పష్టతనిచ్చారు. 'హైకోర్టులు సుప్రీంకోర్టుకు సబార్డినేట్ (దిగువస్థాయి) కావు. రెండూ కూడా రాజ్యాంగ కోర్టులే. హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు సవరించవచ్చు. మెరుగుపర్చవచ్చు. మొత్తంగా పక్కన పెట్టవచ్చు. అంతే. ఒక హైకోర్టు న్యాయమూర్తి సామర్థ్యం, పనితీరు, పరిజ్ఞానంపై వ్యాఖ్యానించే అధికారం రాజ్యాంగం సుప్రీంకోర్టుకు ఇవ్వలేదు' అని జస్టిస్ గవాయ్ వెల్లడించారు. ఇదే సూత్రం హైకోర్టు జడ్జీలకూ వర్తిస్తుందని, కింది స్థాయి కోర్టుల న్యాయాధికారుల మీద వారు కూడా కామెంట్లు చేయవద్దన్నారు. అయితే, పనితీరును ఎలా మెరుగుపర్చుకోవాలి? ఏ అంశాలపై దృష్టి సారించాలి? అన్నదానిని అంతర్గతంగా ఉన్న విధానాల ద్వారా దిగువ కోర్టుల జడ్జీలు, న్యాయమూర్తులకు తెలియజేయవచ్చన్నారు. ఇదిలా ఉండగా, ఆర్మీలోని న్యాయ విభాగంలో జడ్జి అడ్వకేట్ జనరల్ (జేఏజీ) పోస్టుల నియామకంలో మహిళలపై ఉన్న పరిమితులను ఎత్తివేస్తూ సుప్రీంకోర్టు సోమవారం ఆదేశాలు ఇచ్చింది. జేఏజీ ఎంట్రీ స్కీంలో ఆరు పోస్టులను పురుషులకు, మూడింటిని మహిళలకు కేటాయిస్తూ భర్తీ ప్రక్రియను నిర్వహించగా అది సరైన విధానం కాదని తెలిపింది. సమానత్వం పాటించాలని, ప్రతిభకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది.

రిజర్వేషన్లలో ఆదాయ పరిమితిపై విచారణకు సుప్రీం ఓకే

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లలో చాలావరకు ఆయా వర్గాల్లో సామాజికంగా, ఆర్థికంగా బలంగా ఉన్నవారికే దక్కుతున్నాయని.. అందువల్ల రిజర్వేషన్లలో అంతర్గతంగా ఆదాయ పరిమితి విధించేలా కేంద్రాన్ని ఆదేశించాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. రమాశంకర్ ప్రజాపతి, యమునా ప్రసాద్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు పరిశీలించింది. దేశంలో దశాబ్దాలుగా రిజర్వేషన్లను అమలు చేస్తున్నా... ఆయా కేటగిరీల్లోని కొన్ని వర్గాల వారే ప్రయోజనం పొందుతున్నారని, బాగా వెనుకబడినవారి పరిస్థితి ఏమాత్రం మారడం లేదని పిటిషనర్లు కోర్టుకు విన్నవించారు. ఆయా కేటగిరీలలో అంతర్గతంగా ఆదాయ పరిమితిని అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని, ఆ దిశగా చర్యలు చేపట్టేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌ను ధర్మాసనం.. విచారణకు స్వీకరించింది. పిటిషనర్ లేవనెత్తిన అంశాలపై అక్టోబర్ 10లోపు స్పందించాలంటూ కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.

ఢిల్లీ వీధుల్లో ఒక్క కుక్కా కనిపించొద్దు

అన్నింటినీ షెల్టర్లకు తరలించండి.. అడ్డుపడే సంస్థలపై కఠిన చర్యలు తప్పవు

- వీధి కుక్కల దత్తతను అనుమతించొద్దు
- ఢిల్లీ అధికారులకు సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 11: దేశ రాజధానిలో పెద్ద బెడదగా మారిన వీధికుక్కల సమస్యపై సుప్రీంకోర్టు సుమోటోగా స్పందించింది. ఢిల్లీ- ఎన్‌సీఆర్ పరిధిలో ఒక్క కుక్క కూడా వీధుల్లో కనిపించడానికి వీల్లేదని, వాటన్నింటినీ తక్షణం షెల్టర్లకు తరలించాలని అధికారులను ఆదేశించింది. ఈ తరలింపు ప్రక్రియకు అడ్డుపడే సంస్థలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఇందులో మినహాయింపులకు తావు లేదని తేల్చిచెప్పింది. కుక్క కాటు ఘటనలు, రేబిస్ కారణంగా మరణాల సంఖ్య బాగా పెరిగిపోయింది. దీనిపై పత్రికలు, మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం విచారణను చేపడుతోంది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వాదనలను మాత్రమే తాము పరిగణనలోకి తీసుకుంటామని, శునక ప్రియుల పిటిషన్లను పట్టించుకోబోమని బెంచ్ స్పష్టం చేసింది. "ఇది మా కోసం తీసుకుంటున్న నిర్ణయం కాదు. ప్రజల ప్రయోజనాలే ఇందులో ప్రధానం. అందువల్ల ఏ తరహా సెంటిమెంట్లను మేం అనుమతించబోం. స్టెరిలైజేషన్ (కుటుంబ నియంత్రణ ఆపరేషన్) జరిపిన తర్వాత కూడా కుక్కలను వదిలిపెట్టొద్దు" అని జస్టిస్ పార్దివాలా తేల్చిచెప్పారు. ఈ సమస్యపై ఎటువంటి చర్యలు చేపట్టేందుకు వీలున్నదో అమికస్ క్యూరీ గౌరవ్ అగర్వాల్ చెప్పే ప్రయత్నం చేయగా, కొంతకాలానికి అన్ని నిబంధనలు పక్కనబెట్టి, అన్ని ఏరియాల్లో కుక్కలను పట్టుకుని షెల్టర్లకు తరలించాలని ఆయన తెలిపారు. ఈ పనులను పౌర సంస్థలు చేయగలిగితే సరేనని.. లేదంటే ప్రత్యేక బృందాలను నియమిస్తామని బెంచ్ అనగా, కోర్టు నిర్ణయాన్ని తు.చ. తప్పక పాటిస్తామని ఢిల్లీ ప్రభుత్వ అధికారులు తెలిపారు. కాగా, ఈ ఏడాది జనవరి నుంచి జూన్‌వరకు దేశ రాజధానిలో 49 రేబిస్ కేసులు, 35,198 కుక్క కాటుకు సంబంధించిన ఘటనలు నమోదయ్యాయి. అలాగే, దేశవ్యాప్తంగా ఏటా ఆరువేలమంది కుక్క కాటు, రేబిస్ కారణంగా మరణిస్తున్నారు.

'గుడ్, బ్యాడ్ అండ్ అగ్లీ' సినిమా ప్రస్తావన

జంతు ప్రేమికుల తీరుపై బెంచ్ తీవ్రస్వరం వినిపించింది. "రేబిస్ కారణంగా ఆత్మీయులను కోల్పోయిన కుటుంబసభ్యులకు తిరిగి వారిని ఈ జంతు ప్రేమికులు తెచ్చి ఇస్తారా?" అంటూ ఆగ్రహించింది. ఈ సమయంలో 'గుడ్, బ్యాడ్ అండ్ అగ్లీ' అనే సినిమాను ప్రస్తావించింది. "కాల్చాలనుకుంటే కాల్చడమే. అక్కడ మాటలు అవసరం లేదు. ఇది మాటలకు సమయం కాదు. చేతల్లో చూపించాలి." అని వ్యాఖ్యానించింది. హెల్ప్‌లైన్‌ను ఒక వారంలో ఏర్పాటు చేయాలని బెంచ్ ఆదేశించింది. వీధి కుక్కలను ఉంచేందుకు షెల్టర్లను 8 వారాల్లో ఏర్పాటు చేసి, తమకు తెలియజేయాలని కోర్టు ఢిల్లీ ప్రభుత్వాన్ని, మున్సిపల్ కార్పొరేషన్లను ఆదేశించింది. ఈ షెల్టర్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేసేందుకు తగినంత మంది సిబ్బంది ఉండాలని పేర్కొంది.

రూ.15వేల కోట్లు అవసరం: మేనకా గాంధీ

సుప్రీంకోర్టు ఆదేశాలపై జంతు ప్రేమికురాలు, కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీ మాట్లాడుతూ కుక్కల షెల్టర్లకు అవసరమయ్యే నిధులు, స్థలాలు పురపాలక సంఘాల వద్ద ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. ఢిల్లీలోని కుక్కల పునరావాసానికి రూ.15వేల కోట్లు అవసరం ఉంటుందని తెలిపారు. పెద్ద ఎత్తున కుక్కలను తరలించడం అనేది 'అశాస్త్రీయం', 'వ్యర్థ ప్రయాస' అని జంతు ప్రేమికుల సంస్థ 'పెటా' అభిప్రాయపడింది. వీధి కుక్కలను జైల్లో పెట్టి సాధించేది కూడా ఏమీ ఉండబోదని పేర్కొంది. ఉమీద్ ఫర్ యానిమల్స్ ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకుడు నిఖిల్ మహేష్ మాట్లాడుతూ ఈ తీర్పును సవాలు చేస్తామని తెలిపారు. కాగా, పలు కాలనీ సంఘాలు తీర్పును స్వాగతించాయి. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా విలేకరులతో మాట్లాడుతూ తీర్పునకు అనుగుణంగా విధానాన్ని రూపొందించి, ప్రణాళికా బద్ధంగా అమలు చేస్తామని చెప్పారు.

ఎంపీల నివాస భవనాలకు నదుల పేర్లు!

- ప్రారంభించిన ప్రధాని మోదీ



ఢిల్లీలో ఎంపీల కోసం నిర్మించిన అపార్ట్‌మెంట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 11: భవనాలు, నివాసాలకు నదుల పేర్లు పెట్టే సంప్రదాయం.. ప్రజలను ఏకం చేస్తుందని ప్రధాని మోదీ అన్నారు. పార్లమెంటు సభ్యుల కోసం ఢిల్లీలో నిర్మించిన బహుళ అంతస్తుల నివాస సముదాయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఇందులో ఉన్న నాలుగు బ్లాకులకు.. కృష్ణా, గోదావరి, హుగ్లీ, కోసీ నదుల పేర్లు పెట్టారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిపెట్టుకునే కోసీ నది పేరుపెట్టారంటూ కురుచబుద్ధి కలిగిన కొందరు విమర్శిస్తున్నారని.. నదుల పేర్లు పెట్టడం వల్ల ప్రజలు ఏకమవుతారని ప్రధాని ఈ సందర్భంగా అన్నారు. పార్లమెంటు భవనం సమీపాన బాబా ఖరక్‌సింగ్ మార్గ్‌లో నిర్మించిన ఈ కాంప్లెక్స్‌లో ఒక్కోటీ 5 వేల చదరపు అడుగుల వైశాల్యం కలిగిన 350 ఫ్లాట్లు ఉన్నాయి. ఇక్కడ వివిధ రాష్ట్రాలు, ప్రాంతాలకు చెందిన ఎంపీలు నివసించబోతున్నారని.. 'ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్' స్ఫూర్తికి నిలువుటద్దంలా నిలుస్తారని తెలిపారు. ఈ సముదాయంలో విభిన్న పండుగలు జరుపుకోవాలని.. వీటికి తమ నియోజకవర్గ ప్రజలను కూడా ఆహ్వానించవచ్చని సూచించారు. కొత్త నివాస సముదాయాన్ని పర్యావరణం, పరిశుభ్రతకు ప్రతీకగా ఎంపీలు మలచాలన్నారు. పరిశుభ్రతపై ఏటా రెండు మూడు పోటీలు నిర్వహించాల్సిందిగా పట్టణాభివృద్ధి శాఖ, రెసిడెన్షియల్ కమిటీలను కోరతానని చెప్పారు. దేశ రాజధానిలో ఎంపీలకు చాలా కాలంగా నివాస కొరత ఉందని ప్రధాని గుర్తుచేశారు. ముఖ్యంగా తొలిసారి గెలిచి వచ్చినవారికి వసతి దొరకడం క్లిష్టంగా మారిందన్నారు. కొత్త కాంప్లెక్స్ నిర్మాణంతో ఆ కష్టాలు తీరాయని చెప్పారు. 2004-14 నడుమ నాటి యూపీఏ ప్రభుత్వం ఒక్క నివాసాన్ని కూడా నిర్మించలేదని ఆక్షేపించారు. తన ప్రభుత్వం 350 ఫ్లాట్లు ఇప్పుడు నిర్మించి అందుబాటులోకి తెచ్చిందన్నారు.

ఇజ్రాయెల్ దాడుల్లో ఐదుగురు జర్నలిస్టుల మృతి

గాజా, ఆగస్టు 11: గాజాలో ఇజ్రాయెల్ సైన్యం జరిపిన తాజా బాంబు దాడుల్లో అల్ జజీరాకు చెందిన ఐదుగురు జర్నలిస్టులు సహా ఏడుగురు మరణించారు. ఆదివారం అల్ షిఫా ఆస్పత్రి ఆవరణలోని మీడియా టెంట్‌పై ఈ దాడి జరిగింది. మృతుల్లో తమ సంస్థ కరస్పాండెంట్లు అనస్ అల్ షరీఫ్, మొహమ్మద్ క్రీకె, కెమెరామెన్ ఇబ్రహీం జహీర్, మోమెన్ అలీవా, మొహమ్మద్ నౌఫల్ ఉన్నట్టు అల్ జజీరా తెలిపింది. అయితే, మృతుల్లో ఒక ఉగ్రవాది ఉన్నాడని ఇజ్రాయెల్ మిలిటరీ ప్రకటించింది. అనస్ అల్ షరీఫ్ కొంతకాలం హమాస్ ఉగ్రవాద సెల్‌కు అధ్యక్షుడిగా పనిచేశాడని తెలిపింది. జర్నలిస్టు ముసుగులో ఉగ్రవాద కార్యకలాపాలను కొనసాగించాడని, ఇజ్రాయెల్ పౌరులపైనా, ఐడీఎఫ్ దళాలపైనా రాకెట్ దాడులు జరగడానికి అతనే కారణమని పేర్కొంది. ఇజ్రాయెల్ ఆరోపణలను అల్ జజీరా సంస్థ ఖండించింది. గాజాపై ఇజ్రాయెల్ తీవ్రతరం చేసిన తాజా బాంబు దాడులను మరణానికి కొన్ని క్షణాల ముందు తన 'ఎక్స్' ఖాతాలో కూడా షరీఫ్ పోస్టు చేశాడు. వార్తను ప్రసారం చేసే సమయంలో అల్ జజీరా చానల్ యాంకర్ భావోద్వేగానికి గురయ్యారు. ఈ దాడిని ఐరాస మానవ హక్కుల కార్యాలయం కూడా ఖండించింది. మరోవైపు గాజాపై గత 22 నెలలుగా ఇజ్రాయెల్ జరుపుతున్న దాడుల్లో సుమారు 200 మంది జర్నలిస్టులు మరణించినట్టు మీడియా పేర్కొంది.

పాతికేళ్ల తర్వాత... పద్మిని కొడుకొచ్చాడు!

- కుటుంబ కలహాలతో విడిపోయిన తల్లీకొడుకు
- చనిపోయే లోపు బిడ్డను చూడాలని.... కలెక్టర్‌కు వృద్ధురాలి అర్జీ
- ఆచూకీ తెలుసుకుని ఇద్దరిని కలిపిన పోలీసులు


భావోద్వేగానికి గురైన తల్లిని ఓదారుస్తున్న శ్రీరాములు

కె.గంగవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఏమిచ్చినా కన్నతల్లి రుణం తీర్చుకోలేనిది. ఎంత కోపమున్నా కన్న బిడ్డలపట్ల తల్లి ప్రేమ ఏమాత్రం తగ్గదు. కన్నేళ్ల క్రితం కుటుంబ కలహాలతో తల్లి, కొడుకులు విడిపోయారు. సుమారు 25 ఏళ్లగా ఒకరినొకరు చూసుకోలేదు. ఒకరి యోగ క్షేమాలు ఒకరికి తెలియవు. వృద్ధాప్యంతో ఉన్న ఆ కన్నతల్లికి చివరిసారిగా తన కొడుకును చూడాలనే కోరికతో అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌ను కలిసి ఆవేదన వినతి పత్రం అందజేసింది. కలెక్టర్ ఆదేశాలతో రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, సీఐ వెంకట నారాయణ సూచనలతో పామర్రు ఎస్ఐ ఎస్కె జానీబాషా తల్లీ, కొడుకులను కలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం పామర్రు గ్రామానికి చెందిన శీలం పద్మిని(80)కి ఇద్దరు కుమార్తెలు సుబ్బలక్ష్మి, వసంత, కుమారుడు శ్రీరాములు ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా తల్లి, కుమారుడు విడిపోయారు. దీంతో పద్మిని కుమార్తెల వద్ద ఉంటోంది. ప్రస్తుతం ఆమె తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరి గ్రామంలో ఉంటున్న చిన్న కుమార్తె వద్ద ఉంటోంది. చనిపోయేలోపు తన కుమారుడిని కడసారి చూసుకోవాలని తలంచి కోనసీమ జిల్లా కలెక్టరుకు అర్జీ పెట్టుకుంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో కె.గంగవరం మండలం పామర్రు ఎస్ఐ ఎస్కె జానీబాషా చర్యలు చేపట్టారు. శ్రీరాములు విశాఖపట్నంలో స్థిరపడినట్లు, ఉపాధి కోసం కువైట్‌కు వెళ్లినట్లు గుర్తించారు. శ్రీరాములు కుటుంబ సభ్యులతో వారు మాట్లాడారు. కువైట్‌లో ఉన్న శ్రీరాములుకు విషయం తెలియజేసి విశాఖ వచ్చేలా చర్యలు తీసుకున్నారు. అక్కడ నుంచి వేమగిరిలో రెండవ కుమార్తె వసంత దగ్గర ఉంటున్న పద్మిని వద్దకు ఆదివారం రాత్రి తల్లీ, కొడుకులను కలిపారు. సుమారు 25 సంవత్సరాల తరవాత తన కొడుకును చూసుకున్న ఆనందంలో పద్మిని ఉద్వేగానికి గురయ్యారు. కన్నతల్లిని చూసిన ఆనందంలో శ్రీరాములు ఆనందంతో ఉప్పొంగిపోయ్యారు. ఈ సందర్భంగా కోనసీమ జిల్లా కలెక్టర్, పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

జగన్ మేనమామపై కేసు నమోదు

- తిరుమలలో రవీంద్రనాథ్‌రెడ్డి రాజకీయ వ్యాఖ్యలపై చర్యలు

తిరుమల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారి ఆలయం ముందు రాజకీయ వ్యాఖ్యలు చేసిన మాజీ సీఎం జగన్‌రెడ్డి మేనమామ, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిపై కేసు నమోదైంది. ఆదివారం ఉదయం స్వామిని దర్శించుకున్న అనంతరం రవీంద్రనాథ్‌రెడ్డి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. తిరుమల పవిత్రతను కాపాడటానికి ఏడు కొండల ప్రాంతంలో రాజకీయ, ద్వేషపూరిత ప్రసంగాలను నిషేధిస్తూ గత నవంబరు 18న టీటీడీ బోర్డు తీర్మానం చేసిందని, రవీంద్రనాథ్‌రెడ్డి ఈ నిబంధనలను ఉల్లంఘించారని టీటీడీ విజిలెన్స్ వింగ్ ఏవీఎస్వో దామోదర్ ఆదివారం రాత్రి తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏపీ పీఆర్ యాక్ట్-1994, ఆర్‌డబ్ల్యూ 114 ఆఫ్ ఎండోమెంట్ యాక్ట్-1984, 223 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రాష్ట్రపతి ముర్ముతో ఏపీ విద్యార్థినులు

రాష్ట్రపతికి రాఖీ కట్టిన ఏపీ విద్యార్థులు

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన పలువురు విద్యార్థినులు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. శనివారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి రాఖీలు కట్టారు. దేశవ్యాప్తంగా 720 మంది విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొనగా రాష్ట్రం నుంచి ఎనిమిది మందికి అవకాశం దక్కింది. బాపట్ల జిల్లాకు చెందిన బి.హేమ, పి.శైలజ, చిన గంజాంకు చెందిన డి.కీర్తి, బి.ప్రజ్ఞ, ఎన్టీఆర్ జిల్లా విద్యార్థినులు కె.రామతులసి, జి.కృపా, విజయవాడ పటమట విద్యార్థినులు సీహెచ్ శ్రావణి, ఎస్.రామలక్ష్మి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. టీచర్లు కేసీహెచ్ శాంతమ్మ, షేక్ కరీమా, ఎం.పుష్యరాగం విద్యార్థినులకు ఎస్కార్టులుగా వ్యవహరించారు.

ఏపీడీసీఎఫ్ఎల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా రాజేశ్‌కుమార్



అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టులో ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ తరపున వాదనలు వినిపించేందుకు న్యాయవాది గుండపు రాజేశ్‌కుమార్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు.

ఏపీలో 'క్రీడల అభివృద్ధి' లబ్ధిదారులు లేరు

- సరైన ప్రతిపాదనలు అందలేదు: కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గడచిన మూడేళ్లలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'క్రీడల మానవ వనరుల అభివృద్ధి' పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎవరికీ ఫెలోషిప్, సదస్సు, పరిశోధన నిధులు ఇవ్వలేదని కేంద్ర క్రీడల మంత్రి మాన్సుఖ్ మాండవియా వెల్లడించారు. సోమవారం లోక్‌సభలో ఎంపీ కేశినేని శివనాథ్ అడిగిన ప్రశ్నకు ఆయన లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. ఈ పథకం ద్వారా క్రీడాకారులు, కోచ్‌లు, సాంకేతిక నిపుణులు, విద్యార్థులు, పరిశోధకుల నైపుణ్యాలు, జ్ఞానం పెంచడానికి ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందని తెలిపారు. అయితే, గత మూడేళ్లలో దేశవ్యాప్తంగా కేవలం ఇద్దరే ఫెలోషిప్ పొందగా, వారిలో ఎవరూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు లేరని స్పష్టం చేశారు. మూడేళ్లలో దేశవ్యాప్తంగా 2 ఫెలోషిప్పులు, 47 సదస్సులు, 12 పరిశోధన ప్రాజెక్టులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఏపీ నుంచి సరైన ప్రతిపాదనలు అందకపోవడాన్నిబట్టి ఈ రాష్ట్రంలో లబ్ధిదారులు లేనట్లు స్పష్టమవుతోందన్నారు.

సింగిల్ విండోలోనే బహుళ అంతస్తులకు ఎన్ఓసీలు

- మంత్రుల భేటీలో నిర్ణయం

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బహుళ అంతస్తుల భవనాలకు మున్సిపల్ శాఖ తెస్తున్న సింగిల్ విండో విధానం ద్వారానే అగ్నిమాపక శాఖ నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) జారీ చేయనుంది. సోమవారం అమరావతి సచివాలయంలో పురపాలక, అగ్నిమాపక శాఖల సమన్వయ సమావేశంలో ఈమేరకు నిర్ణయించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మంత్రి పి. నారాయణ, హోంమంత్రి అనిత, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బహుళ అంతస్తుల భవనాలకు అగ్నిమాపకశాఖ ఎన్‌వోసీ జారీ నిబంధనలపై మంత్రులు, అధికారుల మధ్య చర్చ జరిగింది. బహుళ అంతస్తుల భవనాలకు ఏపీడీపీఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతులు ఇచ్చేందుకు అగ్నిమాపకశాఖ అంగీకరించింది.

హజ్ యాత్రకు 2,649 దరఖాస్తులు

- 2019 తర్వాత అత్యధిక యాత్రికులు: మంత్రి ఫరూక్


అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలతో హజ్-2026 యాత్రకోసం 2649 మంది యాత్రికులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారని మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఇందులో 2314 మంది అర్హులుగా గుర్తించామని, 2019 తర్వాత ఏపీ నుంచి హజ్ యాత్రకు వచ్చిన దరఖాస్తుల్లో ఇదే అత్యధికమని మంత్రి తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి వెళ్లే వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గతేడాది ప్రకటించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. 2025లో ఇలా ఒక్కొక్కరికి లక్ష చొప్పున 72 మందికి జమ చేసి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చిందని పేర్కొన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పునరుద్ధరణతో యాత్రికుల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు.

ఐజేయూ సెక్రటరీ జనరల్‌గా సోమసుందర్

- ఒకే ఒక్క నామినేషన్ దాఖలు.. ప్రకటన లాంఛనమే

తాడేపల్లిగూడెం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయూ)లో ఆంధ్రప్రదేశ్‌కు అరుదైన అవకాశం దక్కింది. ఐజేయూ సెక్రటరీ జనరల్‌గా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ దూసనపూడి సోమసుందర్ ఎంపిక కానున్నారు. ఆయన ఇప్పటికే ఉమ్మడి రాష్ట్ర ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడిగా, రాష్ట్రం విడిపోయిన తర్వాత రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన ఐజేయూ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. సోమసుందర్ నామినేషన్‌ను ఏపీయూడబ్ల్యూజే, టీయూడబ్ల్యూజేతో పాటు 17 రాష్ట్రాలు బలపరిచాయి. ఐజేయూ అధ్యక్ష పదవికి ప్రస్తుత సెక్రటరీ జనరల్ బల్వీందర్ సింగ్ నామినేషన్ దాఖలు చేశారు. రెండు పదవులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో వీరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. నామినేషన్‌ను పాట్నాలో ఎన్నికల ప్రధాన అధికారి మహేష్ సిన్హాకు సోమసుందర్ సోమవారం సాయంత్రం అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు ఈ కార్యక్రమానికి హాజరై సోమసుందర్‌తో నామినేషన్ వేయించారు.

మనిషి రూపంలో.. గొర్రెపిల్ల!


మనిషి వీపును పోలిన గొర్రెపిల్ల వెనుక భాగం,


మానవముఖంతో..

తమిళనాడు రాష్ట్రం కళ్లకుర్చి జిల్లాలో మనిషి రూపంతో పుట్టిన గొర్రెపిల్ల అందరినీ ఆశ్చర్యపరచింది. సేందమంగళం గ్రామంలోని ఆనందన్‌కు చెందిన గొర్రె ఆదివారం రెండు పిల్లలకు జన్మనిచ్చింది. వాటిల్లో ఒకటి సాధారణంగానే ఉండగా, మరొకదాని ముఖం, వీపు భాగం, మరికొన్ని అవయవాలు మనిషిని పోలి ఉన్నాయి. పుట్టిన కొద్దిసేపటికే ఈ గొర్రె పిల్ల చనిపోయినా.. ఈ విషయం అంతటా వ్యాపించడంతో పరిసర గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకుని గొర్రెపిల్ల కళేబరాన్ని చూశారు. గొర్రెపిల్ల మృతదేహానికి ఆనందన్ కుటుంబీకులు పూజలు చేసి, అంత్యక్రియలు చేశారు. - (చెన్నై, ఆంధ్రజ్యోతి)

నేడే జడ్పీటీసీ ఉప ఎన్నికలు

జగన్ ఇలాకా పులివెందులలో ఉత్కంఠ.. తొలిసారి టీడీపీ నుంచి పెను సవాల్

- వైసీపీ నేతలు ఉక్కిరిబిక్కిరి
- బెంగళూరు నుంచే జగన్ వ్యూహరచన
- గెలిపించే బాధ్యత అవినాశ్‌రెడ్డికి
- ఓటర్లకు రూ.5 వేలు, చీరల పంపిణీ
- 15 పోలింగ్ కేంద్రాల్లో 10 అత్యంత సమస్యాత్మకం
- ఒంటిమిట్టలో ఓటు రూ.3 వేలు

కడప, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ చేసింది. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికలను టీడీపీ, వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో తీవ్ర ఉత్కంఠ రేగుతోంది. ముఖ్యంగా మాజీ సీఎం జగన్ సొంత ఇలాకా పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక వైసీపీకి చావోరేవుగా మారింది. ఇక్కడ టీడీపీ తరపున మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి లతారెడ్డి పోటీచేస్తుండగా.. వైసీపీ నుంచి హేమంత్‌రెడ్డి బరిలో ఉన్నారు. పులివెందులలో నిన్నటిదాకా జగన్ కుటుంబం చెప్పిందే వేదం. వారు చెప్పినవారే ప్రజాప్రతినిధులు అన్నట్లుగా ఏకపక్షంగా జరిగేది. ఈసారి పరిస్థితి పూర్తిగా మారింది. పులివెందులలో వైసీపీని ఉక్కిరిబిక్కిరి చేసి ఓడించే స్థాయికి టీడీపీ మొట్టమొదటిసారి చేరింది. గెలుస్తామని వైసీపీ నేతలే ధీమాగా చెప్పుకోలేని పరిస్థితి వచ్చింది. దీంతో ఓటుకు రూ.5 వేల చొప్పున పంపిణీ చేశారు. ఏ పరిస్థితుల్లోనూ గెలవాలని జగన్ బెంగళూరు నుంచే వ్యూహాలు రచిస్తూ.. అమలు బాధ్యత ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డికు అప్పగించారు. జిల్లా పార్టీ నేతలతో పాటు అవినాశ్‌రెడ్డి తొలిసారి ఇంటింటికీ వెళ్లి ఓట్లడిగారు. ఉప ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారడంతో ఓటు రేటు అనూహ్యంగా రూ.5 వేలకు పెంచేశారు. మహిళా ఓటర్లకు సోమవారం సాయంత్రం కీలకమైన నల్లపురెడ్డిపల్లెలో డబ్బుతో పాటు చీరలు కూడా పంచారు. ఇరు పార్టీలూ కేవలం ఓట్ల కోసమే రూ.10 కోట్లకు పైగా వెచ్చించారని ప్రచారం జరుగుతోంది. ఒంటిమిట్టలో నోటుకు రూ.3 వేల చొప్పున పంపిణీ చేశారని అంటున్నారు.

కీలక నేతలకు జగన్ ఫోన్?

పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక ఈ స్థాయిలో గట్టి సవాల్ విసురుతుందని వైసీపీ నేతలు ఊహించలేదు. దీంతో అవినాశ్‌రెడ్డి పులివెందుల మండలంలోని కీలక నేతలకు జగన్‌తో ఫోన్ చేయించి మాట్లాడిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఎన్నికలకు ముందే పులివెందులలో టీడీపీ, వైసీపీ పరస్పరం దాడులు చేసుకున్నాయి. దీంతో పోలింగ్‌రోజు ఏం జరుగుతుందోనన్న ఆందోళన ఉంది. ఈ నేపథ్యంలో పులివెందులలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

పులివెందులలో 10,600 మంది ఓటర్లు..

పులివెందులలో 11 మంది బరిలో ఉన్నారు. మొత్తం ఓట్లు 10,600. 15 పోలింగ్ కేంద్రాల్లో 10 కేంద్రాలను అత్యంత సమస్యాత్మకంగా గుర్తించారు. 700 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇక ఒంటిమిట్టలో టీడీపీ నుంచి అద్దలూరు ముద్దుకృష్ణారెడ్డి, వైసీపీ నుంచి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి పోటీలో ఉన్నారు. ఇక్కడా 11మంది బరిలో ఉన్నారు. 24,600 ఓట్లు ఉన్నాయి. 30 పోలింగ్ కేంద్రాల్లో 15 కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. 700 మంది పోలీసులను మోహరించారు.

'పులివెందుల ర్యాలీ' నిందితులపై రేపటి వరకు తొందరపాటు చర్యలొద్దు

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా పులివెందులలో వైసీపీ నేతలు ర్యాలీ నిర్వహించారనే ఆరోపణలతో నమోదైన కేసులో నిందితులందరిపై బుధవారం (13వ తేదీ) వరకు ఎలాంటి తొందరపాటు చర్యలూ తీసుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి సోమవారం ఉత్తర్వులిచ్చారు. కడప వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీకి ఎలాంటి అనుమతీ తీసుకోలేదంటూ ఎంపీడీవో కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అవినాశ్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీశ్‌కుమార్‌రెడ్డి, మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు కొట్టివేయాలని కోరుతూ పలువురు వైసీపీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై సోమవారం విచారణ జరిగింది.

పోలింగ్ కేంద్రాల మార్పుపై జోక్యం చేసుకోలేం

- పులివెందులలో ఇప్పటికే 97% ఓటర్ స్లిప్పుల పంపిణీ: హైకోర్టు
- వైసీపీ నేతల పిటిషన్లు కొట్టివేత

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ స్థానంలో పోలింగ్ కేంద్రాలను మార్చడాన్ని సవాల్ చేస్తూ వైసీపీకి చెందిన తుమ్మల హేమంత్‌రెడ్డి, మరికొందరు దాఖలు చేసిన పిటిషన్లలో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని.. ఓటర్ స్లిప్పుల పంపిణీ 97 శాతం పూర్తయిందని తెలిపింది. స్లిప్పులపై పోలింగ్ కేంద్రాల వివరాలు కూడా ఉన్నాయని.. అందువల్ల మార్చిన పోలింగ్ కేంద్రాల గురించి ఓటర్లకు తెలిసే అవకాశం లేదన్న పిటిషనర్ల వాదనను తోసిపుచ్చింది. వ్యాజ్యాలను కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నిక సందర్భంగా ఎర్రబల్లి, నలగొండువారిపల్లి గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను నల్లపురెడ్డిపల్లికి మార్చడాన్ని సవాల్ చేస్తూ వైసీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డి, మరికొందరు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిని హైకోర్టు లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి, న్యాయవాదులు వీఆర్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు వాదనలు వినిపించారు. పోలింగ్ కేంద్రాల మార్పు విషయంలో చట్టనిబంధనలు ప్రకారమే నడుచుకున్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం తరపు స్టాండింగ్ కౌన్సిల్ తెలిపారు. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. పోలింగ్ కేంద్రాల మార్పుపై గత నెల 11నే ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం తుది నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. దానికి పోలింగ్ కేంద్రాల మార్పు సమాచారాన్ని జత చేసిన్నారు. ఎన్నిక ప్రక్రియ ప్రారంభమైన తర్వాత కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు, రాష్ట్ర హైకోర్టు పలు తీర్పులు ఇచ్చాయన్నారు. అన్ని పక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. జోక్యానికి నిరాకరించారు.

జగన్ పాలనలో పులివెందులలో 21 మంది కౌలు రైతుల ఆత్మహత్యలు

- వారి కుటుంబాలను ఆదుకోని దుర్మార్గుడు జగన్: నాదెండ్ల

రైల్వేకోడూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): 'సొంత నియోజకవర్గం పులివెందులలో గత వైసీపీ ప్రభుత్వంలో కౌలు రైతులు 21 మంది ఆత్మహత్య చేసుకుంటే వారి కుటుంబాలను ఆదుకోని దుర్మార్గుడు మాజీ సీఎం జగన్' అని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. సోమవారం రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. 'గత ప్రభుత్వంలో ఆత్మహత్యలకు పాల్పడిన కౌలు రైతుల కుటుంబాలకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ రూ.లక్ష చొప్పున పంపిణీ చేశారు. పులివెందులలో మృతి చెందిన రైతు కుటుంబాల కోసం సిద్ధవటంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి 21 మంది కౌలు రైతులను గుర్తించి రావాలని సమాచారం అందిస్తే 17 మందే వచ్చారు. మిగిలిన వారిని వైసీపీ నాయకులు భయభ్రాంతులకు గురిచేశారు. ఉమ్మడి కడప జిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం ఖాయం' అని మంత్రి మనోహర్ అన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగానే పులివెందుల జడ్పీటీసీ ఎన్నికలు

- పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో ఎవరి ప్రమేయమూ లేదు: మంత్రి అనిత

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలను పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగానే నిర్వహిస్తామని హోం మంత్రి అనిత తెలిపారు. సోమవారం అమరావతి సచివాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'పోలింగ్ బూత్‌లు ఏర్పాటు ఈసీ నియమావళి ప్రకారమే జరిగింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం, సీఎం చంద్రబాబు ప్రమేయం ఏమీ లేదు. అయినా ప్రతిపక్ష పార్టీ రాజకీయం చేస్తూ ప్రభుత్వంపై, సీఎంపై బురద జల్లేలా మాట్లాడటం విడ్డూరం. 2021లో స్థానిక ఎన్నికలప్పుడు టీడీపీ అభ్యర్థుల నామినేషన్లు వేయకుండా పత్రాలను లాక్కుని, అప్రజాస్వామికంగా ఎన్నికలు నిర్వహించిన వైసీపీ ఇప్పుడు గగ్గోలు పెడుతోంది. ఇప్పుడు పులివెందుల జడ్పీటీసీకి 11 నామినేషన్లు దాఖలైనాయి. వివేకాందరెడ్డి కేసుపై పునర్విచారణ కోరే హక్కు వైఎస్ సునీతకు ఉంది. ఆమెకు ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందిస్తాం' అని మంత్రి అనిత అన్నారు.

అటు జ్ఞానం.. ఇటు సేవాగుణం..!

- ఏలూరులో బుక్ నూక్, కైండ్‌నెస్ వాల్ ఏర్పాటు
- పుస్తక పఠనాన్ని, సేవా గుణాన్ని పెంచేలా చర్యలు
- ఏలూరు జిల్లా ఎస్పీ, జేసీ దంపతుల వినూత్న ఆలోచన

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఏలూరు జిల్లాలో ఇద్దరు ఉన్నతాధికారులు ఉన్నతంగా ఆలోచించారు. ఒకరు జ్ఞానాన్ని అందించే 'బుక్ నూక్ సెంటర్'ను ఏర్పాటు చేయగా.. మరొకరు 'కైండ్‌నెస్ వాల్' ఏర్పాటుతో మనలోని సేవాగుణాన్ని చాటుకునే అవకాశం కల్పించారు. దంపతులైన జిల్లా ఎస్పీ కేవీపీఎస్ ప్రతాప్ కిశోర్, జాయింట్ కలెక్టర్‌ధాత్రిరెడ్డి ఈ వినూత్న ప్రక్రియకు తెరతీశారు.



బుక్ నూక్ సెంటర్

పుస్తకాలు చదువుకోవచ్చు.. తీసుకెళ్లొచ్చు..

ఏలూరు నగరంలో ఇడా ఆధ్వర్యంలో దీనికి వైస్ చైర్మన్‌గా ఉన్న జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ప్రస్తుతానికి రెండు చోట్ల 'ఏలూరు బుక్ నూక్ సెంటర్'ను ఏర్పాటు చేశారు. ఎస్పీ కార్యాలయం, సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఏర్పాటు చేసిన రెండు అరలతో కూడిన బాక్స్‌ల్లో.. ఎవరైనా తమకు అవసరం లేని పుస్తకాలు పెట్టొచ్చు. అక్కడే కాసేపు నిలబడి చదువుకోవచ్చు. కావాలనుకుంటే ఇంటికి తీసుకెళ్లొచ్చు. చదివిన తర్వాత మళ్లీ తీసుకొచ్చి ఇక్కడ పెట్టవచ్చు.

కైండ్‌నెస్ వాల్‌తో పేదలకు మేలు..

ఎస్పీ ప్రతాప్ కిశోర్... పోలీస్ అధికారుల సంఘం తరపున నగరంలోని అమీనాపేట రోడ్డులో పోలీస్ కల్యాణ మండపం వద్ద కైండ్‌నెస్ వాల్‌ను ఏర్పాటు చేయించారు. దీనిలో ఎలక్ట్రానిక్స్ గూడ్స్, మహిళలు, పెద్దలు, చిన్నారులు ఏ వయస్సు వారైనా తమకు అవసరం లేని దుస్తులు, బొమ్మలు, చెప్పులు, షూలు దగ్గర్నుంచి, వంట సామగ్రి, ఇతర వస్తువులను పెట్టి వెళ్లవచ్చు. అవసరమైనవారు ఎవరైనా వాటిని నిరభ్యంతరంగా తీసుకెళ్లొచ్చు. ఈ 'బుక్ నూక్ సెంటర్', కైండ్‌నెస్ వాల్' కు నగర వాసుల నుంచి స్పందన లభిస్తోంది.



కైండ్‌నెస్ వాల్

మంత్రి లోకేశ్ అభినందన

మనకు అవసరం లేనివి ఇతరులకు ఉపయోగపడతాయి అనే ఉద్దేశంతో కైండ్‌నెస్ వాల్ ఏర్పాటు చేసిన ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ కిశోర్‌కు మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు.

ముందస్తు బెయిల్‌కు సురేశ్‌బాబు అనర్హుడు

- వీరయ్య చౌదరి హత్య కేసు ప్రధాన నిందితుడికి చుక్కెదురు
- ఆయన పాత్రపై తగిన ఆధారాలున్నాయి: సుప్రీంకోర్టు
- బెయిల్ పిటిషన్ డిస్మిస్ చేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఒంగోలు నేత వీరయ్య చౌదరి హత్య కేసులో ప్రధాన నిందితుడు సురేశ్ బాబుకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. అతనికి ముందస్తు బెయిల్ ఇవ్వడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఈ కేసులో సురేశ్ బాబు పాత్రకు సంబంధించి పోలీసుల వద్ద ఆధారాలు ఉన్నాయని, ఆయన ముందస్తు బెయిల్‌కు అనర్హుడని స్పష్టం చేసింది. నాగులుప్పలపాడుకు చెందిన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరిని ఒంగోలులోని ఆయన కార్యాలయంలో ఏప్రిల్ నెలలో హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడు సురేశ్ బాబు తనకు ముందుస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ జూలై 27న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై సోమవారం జస్టిస్ రాజేష్ బిందాల్, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. వాదనల అనంతరం.. డబ్బులు చేతులు మారడం, ఫోన్ కాల్స్‌తో సహా తగినన్ని ఆధారాలు ఉన్నాయని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో మిగిలిన నిందితులకు రెగ్యులర్ బెయిల్ వచ్చిందని పిటిషనర్ తరపు న్యాయవాది చెప్పారు. అలాగేతే.. కింది కోర్టులోనే బెయిల్ తెచ్చుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

ప్లాట్‌ఫారంపైకి దూసుకువెళ్లిన బస్సు

- విశాఖ ద్వారకా బస్ కాంప్లెక్స్‌లో ఘటన
- మహిళ మృతి, మరొకరికి స్వల్ప గాయాలు


ప్రమాదం జరిగిన ప్లాట్ ఫాం.. బస్సు


బస్సు ఢీకొని మృతిచెందిన మహిళ

విశాఖపట్నం (మహారాణిపేట), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ద్వారకా బస్ కాంప్లెక్స్‌లో సోమవారం సాయంత్రం ఓ బస్సు బీభత్సం సృష్టించింది. ప్లాట్‌ఫారంపైకి దూసుకువెళ్లి ఒక మహిళను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొకరికి స్వల్ప గాయాలవ్వడంతో ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. విజయనగరం జిల్లా ఎస్.కోటకు చెందిన గేదెల ముత్యాలమ్మ(45) తన పెద్దకుమార్తె అన్నప్రాసన కోసం శనివారం గాజువాక వచ్చింది. సోమవారం తిరిగి వెళ్లేందుకు ద్వారకా బస్‌స్టేషన్‌కు చేరుకుంది. చిన్నకుమార్తెను బొబ్బిలి వెళ్లే బస్సు ఎక్కించిన ముత్యాలమ్మ.. ఎస్.కోట వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉంది. ఆ సమయంలో శ్రీకాకుళం నుంచి ఆర్టీసీ అద్దె బస్సు ద్వారకా బస్‌స్టేషన్‌కు చేరుకుంది. ప్రయాణికులను దింపిన తర్వాత డ్రైవర్ చంద్రరావు బస్సును శ్రీకాకుళం ప్లాట్‌ఫారంపై పెట్టేందుకు సిద్ధమయ్యాడు. అయితే బస్సు అపరిమిత వేగంతో 25 నంబర్ ప్లాట్‌ఫారంపై నుంచి ప్రయాణికులు వేచి ఉండే ప్రాంతంలోకి దూసుకుపోయి పిల్లర్ వద్ద వెనక్కి తిరిగి నిలబడి ఉన్న ముత్యాలమ్మను ఢీకొంది. బస్సుకు, పిల్లర్‌కు మధ్య నలిగిపోవడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనలో కోరాపుట్‌కు చెందిన రంజాన్ వల్లీ (22)కి స్వల్పగాయాలయ్యాయి. వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. బస్సు ప్రమాదానికి బ్రేక్ ఫెయిల్ కావడం కారణమా?, డ్రైవర్ తప్పిదమా?...అనేది తేలాల్సి ఉందని అధికారులు తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నామని టూటౌన్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బీభత్స నిర్ణయం

గాజాను ఆక్రమించబోవడం లేదు, హమాస్ నుంచి విముక్తి కలిగిస్తున్నామంతే అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూ ప్రకటించినప్పటికీ, జరగబోయేదేమిటో అందరికీ తెలుసు. గాజా నగరం స్వాధీనానికి ఇజ్రాయెల్ మంత్రివర్గం తీర్మానించగానే అన్ని దేశాలూ ఆ ప్రతిపాదనమీద మండిపడ్డాయి. ఐక్యరాజ్యసమితి కూడా ఈ నిర్ణయం ప్రమాదకరమైనదంటూ అభ్యంతరం వెలిబుచ్చింది. దీంతో నెతన్యాహూ సామాజిక మాధ్యమాల్లో ఓ చిన్న వివరణ ఇస్తూ, గాజా స్వాధీనం అన్నంత మాత్రాన అది తమదగ్గరే ఉంచేసుకోబోమన్నారు. ఈ ప్రాంతానికి హమాస్ నుంచి స్వేచ్ఛను ప్రసాదిస్తాం, నిస్సైనికీకరణ చేస్తాం, పాలస్తీనా అథారిటీ, హమాస్ సహా మరే ఉగ్రవాద సంస్థ ప్రమేయం లేని శాంతియుత పౌరపాలన నెలకొల్పుతాం అని ప్రకటించారాయన. తన ఈ చర్యలతో హమాస్ దగ్గర ఉన్న ఇజ్రాయెలీ బందీలకు విముక్తి దొరుకుతుందని, ఇజ్రాయెల్‌కు గాజా నుంచి శాశ్వతంగా ముప్పు ఉండదని ఆయన భవిష్యత్ దర్శనం చేశారు. ఇంత చక్కగా చెబుతున్నా కూడా, భద్రతామండలిలో అమెరికా తప్ప, శాశ్వత సభ్య దేశాలన్నీ నెతన్యాహూ నిర్ణయాన్ని తప్పుబట్టాయి. యుద్ధం ఆగాలంటే, హమాస్ అంతం కావాలి, అది జరగాలంటే మొత్తం గాజాను మేము దురాక్రమించాలి అన్నది నెతన్యాహూ వ్యాఖ్యల సారాంశం.

ప్రపంచ దేశాల ఈ ఖండనమండనలు, అభ్యంతరాలు నెతన్యాహూను నిలువరించలేవన్నది నిజం. గాజాను గుప్పిట్లోకి తెచ్చుకొనే ఆ ప్రక్రియ అతి బీభత్సంగా ఉండబోతున్నది. అల్ షిఫా ఆస్పత్రి ప్రధానద్వారం వెలుపల మీడియాకోసం ఉద్దేశించిన టెంట్ మీద ఇజ్రాయెల్ ఆదివారం రాత్రి క్షిపణులు ప్రయోగించి అల్‌జజీరా చానెల్‌కు చెందిన ఐదుగురు పాత్రికేయులను పొట్టనబెట్టుకుంది. ఈ బృందం నాయకుడు హమాస్ ఉగ్రవాది అని ఇజ్రాయెల్ ఆరోపణ. ఖతార్‌కు చెందిన ఈ మీడియా సంస్థమీద నెతన్యాహూ కక్షకట్టి, యుద్ధం ఆరంభమైనప్పటి నుంచీ దానిని అణగదొక్కేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. గత 22 నెలల్లో 200మంది జర్నలిస్టులను చంపి బాహ్యప్రపంచానికి తన నేరాలూఘోరాలూ తెలియనివ్వకుండా చేయాలని ఇజ్రాయెల్ ఎంతో ప్రయత్నిస్తోంది. ఇప్పుడు మరింత భీకరంగా గాజాలోకి చొరబడబోతున్న నేపథ్యంలో, మీడియాపై ఆదివారం నాటి దాడి ఒక బలమైన హెచ్చరిక. క్షేత్రస్థాయి నిజాలు వెలుగుచూడనివ్వకుండా నియంత్రించే ప్రయత్నం.

స్వతంత్ర పాలస్తీనా రాజ్యం ఏర్పాటయ్యేవరకూ ఆయుధాలు వదిలేది లేదనీ, అది ఏర్పడిన తరువాత భవిష్యత్ పాలస్తీనా అథారిటీకి తానే స్వయంగా ఆయుధాలు అప్పగిస్తానని హమాస్ అంటోంది. హమాస్ బాగా దెబ్బతిన్నప్పటికీ, గాజాలో చెప్పుకోదగ్గ ప్రాంతాన్ని అది ఇంకా నియంత్రించగలుగుతున్నందున దానిని ఈ స్థితిలో వదిలివేయడం తమకు ప్రమాదకరమని నెతన్యాహూ భావిస్తున్నారు. ఇటీవల అమెరికా–ఇజ్రాయెల్ కలిసి పన్నెండు రోజులపాటు ఇరాన్‌ను దెబ్బతీసిన కారణంగా అది హమాస్‌కు సహాయపడగల స్థితిలో లేదని ఆయన నమ్మకం. హిజ్బొల్లా వంటి సంస్థలు కూడా బలహీనపడి ఉన్న ఈ దశలోనే హమాస్‌ను సమూలంగా తుడిచేయవచ్చునన్న ఆశతో నెతన్యాహూ ఈ కొత్త దురాక్రమణలో దూకుడుగా ఉన్నారు. హమాస్ తన వద్ద ఉన్న ఆయుధాలను పాలస్తీనా అథారిటీకి అప్పగించి, గాజాపాలన నుంచి తప్పుకోవాలని ఇటీవల ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో న్యూయార్క్‌లో జరిగిన సదస్సులో అరబ్‌దేశాలు కూడా విజ్ఞప్తిచేసిన విషయం తెలిసిందే. అక్టోబర్ 7దాడిని అవి ఖండించడం కూడా ఇదే తొలిసారి. మూడు అరబ్‌దేశాలు, నాలుగు పశ్చిమదేశాలు, రెండు ముస్లిం దేశాలు కలసికట్టుగా చేసిన ఈ ప్రతిపాదనలు అటు హమాస్‌కు, ఇటు ఇజ్రాయెల్‌కు కూడా కాలువెనక్కుతీసుకోవడానికి మంచి మార్గం. కానీ, రెండు స్వతంత్ర, సార్వభౌమ దేశాలుగా ఇజ్రాయెల్, పాలస్తీనా పక్కపక్కనే మనగలగడం నెతన్యాహూ దృష్టిలో అసాధ్యం. ఆయన అధికారంలో ఉన్నంతవరకూ పరిష్కారాలకు దూరంగా కొత్తరూపాల్లో గాజా యుద్ధం కొనసాగుతూనే ఉంటుంది. గాజాను ఆక్రమించబోవడం లేదంటూనే హమాస్ నుంచి దానిని వశపరచుకొనే నెతన్యాహూ కొత్త ఎత్తుగడ 22నెలల యుద్ధాన్ని మరి కొంతకాలం కొనసాగించడానికి ఉపకరిస్తుంది. హమాస్ ఎదురు నిలవగలదా అన్నది ఇక్కడ అప్రస్తుతం. కానీ, మరిన్ని చావులు, మరింత విధ్వంసాన్ని ఈ ప్రపంచం చూడాల్సి వస్తుంది.

అగ్రరాజ్య ఆటలో భారత్ ఒడ్డున పడేనా?



ఆదర్శాలు, ఆర్థిక ప్రయోజనాలు.. ఈ రెండిటినీ విడదీసి చూస్తే అసలు విషయాలు అర్థంకావు. ఆదర్శాలకు అనేక ముసుగులు ఉంటాయి. ఒక్కోదాన్ని తొలగించుకుంటూ వెళ్తే తప్ప అసలు ప్రయోజనాలను పసిగట్టలేం. ఆధిపత్యం చేజారిపోతున్నప్పుడు ముసుగులు తీసేసి ఎట్లా మాట్లాడుతారో తెలుసుకోవాలంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైపే చూడాలి! స్వేచ్ఛా వాణిజ్యం గురించి ప్రపంచానికి ఒకనాడు అమెరికా చెప్పిన ఆదర్శాలు అన్నీఇన్నీ కావు. ఇప్పుడు అవన్నీ పక్కకుబెట్టి అసంబద్ధ ఏకపక్ష సుంకాలతో దేశాలను శాసించటం ట్రంప్‌కు ఒక విధానంగా మారిపోయింది. భారత్ వస్తువులపై 50 శాతం సుంకాలను విధించి తనది అసలుసిసలైన నయాసామ్రాజ్యవాద పోకడగా నిరూపించుకున్నారు. దీన్ని ఎదుర్కోటానికి మోదీ ప్రభుత్వం కిందామీదా పడుతోంది. విదేశాంగ విధానానికి సంబంధించి ఇటీవల కాలంలో ఎన్నడూ ఎరుగని సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.

గడచిన 25 ఏళ్లుగా అమెరికా అండను పొందటమే ప్రధానంగా భారత విదేశాంగ విధానం రూపుదిద్దుకుంది. ఆర్థికంగా, సాంకేతికంగా, సైనికశక్తి పరంగా అనూహ్య వేగంతో దూసుకుపోతున్న చైనాను నిలువరించటానికి అమెరికాకు భారత్ కావాల్సి వచ్చింది. దక్షిణాసియాలో సైతం పెరిగిపోతున్న చైనా ప్రాధాన్యాన్ని నిలువరించటానికి అన్నిరంగాల్లో అమెరికాతో ఇచ్చిపుచ్చుకోవటం భారత్‌కూ వ్యూహాత్మక అవసరమైంది. నిజానికి ఆపరేషన్ సిందూర్ తర్వాత ఆ అవసరం భారత్‌కు ఇంకా ఎక్కువైంది. కానీ పరిస్థితులు భిన్నంగా, అనూహ్యంగా మారిపోతున్నాయి. ఆపరేషన్ సిందూర్ సాఫల్య, వైఫల్యాలపై రక్షణ వ్యవహారాల నిపుణులు లోతైన విశ్లేషణలు చేస్తున్నారు. పాకిస్థాన్ ఆయుధ సంపత్తిలో చైనా పాత్ర అందరికీ తెలుసు. కానీ పాక్ యుద్ధ తంత్రమూ, దాని అమలూ కూడా చైనా కనుసన్నల్లో నడుస్తోందన్న విషయం ఆపరేషన్ సిందూర్ సందర్భంగా స్పష్టమైంది. యుద్ధం అన్న తర్వాత నష్టాలు ఉంటాయి. అయితే ఆ నష్టాలు సమానంగానో, ఊహించని రీతిలో కాస్త ఎక్కువగానో ఉంటే సమస్యలు మొదలవుతాయి. చైనా వ్యూహాత్మక మద్దతుతో సాగిన యుద్ధంవల్లే అవి వస్తే మన భవిష్యత్తు అడుగులను తీవ్రంగా ప్రభావితం చేసేవిగా ఉంటాయి. భారత్ చుట్టూ చక్రబంధంలా చైనా మారిపోయిన కఠోర పరిస్థితుల్లో ట్రంప్ చర్యలు ఎంత అవమానకరంగా అనిపించినా తాడోపేడో తేల్చుకోటానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. రష్యాతో మైత్రీనీ, చమురు కొనుగోళ్లనూ వదులుకోబోమని ఒక వంక చెబుతూనే మరోవైపు చైనాతో కూడా సామరస్యంగా వ్యవహరించటానికే మొగ్గుచూపుతున్నట్లు సంకేతాలు ఇస్తోంది. అందుకే ప్రధాని మోదీ ఈ నెలాఖరులో చైనాలో పర్యటించబోతున్నారు. తమకు ప్రత్యామ్నాయ మార్గాలు కూడా ఉన్నాయని చెప్పటమే భారత్ తక్షణ లక్ష్యంగా కనపడుతోంది.

ఒకటి మాత్రం నిజం. చైనా, భారత్, రష్యాలు ఆర్థికంగా సహకరించుకుంటే ట్రంప్ అంచనాలన్నీ తారుమారవుతాయి. అమెరికా ఆర్థిక, సైనిక ఆధిపత్యం మరింత దిగజారుతుంది. అమెరికాకు 75 ఏళ్లలో ఎన్నడూ చూడని సవాళ్లు ఎదురవుతాయి. ఇదే జరిగితే యూరప్ దేశాలు అమెరికాకు తానాతందాన అనే పరిస్థితి నుంచి బయటపడొచ్చు. లాటిన్ అమెరికాలో కూడా అమెరికా ఆధిపత్యానికి గండిపడుతుంది. ఇప్పటికే బ్రెజిల్ అమెరికాపై చాలా కోపంగా ఉంది. అమెరికాను ఆధిపత్యధోరణుల కట్టడి చేయటానికి చైనా, భారత్‌లు సమష్టిగా అడుగులు వేస్తే చరిత్ర కొత్త మలుపుతిరుతుంది. ఆ మలుపు అంత సులభం కాదు. అభిలాషతో అన్నీ జరగవు. రెండు దేశాల మధ్య ఇప్పటి దాకా జరిగిన పరిణామాలు, పోటీలు, వివాదాలే అందుకు కారణం.

> **దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా అమెరికా, చైనాల మధ్య సమదూరం పాటించక తప్పనిసరి పరిస్థితి భారత్‌కు ఏర్పడుతోంది. ఒకవైపు మొగ్గితే తీవ్ర ప్రతికూలతలూ ఉన్నాయి. పొరుగునున్న బలమైన దేశాల నుంచి నిరంతరం ఎదురయ్యే ఆర్థిక ఒత్తిళ్లు, సైనిక సవాళ్లు యూరపు చరిత్రలో శాస్త్ర–సాంకేతిక విజ్ఞానాన్ని పరుగులు పెట్టించాయి. అది భారత్ విషయంలో నిజమైతేనే ఎంతోకొంత ఉపశమనం! సమస్త విజ్ఞానానికీ మనమే ఆద్యులమన్న చిత్తభ్రమ నుంచీ, హిందూ ఆధిపత్య భావాల నుంచీ బయటికి వస్తేనే అది సాధ్యమవుతుంది.**

భారత–చైనా మధ్య వివాదాలు ఈనాటివి కావు. ఆసియాలో ఆధిపత్యం, నాయకత్వ పాత్రపై రెండు దేశాల మధ్య పెనుగులాటలు 1950ల నుంచే మొదలయ్యాయి. బ్రిటిష్ వలసపాలకులు నిర్ణయించిన సరిహద్దులను అంగీకరించబోమని చైనా, వాటిని యథాతథంగా కొనసాగించాలని భారత్ పట్టుబట్టటంతోనే వివాదం మొదలైంది. 1950ల నాటికే అక్సాయిచిన్ ప్రాంతం చైనా నియంత్రణలో ఉంది. ఉపగ్రహచిత్రాల్లేని ఆ రోజుల్లో అక్సాయిచిన్‌లో జనసంచారం, సైనికుల కదలికల గురించి తెలుసుకునే అవకాశమే లేదు. అందుకే ఆ నియంత్రణ గురించి భారత్‌కు చాలా ఆలస్యంగా తెలిసింది. 1951లో టిబెట్‌ను చైనా స్వాధీనం చేసుకున్న నాటి నుంచే చైనా కదలికలను సునిశితంగా పరిశీలించటం ఎంతో కొంత మొదలైంది. అక్సాయిచిన్ ఎడారి ప్రాంతం. లద్దాఖ్ మహారాజు 1865లో దాన్ని స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. అంతకుముందు బ్రిటిషు సైన్యం చేతుల్లో సిక్కు రాజ్యం (1846) ఓడిపోయింది. ఆ తర్వాత లద్దాఖ్‌ను లాంఛనంగా స్థానిక మహారాజాకు అప్పగించారు. లద్దాఖ్ తూర్పు ప్రాంతమైన అక్సాయిచిన్‌కు సంబంధించి సరిహద్దులేవీ అప్పటికి స్పష్టంగా లేవు. అక్సాయిన్ ఎడారికి ఇవతల ఉన్న కారాకోరం పర్వతాలనే లద్దాఖ్‌కు తూర్పు సరిహద్దుగా భావించేవారు. కానీ 1865లో లద్దాఖ్ మహారాజు సర్వే జరిపించి ఈశాన్యంలో పర్వతాలకు అవతలున్న అక్సాయిచిన్ ఎడారి ప్రాంతాన్ని కూడా లద్దాఖ్‌లో కలిపి సర్వేపటాన్ని సిద్ధంచేశారు. సర్వేయర్ జాన్సన్‌కు లంచమిచ్చి పటాన్ని అలా తయారుచేశారన్న ఆరోపణలు అప్పుడే వచ్చాయి. బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం జాన్సన్‌ను ఉద్యోగం నుంచి తొలగించింది. సరిహద్దును విస్తరించటం బ్రిటిష్ ఇండియా ప్రభుత్వానికి అప్పట్లో ఇష్టంలేదు. జాన్సన్‌కు లద్దాఖ్ మహారాజు తర్వాతి కాలంలో ప్రధానమంత్రి పదవిని కట్టబెట్టారు. రష్యా సామ్రాజ్య విస్తరణను దృష్టిలో పెట్టుకుని కారాకోరం పర్వతశ్రేణిని సరిహద్దుగా నిర్ణయిస్తే బాగుంటుందని భావించిన బ్రిటిషు పాలకులు ఆ మేరకు మాకార్ట్నీ మక్డోనాల్డ్ పేరిట 1890ల్లో సర్వే పటాన్ని తయారుచేసి చైనాకు పంపారు. దానిపై చైనా స్పందించలేదు. స్పందన లేకపోవటాన్ని ఆమోదంగా భావించి 1941 వరకూ దాన్నే సరిహద్దుగా పరిగణించారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో సోవియట్ సైనికదళాలు అక్సాయిచిన్ ఉత్తరభాగంలో సంచరిస్తున్నాయని తెలుసుకుని జాన్సన్ ప్రతిపాదించిన మేరకు లద్దాఖ్ సరిహద్దుని మళ్లీ విస్తరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జాన్సన్ సరిహద్దు గురించి చైనాకు అధికారికంగా ఎప్పుడూ తెలపలేదు. లద్దాఖ్ సరిహద్దును తాము ఆమోదించలేదని 1954లో చైనా స్పష్టంచేసింది.

అరుణాచల్ ప్రదేశ్‌పై వివాదానికీ చాలా చరిత్ర ఉంది. 1911లో చైనాలో వచ్చిన విప్లవాన్ని ఆసరాగా తీసుకుని అప్పటి టిబెట్ పాలకుడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. చైనా ప్రభుత్వం దాన్ని అంగీకరించలేదు. బ్రిటన్ మాత్రం టిబెట్‌ను బఫర్‌జోన్‌గా ఉపయోగించుకోవాలని భావించింది. చైనా, టిబెట్, బ్రిటిషు ఇండియా ప్రభుత్వాల మధ్య చర్చలు జరిగాయి. ఏకాభిప్రాయం కుదరలేదు. ఇదే సమయంలో టిబెట్–ఇండియా మధ్య సరిహద్దుని ఉత్తరాన 60 మైళ్ల ముందుకు జరిపి హిమాలయాల హద్దుగా ఒక ప్రతిపాదన చేశారు. బ్రిటిష్ ఇండియా విదేశాంగ మంత్రిగా ఉన్న హెన్రీ మక్‌మాన్ దాన్ని ప్రతిపాదించటం వల్ల అదే పేరుతో ప్రచారమైంది. స్థానిక గిరిజన ప్రాంతాలతో పాటు తవాంగ్‌ను కూడా కొత్త సరిహద్దుల్లో కలిపారు. ఆ ప్రాంతాలకు తర్వాత నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ ఏజన్సీగా పేరుపెట్టారు. చర్చల్లో చైనా ప్రతినిధి కొత్త సరిహద్దులను ఆమోదించారని బ్రిటిష్ ఇండియా పాలకులు ప్రకటించారు. చైనా ప్రభుత్వం దాన్ని అప్పుడే తోసిపుచ్చింది. లండన్‌లోని బ్రిటిషు ప్రభుత్వం మొదట్లో మక్‌మాన్ సరిహద్దుని ఆమోదించలేదు. కొన్ని సవరణలతో తర్వాత దాన్ని ఆమోదించినా అప్పటి నుంచి చైనా వ్యతిరేకిస్తూనే ఉంది. 1960లో చైనా ప్రధాని చౌఎన్‌లై... భారత్ అక్సాయిచిన్‌ను వదులుకుంటే అరుణాచల్ ప్రదేశ్‌పై భారత్ అధికారాన్ని అంగీకరిస్తామని ప్రతిపాదించారు. 1980లో డెంగ్ జియావోపింగ్ దాన్నే పునరుద్ఘాటించారు. అప్పటికే చైనా వ్యతిరేకత రాజకీయ ఆలోచనల్లో బలంగా ఉండటంతో భారత్ వైపునుంచి సానుకూలత వ్యక్తంకాలేదు. వివాదాస్పద ప్రాంతాల్లో పట్టుకోసం చేసే ప్రయత్నాల్లో భాగంగా 1962లో రెండు దేశాల మధ్య యుద్ధమూ జరిగింది. డోక్లాం, గల్వాన్ లోయలో సంఘర్షణలూ ఆ సరిహద్దు వివాదాల కారణంగానే చోటుచేసుకున్నాయి.



■ రాహుల్ కుమార్

చారిత్రక దృష్టితో చూస్తే భారత్–చైనా మధ్య సరిహద్దులు ఇచ్చిపుచ్చుకోవాల్సిన రీతిలో పరిష్కారమవ్వాలి. నిష్పాక్షిక చరిత్ర చెప్పేది అదే. వలస పాలకులు సృష్టించిన సరిహద్దురేఖలు లక్ష్మణరేఖలు కావు. ఒకప్పుడు ఆర్థికంగా, సైనికంగా సమానస్థాయిలో ఉన్న భారత్–చైనాలు 45 ఏళ్లల్లో తీవ్రమైన మార్పులకు లోనయ్యాయి. రెండిటి మధ్యా ఆర్థిక, సైనిక, సాంకేతిక రంగాల్లో అసమానతలు విపరీతంగా పెరిగాయి. 1950ల్లో ఆసియాకు ఎవరు నాయకత్వం వహించాలన్న విషయంలో భారత్–చైనాల మధ్య పోటీ ఉండేది. ఆసియా ఖండానికి తొలి నాగరికతలు అందించిన దేశాలుగా, వేల ఏళ్ల ఆర్థికంగా అగ్రగామి వ్యవస్థలుగా వెలుగొందిన కారణంగా ఆనాడు రెండు దేశాల నేతలను ఆసియా నాయకత్వం పోటీపడేలా చేసింది. ఇప్పుడా పరిస్థితి లేదు. నేటి చైనా స్థాయిని భారత్ అందుకోటానికి మరో ముప్పయేళ్లు పడుతుందనే అంచనాలు ఉన్నాయి. 1987లో ఇరు దేశాల స్థూలదేశీయోత్పత్తి (జీడీపీ–నామినల్) ఒకేస్థాయిలో ఉండేవి. ఇప్పుడు చైనా జీడీపీ 18 ట్రిలియన్ డాలర్లు ఉంటే భారత్ జీడీపీ 4.2 ట్రిలియన్ డాలర్లు మాత్రమే ఉంది. ఒకవైపు పరిష్కారం కాని సరిహద్దు వివాదం.. మరోవైపు అన్నిరంగాల్లో ఆధిపత్యం దిశగా చైనా పరుగులు.. భారత్‌ను అమెరికాకు దగ్గర చేసింది. ఇక చైనాని నిరోధించటానికి భారత్‌ను చేరువ చేసుకోవాల్సిన అవసరమూ అమెరికాకు ఏర్పడింది. దక్షిణాసియాలో భారత్ ఇప్పటికే వాణిజ్యపరమైన ఆధికత్యను కోల్పోయింది. మరోవైపు భారత్ దిగుమతుల్లో సైతం చైనా అగ్రస్థానంలో ఉంది. అమెరికా అండలేకుండా చైనాను నిలువరించే పరిస్థితుల్లో భారత్ ఉందని చెప్పలేం. అయితే దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా అమెరికా, చైనాల మధ్య సమదూరం పాటించక తప్పనిసరి పరిస్థితి భారత్‌కు ఏర్పడుతోంది. ఒకవైపు మొగ్గితే తీవ్ర ప్రతికూలతలూ ఉన్నాయి. పొరుగునున్న బలమైన దేశాల నుంచి నిరంతరం ఎదురయ్యే ఆర్థిక ఒత్తిళ్లు, సైనిక సవాళ్లు యూరపు చరిత్రలో శాస్త్ర–సాంకేతిక విజ్ఞానాన్ని పరుగులు పెట్టించాయి. అది భారత్ విషయంలో నిజమైతేనే ఎంతోకొంత ఉపశమనం! సమస్త విజ్ఞానానికీ మనమే ఆద్యులమన్న చిత్తభ్రమ నుంచీ, హిందూ ఆధిపత్య భావాల నుంచీ బయటికి వస్తేనే అది సాధ్యమవుతుంది.

> **చారిత్రక దృష్టితో చూస్తే భారత్–చైనా మధ్య సరిహద్దులు ఇచ్చిపుచ్చుకోవాల్సిన రీతిలో పరిష్కారమవ్వాలి. నిష్పాక్షిక చరిత్ర చెప్పేది అదే. వలసపాలకులు సృష్టించిన సరిహద్దురేఖలు లక్ష్మణరేఖలు కావు.**

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

మహిళల భద్రత సామాజిక బాధ్యత

రాష్ట్రంలో మహిళల భద్రత, సంక్షేమం కేవలం ప్రభుత్వం చేపట్టాల్సిన కార్యక్రమం మాత్రమే కాదు యావత్ సమాజం కలిసికట్టుగా ముందుకు నడవాల్సిన అంశం. విద్య, ఉపాధి, భద్రత వంటి రంగాలలో మహిళలు సాధిస్తున్న పురోగతికి తగిన రక్షణ కల్పించాల్సిన అవసరం స్పష్టమవుతోంది.

మహిళల భద్రతపై ఒక వైపు ప్రభుత్వం, మరో వైపు మహిళా కమిషన్, మహిళా సంఘాలు అనేక చర్యలు తీసుకుంటున్నా.. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై హింసాత్మక ఘటనలు, లైంగిక దాడులు, వేధింపులు జరుగుతూనే ఉన్నాయి. పోలీసు వ్యవస్థను మరింత బాధ్యతతో, మహిళాభిముఖంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. సంస్కృతి, సంప్రదాయాలకు దిక్సూచిగా నిలిచే దేశంలో కూడా మహిళలకు ఆపదలు పెరిగిపోతున్న కాలంలో వారి భద్రత, రక్షణపై చైతన్యంతో కూడిన చర్చ అవసరం. స్త్రీ ఆత్మగౌరవంతో జీవించగల వాతావరణం ఎంత మేరకు ఉంది? రోడ్డుపై నడుస్తున్నా, వాహనాల్లో, ప్రయాణాల్లో, ఉద్యోగాల్లో, పాఠశాలల్లో... ఇలా అక్కడ, ఇక్కడ అని లేకుండా మహిళలను క్రూరమృగాల్లా వేధిస్తుండటం సమాజాన్ని కళంకితం చేస్తోంది. ఆఖరికి ఇంట్లో కుటుంబసభ్యుల మధ్య కూడా స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితి.

భారత రాజ్యాంగం మహిళలకు సమానత్వం, హక్కులు కల్పించినా ఆ హక్కులను ఉపయోగించుకునే పరిస్థితి అందరికీ సమంగా లేదు. మహిళలందరికీ భద్రత, రక్షణ చట్టాలపై అవగాహన కలిగించాల్సిన అవసరం ఉంది. మహిళలపై అసభ్యంగా ప్రవర్తించడం, వేధింపులు, సైబర్ స్టాకింగ్ వంటి నేరాలపై ఐపీసీ, 1860 ప్రకారం సెక్షన్ 354, సెక్షన్ 354ఏ–డీ, అత్యాచారానికి సంబంధించి సెక్షన్ 375, సెక్షన్ 376లు వర్తిస్తాయి. వివాహిత మహిళపై భర్త, కుటుంబసభ్యుల మానసిక, శారీరక వేధింపులకు సెక్షన్ 498ఏ వంటి చట్టాల గురించి తెలుసుకోవాలి. అదే విధంగా సెక్సువల్ హెరాస్మెంట్ ఆఫ్ ఉమెన్ అట్ వర్క్‌ప్లేస్ యాక్ట్ (POSH), 2013; మైనర్ బాలికలకు రక్షణగా పోక్సో యాక్ట్ (POCSO), 2012 వంటి చట్టాల గురించి బాలికలకు తెలియజేయాలి.



> **మహిళల భద్రతపై ఒక వైపు ప్రభుత్వం, మరో వైపు మహిళా కమిషన్, మహిళా సంఘాలు అనేక చర్యలు తీసుకుంటున్నా.. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై హింసాత్మక ఘటనలు, లైంగిక దాడులు, వేధింపులు జరుగుతూనే ఉన్నాయి. కమిషన్ పనితీరు మరింత సమర్థవంతంగా ఉండాలంటే ప్రభుత్వ సహకారం, న్యాయ వ్యవస్థ స్పందన, ప్రజల భాగస్వామ్యం అవసరం.**

రాష్ట్రంలోని మహిళల హక్కులకు రక్షణ, భద్రత, సురక్షత, సాధికారత కోసం మహిళా కమిషన్ ఏర్పడింది. సివిల్ కోర్టుకి సమానమైన అధికారాలు కమిషన్‌కు ఉన్నాయని CPC 1908 ప్రకారం సెక్షన్ 14 చెబుతుంది. సెక్షన్ 16(1) ప్రకారం బాధిత మహిళల నుంచి వచ్చిన న్యాయబద్ధమైన ఫిర్యాదులను పరిశీలించి తగిన చర్యలు కమిషన్ తీసుకుంటుంది. సెక్షన్ 16(3) ప్రకారం ఎవరైనా అభియోగం ఎదుర్కొంటున్న వ్యక్తి కమిషన్ ముందు నిర్దేశించిన తేదీ నాడు విచారణకు హాజరు కాకపోతే, కమిషన్ ఆ విషయంపై విచారణ నిర్వహించి, అభియోగం నిరూపణ అయితే తగు చర్యకై ప్రభుత్వానికి సిఫారసు చేయవచ్చు, లేదా ప్రాసిక్యూషన్‌ను కూడా ప్రారంభించవచ్చు. సెక్షన్ 21 ప్రకారం ప్రభుత్వం మహిళలకు సంబంధించిన అన్ని విధానపరమైన నిర్ణయాలను తీసుకునే ముందు కమిషన్‌ను సంప్రదించాలి. గృహహింస, లైంగిక వేధింపులు వంటి అంశాలను కమిషన్ పరిశీలించి పరిష్కార చర్యలు సూచిస్తుంది. సోషల్ మీడియా, ప్రింట్/ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తెలిసిన ఘటనలను సుమోటోగా స్వీకరించి సంబంధిత శాఖలకు సూచనలు చేస్తుంది. యూనివర్సిటీలు/ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

మహిళా కమిషన్ బాధిత మహిళలకు అండగా నిలిచేందుకు అలుపెరగని కృషి చేస్తోంది. బాధిత మహిళలకు తోడుగా నిలిచేందుకు వన్ స్టాప్ సెంటర్లు, అత్యవసర పరిస్థితుల్లో 24/7 ఉచిత సేవలు అందించేందుకు మహిళా హెల్ప్‌లైన్ 181, శక్తి సదన్‌లు, శక్తి నివాస్ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. అదే విధంగా ప్రభుత్వాసుపత్రుల్లో మహిళలు, గర్భిణిల వార్డులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి లోపాలను సరిచేస్తుంది. అధికారులతో సమీక్షలు నిర్వహించి సూచనలు చేస్తుంది.

కొద్ది రోజుల క్రితం ఒక జిల్లా జీజీహెచ్‌లో 50 మంది వైద్య విద్యార్థినులపై లైంగిక దాడులకు పాల్పడిన సిబ్బందిపై ఆ విద్యార్థినులు ధైర్యంగా ముందుకు వచ్చి ఘటన వివరాలు చెప్పారు. ఇలాంటి ఘటనలు ఎంతో మంది మహిళలకు ధైర్యాన్ని ఇస్తాయి. గత కొద్ది రోజులుగా జరుగుతున్న ఘటనలను నిశితంగా పరిశీలిస్తే మోసగాళ్ల ఉచ్చులోపడి బాలికలు అన్యాయంగా బలైపోతున్నారు. చిన్నారి బాలికలు, చదువుకుంటున్న అమ్మాయిలు అనవసర సమస్యల్లో చిక్కుకొని తమ జీవితాలను చెడగొట్టుకుంటున్నారు. ప్రభుత్వం, సామాజిక సంస్థలు, ప్రజలు కలిసి బాలికల రక్షణకు చర్యలు తీసుకోవాలి.

బాలికలకు పాఠశాలలోనే తగిన లైంగిక విద్య, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, స్వీయరక్షణ విషయాలు నేర్పాలి. ఉద్యోగావకాశాలు, చట్టసభల్లో మహిళల ప్రాధాన్యతను పెంచాలి. మీడియా, పాఠశాలలు, సామాజిక సంస్థలు కూడా మహిళల చైతన్యాన్ని పెంచే దిశగా ముందుకు రావాలి. తల్లిదండ్రులు, సంరక్షకులు పిల్లలపై నిరంతరం దృష్టి ఉంచాలి. ఏవైనా అసాధారణ ప్రవర్తనలు కనిపించినప్పుడు వాటిపై శ్రద్ధ వహించాలి.

మహిళా హక్కుల పరిరక్షణ, సమానత్వ సాధన, న్యాయ కల్పనలో మహిళా కమిషన్ పోషిస్తున్న పాత్ర అనన్య సామాన్యమైనది. ఇది కేవలం ఒక సంస్థ మాత్రమే కాదు సామాజిక మార్పుకు నిదర్శనంగా నిలుస్తున్న శక్తివంతమైన మాధ్యమం. అయితే, కమిషన్ పనితీరు మరింత సమర్థవంతంగా ఉండాలంటే ప్రభుత్వ సహకారం, న్యాయ వ్యవస్థ స్పందన, ప్రజల భాగస్వామ్యం అవసరం.

● శైలజ రాయపాటి
రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

ఆదివాసీలు ముమ్మాటికీ హిందువులే!

భారతదేశం అనేక సంస్కృతీ సంప్రదాయాలకు నెలవు. భిన్నత్వంలో ఏకత్వం ఈ దేశ ప్రత్యేకత. అయితే మతపరమైన చిచ్చుపెట్టి దేశ సమగ్రతను దెబ్బతీసే కుట్ర జరుగుతున్నది. ఆదివాసీలు హిందువులేనా అనే కుట్ర మొదలైంది (భంగ్యా భూక్యా వ్యాసం: 'ఆదివాసుల మతం ఏమిటి?' జూలై 24, 2025).

ఆదివాసీలు ఎప్పుడూ హిందూ ధర్మానికి వెలుపల లేరు. వేదకాలం నుంచి మధ్యయుగం వరకు వారు హిందూ సామాజిక నిర్మాణంలో అంతర్భాగంగానే ఉన్నారు. వారి ఆచార వ్యవహారాలు, దేవతలు, పండుగలు హిందూ ధర్మంతోనే ముడిపడి ఉన్నాయి. ఆదివాసీ జీవన విధానంలో ప్రకృతి ఆరాధన ప్రధానమైంది. హిందూ ధార్మికతలో పంచభూత ఆరాధన దీన్నే సూచిస్తుంది. నేటికి అనేక ఆదివాసీ తెగలు హిందూ దేవతలను వారి పేర్లతో, రూపాలతోనే కొలుస్తారు. 'ఆదివాసీలకు ప్రత్యేక మతం' అనే భావన బ్రిటిష్ వలసవాదుల 'విభజించి పాలించు' విధానం నుంచి పుట్టింది. దీనికి ప్రధాన లక్ష్యం క్రైస్తవ మత మార్పిడులకు మార్గం సుగమం చేయడమే. ఈ విభజన వాదానికి ఆధునిక రూపం సాంస్కృతిక మార్క్సిజం. ఇది హిందూ మతాన్ని, భారతీయ సంస్కృతిని అణచివేతకు చిహ్నంగా చిత్రీకరించి, ఆదివాసీలను హిందూ సమాజం నుండి వేరు చేయడానికి ప్రయత్నిస్తుంది. విదేశీ నిధులు పొందే కొన్ని ప్రభుత్వేతర సంస్థలు కుట్రపూరితంగా విదేశీ ఎజెండాను మన దేశంలో అమలు చేస్తూ ప్రజల మధ్య చీలికలు సృష్టిస్తున్నాయి. సుప్రీంకోర్టు సైతం హిందూ మతం ఒక జీవన విధానమనీ, అది విభిన్న సంప్రదాయాలు, ఆచారాల కలయిక అని స్పష్టం చేసింది. ఆర్టికల్ 25 ప్రకారం సిక్కులు, బౌద్ధులు, జైనులు కూడా హిందూ మత పరిధిలోకి వస్తారు. కొంతమంది ఆదివాసీ మేధావులు స్వల్ప సంఖ్యలో తమను ప్రత్యేక మతంగా గుర్తించాలని అంటున్నప్పటికీ, ఇది మత మార్పిడుల ద్వారా ప్రభావితమైన ప్రాంతాల నుంచి వస్తున్నది.

పేర్లు, విధానాలు వేరైనా అనేక ఏళ్లుగా ఆదివాసీలు హిందూ పండుగల్లో భాగస్వాములే. దుర్గా పూజ, శివారాధన అనేక ఆదివాసీ తెగల ఆచారాల్లో అంతర్భాగంగానే ఉన్నాయి. ప్రకృతి ఆరాధన, పితృదేవతలను పూజించడం, నదులు, చెట్లను పవిత్రంగా భావించడం వంటివి హిందూ మతం, ఆదివాసీ సంప్రదాయాల్లో ఉమ్మడిగా కనిపిస్తాయి. నాగ ఆరాధన, భూమి పూజ, సూర్య నమస్కారాలు వంటి ఆచారాలు రెండు వర్గాలలోనూ ప్రచారంలో ఉన్నాయి. మహారాష్ట్రలోని వార్లీ, కోక్నా వంటి ఆదివాసీ తెగలు గణేష్ చతుర్థిని తమ సాంప్రదాయ నృత్యాలు, పాటలతో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని ఆదివాసీలు దసరా పండుగను విశేషంగా జరుపుకుంటారు. ముఖ్యంగా బస్తర్ దసరా ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఇది 15వ శతాబ్దం నుండే వస్తున్న సంప్రదాయం.

రామాయణం, మహాభారతం వంటి గ్రంథాలలో ఆదివాసీ పాత్రలు హిందూ మత విస్తృత పరిధిలో అంతర్భాగంగా ఉన్నాయి (ఉదాహరణకు – శబరి, నిషాద రాజు, గుహుడు, హిడం). ఈ గ్రంథాలు ఆదివాసీలను సమాజం నుండి వేరుచేయలేదు. మధ్యయుగంలో, అనేక ఆదివాసీ నాయకులు హిందూ రాజులతో సంబంధాలు ఏర్పరచుకోవడమే కాదు, రాజ్యాలను పరిపాలించారు. అనేక ఆదివాసీ రాజ్యాలు హిందూ ధర్మ సూత్రాలను అనుసరించాయి. పూర్వం వేద కాలంలో వేద సాహిత్యంలో అటవీ నివాసులైన 'అరణ్యాని' గురించి ప్రస్తావన ఉంది. క్రీ.పూ. 1500–500 నాటి ఈ సాహిత్యం ఆదివాసీల ఉనికిని, వారి ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని సూచిస్తుంది. మధ్యయుగంలో గోండు రాజులు, భిల్లు రాజులు హిందూ దేవాలయాలను నిర్మించారు, హిందూ సంప్రదాయాలను ప్రోత్సహించారు. ఉదాహరణకు, 17వ శతాబ్దంలో గోండు రాజు హృదయా షా నిర్మించిన దేవాలయాలు దీనికి నిదర్శనం.

> **'ఆదివాసీలకు ప్రత్యేక మతం' అనే భావన బ్రిటిష్ వలసవాదుల 'విభజించి పాలించు' విధానం నుంచి పుట్టింది. దీని ప్రధాన లక్ష్యం క్రైస్తవ మత మార్పిడులకు మార్గం సుగమం చేయడమే. ఈ విభజన వాదానికి ఆధునిక రూపం సాంస్కృతిక మార్క్సిజం. ఇది హిందూ మతాన్ని, భారతీయ సంస్కృతిని అణచివేతకు చిహ్నంగా చిత్రీకరించి, ఆదివాసీలను హిందూ సమాజం నుండి వేరు చేయడానికి ప్రయత్నిస్తుంది.**




బ్రిటిష్ వలస పాలన భారతదేశంలో ఆదివాసీల గుర్తింపుపై తీవ్ర ప్రభావం చూపింది. 'డివైడ్ అండ్ రూల్' (విభజించి పాలించు) పాలసీలో భాగంగాను, ఆదివాసీ ప్రాంతాలలో మిషనరీ కార్యకలాపాలను ప్రోత్సహించడం ద్వారా మత మార్పిడి చేయడంలో భాగంగాను బ్రిటిష్ వారు ఆదివాసీలను హిందూ సమాజం నుంచి వేరు చేయడానికి ప్రయత్నించారు. 19వ శతాబ్దం చివరలో, 20వ శతాబ్దం ప్రారంభంలో జరిగిన జనాభా గణనలలో ఆదివాసీలను 'అనిమిస్టులు' (ప్రకృతి ఆరాధకులు) లేదా 'ట్రైబల్ రిలీజియన్' (గిరిజన మతం) అనే ప్రత్యేక వర్గంగా గుర్తించడం ప్రారంభించారు. 1935లో భారత ప్రభుత్వ చట్టం ద్వారా ఆదివాసులను షెడ్యూల్డ్ తెగలుగా గుర్తించడం, వారికి ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించడం కూడా ఈ విభజనకు మరింత ఆజ్యం పోసింది.

ఇక సాంస్కృతిక మార్క్సిజం అనేది కార్ల్ మార్క్స్ ఆర్థిక సిద్ధాంతాలకు భిన్నంగా, సమాజంలోని సంస్కృతి, మతం, కుటుంబం వంటి సామాజిక సంస్థలను విశ్లేషించడానికి, విమర్శించడానికి ఉపయోగించే ఒక సైద్ధాంతిక దృక్పథం. దీని ప్రకారం, సంస్కృతి అనేది అణచివేతకు ఒక సాధనం, ఆధిపత్య వర్గాలు తమ అధికారాన్ని నిలుపుకోవడానికి దీనిని ఉపయోగిస్తాయి. భారతీయ సందర్భంలో, సాంస్కృతిక మార్క్సిస్టు ఆలోచనలు హిందూ మతాన్ని, దాని సంప్రదాయాలను కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి, వివక్షకు మూలంగా చిత్రీకరించడానికి ప్రయత్నించాయి. ఆదివాసీలను హిందూ మతం నుంచి వేరు చేసే ప్రయత్నాలలో ఈ సాంస్కృతిక మార్క్సిస్టు దృక్పథం కూడా భాగమే. ఆదివాసీల ప్రత్యేకతను, వారి స్వయం ప్రతిపత్తిని గౌరవించడం అవసరం అయినప్పటికీ, వారిని హిందూ సమాజం నుండి పూర్తిగా వేరు చేసి, వారిని బలహీనవర్గాలుగా మార్చడం, తద్వారా మత మార్పిడులకు పాల్పడటం అనేది ఒక వ్యూహంగా మారింది.

అయితే, హిందూ సమాజంతో ఆదివాసుల ఏకీకరణను ప్రోత్సహించేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయి, జరుగుతున్నాయి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) వంటి సంస్థలు ఆదివాసీలను హిందూ ధర్మంలో అంతర్భాగంగా భావిస్తూ, వారిని తిరిగి ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి కృషి చేశాయి. వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం స్థాపన (1952) ఈ దిశగా ఒక ముఖ్యమైన అడుగు. ఈ సంస్థ ఆదివాసీల సంక్షేమం, సంస్కృతి పరిరక్షణ పేరుతో వారిని హిందూ మతంలో ఏకీకృతం చేయడానికి కృషి చేసింది. హిందూ మతం అనేది ఒక నిర్దిష్ట సిద్ధాంతంగా కాకుండా, వివిధ ఆచారాలను సంప్రదాయాలను కలుపుకొనిపోయే విశాల దృక్పథాన్ని కలిగి ఉంది. ఆదివాసీల సంప్రదాయాలు ఈ విస్తృత హిందూ జీవన విధానంలో అంతర్భాగంగానే ఉన్నాయి. వారి ప్రత్యేక గుర్తింపును గౌరవిస్తూనే వారిని హిందూ సమాజంలో ఒక అంతర్భాగంగా చూడటం సమంజసం. చారిత్రక, సాంస్కృతిక, సామాజిక ఆధారాల ప్రకారం ఆదివాసీలు ముమ్మాటికీ హిందువులే!

■ కాయం నవేంద్ర
జాతీయ కన్వీనర్, అఖిల భారతీయ వనవాసి





విజ్ఞాన మందిరంలో గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



వివరాలు వెల్లడిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్, కార్పొరేటర్లు

14న పది కిలోమీటర్ల జాతీయ జెండా ప్రదర్శన

- ప్రజలు, విద్యార్థులు భాగస్వామ్యం కావాలి
- పిలుపు నిచ్చిన నగర మేయర్, కమిషనర్

గుంటూరుకార్పొరేషన్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14న 9 అడుగుల వెడల్పు, 10 కిలోమీటర్ల పొడవైన జాతీయ జెండా ప్రదర్శన చేపడుతున్నట్లు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పేర్కొన్నారు. నగర ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ షేక్ సజీలాతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. దేశంలో తొలిసారిగా 10 కిలోమీటర్ల జాతీయ జెండా ప్రదర్శన గుంటూరు నగరంలో జరుగుతుందన్నారు. ఐక్యత, దేశ భక్తి చాటేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతాయన్నారు. కమిషనర్ మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటలకు జాతీయ జెండా ప్రదర్శన ఉంటుందన్నారు. గతంలో 9 కిలోమీటర్ల జెండా ప్రదర్శన రికార్డ్‌గా ఉందని, పది కిలోమీటర్ల పొడవైన జెండా ప్రదర్శనతో రికార్డు సృష్టించడం జరుగుతుందన్నారు. జెండా ప్రదర్శనకు మూడు మార్గాలు గుర్తించి, పోలీసు అధికారులకు అందించామన్నారు. వారు ఫైనల్ చేసిన మార్గంలో ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. జాతీయ జెండా ప్రదర్శనలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, షేక్.మీరావలి, బి.స్మితపద్మజ, డి.లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.



బ్యారేజికి కొనసాగుతున్న వరద

దిగువకు 1లక్ష 11 వేల 500 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టు వాగుల నుంచి 1 లక్ష 29 వేల 450 క్యూసెక్కుల వరదనీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదైనట్లు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 20 గేట్లను 3 అడుగులు, 50 గేట్లను 2 అడుగుల మేర ఎత్తి దిగువకు 1 లక్ష 11 వేల 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అలాగే తూర్పు డెల్టా కాలువలకు 9 వేల 874 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువలకు 6 వేల 908 క్యూసె క్కులు, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

ఈ-క్రాప్ తిప్పలు తప్పేనా!

సాగు మొదలుకుని దిగుబడులను మద్దతు ధరకు అమ్ముకునే ప్రతి అంకంలోనూ 'ఈ-పంట నమోదు' కీలకం. పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రాయితీ ధరకు ఎరువులు అన్నింటికీ అదే ప్రామాణికం. సాగు విస్తీర్ణానికి, ఈ-పంట నమోదుకు పొంతన లేకుండా మమ అనిపించే తంతు గత ప్రభుత్వంలో నడిచింది. అన్నదాతలకు నేరుగా కొర్రీలు వేయకుండా ఈ-పంట సాకుతో వారిని అనేక పథకాల లబ్ధికి దూరం చేసిన ఘనత వైసీపీది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక కూడా ఈ-క్రాప్ నమోదు అదే రీతిన సాగిందనేది తాజాగా మార్క్‌ఫెడ్ చేపట్టిన పొగాకు కొనుగోళ్ల అంశంలో బయటపడింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు ఈ-పంట నమోదు తాజాగా ఊపందు కుంది. సాగు వివరాలు పక్కాగా నమోదు చేయడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. సిబ్బంది అలసత్వం వీడి.. క్షేత్ర స్థాయిలో పర్యటించి పక్కాగా ఆన్‌లైన్ చేస్తేనే రైతాంగానికి ఈ క్రాప్ తిప్పలు తప్పే అవకాశం ఉంది.

- ఖరీఫ్ సీజన్‌కు మొదలైన ఈ-పంట నమోదు
- ఖాళీ భూముల వివరాలూ యాప్‌లో నిక్షిప్తం
- పొగాకు కొనుగోళ్లలో బయటపడిన 'రబీ' తప్పులు
- క్షేత్రస్థాయి నమోదులో సిబ్బంది అలసత్వం

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో ఈ క్రాప్ ప్రారంభమైనట్లు వ్యవయసాయశాఖ తెలిపింది. ఈ పంటలో నమోదు చేయాలంటే పైరు వేసి కనీసం నెలయినా దాటి ఉంటేనే ఇమేజ్ పక్కాగా రావడానికి అవకాశం ఉందని సిబ్బంది చెబుతున్నారు. రైతులు తమ పైరు వివరాలు నమోదు చేసుకోవడానికి శ్రద్ధ చూపాలని వ్యవసాయ శాఖ కోరుతోంది. నమోదు ప్రక్రియ సెప్టెంబరు 15 వరకు కొనసాగుతుంది. ఆ తర్వాత గ్రామసభలు, ఫిర్యాదుల స్వీకరణ, తుది జాబితా ప్రచురణతో ఖరీఫ్ సీజన్ (మిగతా 6వ పేజీలో)



వేటపాలెంలో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్రమణ్యేశ్వరరావు (పాత చిత్రం)

అంతా డొల్లతనమే

పెసర సాగు చేస్తే మినుము, కంది సాగు చేస్తే శనగ ఇలాంటి అస్తవ్యస్త నమోదులు కోకొల్లలుగా రబీ సీజన్ మద్దతు ధర విక్రయాల్లో వెలుగు చూశాయి. క్షేత్రస్థాయిలో పర్యటించకుండా అరకొర సమాచారంపై ఆధారపడి వివరాలు నమోదు చేయడం వల్లే ఈ పంట నమోదులో అనేక అవకతవకలు వెలుగు చూస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో కేవలం రైతు చెప్పిందే ప్రామాణికంగా అప్‌లోడ్ చేస్తున్నారే తప్పితే ఫీల్డ్ విజిట్‌కు తిలోదకాలిచ్చి మమ అనిపిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఉన్న సిబ్బందితో ప్రతి ఎకరం ఫీల్డ్ విజిట్ చేసి వివరాలు నమోదు చేయాలంటే సాధ్యపడదని, పైగా అన్నదాతలూ అందుబాటులో ఉండడం లేదనేది సిబ్బంది వాదనగా ఉంది.

సింగిల్ యూజ్

ప్లాస్టిక్‌పై యుద్ధం

- పెద్దల అలవాట్లను పిల్లల ద్వారా మార్చే ప్రయత్నం
- నేడు విజ్ఞాన మందిరంలో వర్క్ షాప్
- హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జూనియర్ రెడ్‌క్రాస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ యుద్ధాన్ని ప్రకటించింది. ఇందుకోసం ఒక వినూత్నమైన ప్రాజెక్టుని చేపట్టింది. తల్లిదండ్రుల అలవాట్లలో వారి పిల్లలతో మార్పు తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకోసం ఏపీ క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్(ఏపీసీఏసీ), అమరావతి ప్లాస్టిక్ ఫ్రీ సిటీ క్యాంపెయిన్‌లకు సంబంధించి మంగళవారం వర్క్‌షాపు నిర్వహించబోతోంది. నగరంలోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ వర్క్‌షాపులో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారు. ఏపీసీఏసీ అనేది ముఖ్యంగా ఉన్నత విద్యా సంస్థలలో పర్యావరణ స్పృహ, కార్యాచరణని ప్రోత్సహించడంపై దృష్టి సారించిన రాష్ట్ర స్థాయి చొరవ. ఇది వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ఐదు అంశాల వ్యూహాన్ని కలిగి ఉంటుంది. వీటిలో ఇంధన సామర్థ్యం, పునరుత్పాదక ఇంధన విస్తరణ, అడవుల పెంపకం, ప్రపంచ ఉత్తమ పద్ధతుల స్వీకారం, అవగాహన కార్యక్రమాలు ఇమిడి ఉన్నాయి. ఈ కార్యకలాపాలకు నాయకత్వం వహించడానికి విద్యార్థులను వాతావరణ మార్పు ఏజంట్లుగా శిక్షణ ఇవ్వడం ప్రచార లక్ష్యంగా ఉంది. ఇప్పటికే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ గత నెల మొదటి వారంలో కళాశాల విద్యా శాఖతో కలిసి ఒక సంయుక్త వర్క్‌షాప్‌ని విజయవాడలో నిర్వహించింది. కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో పర్యావరణ స్పృహ, కార్యాచరణని ప్రేరేపించడం ఈ ప్రచారం లక్ష్యాలలో ఒకటిగా ఉంది. విద్యార్థులను యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లుగా నమోదు చేసుకొని క్లైమేట్ యాక్షన్ గ్రూపులను ఏర్పాటు చేస్తారు. ఈ క్యాంపెయిన్‌లో నీటి కాలుష్యం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లు, ఘన వ్యర్థాల తొలగింపు, చెట్ల పెంపకంపై దృష్టి పెడతారు. అలానే అమరావతి రాజధాని నగరం ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మాణం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నగరంలో ప్రారంభం నుంచి ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా చేయాలని రెడ్‌క్రాస్ సంస్థ చొరవ తీసుకొనేందుకు ముందుకొచ్చింది. ఈ ప్రచార కార్యక్రమాన్ని కూడా గవర్నర్ నజీర్ ప్రారంభిస్తారు.

పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రాష్ట్ర గవర్నర్ ఎస్ఏ నజీర్ పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సోమవారం పరిశీలించారు. వేదిక, సీటింగ్, పీఏ సిస్టం తనిఖీ ఏర్పాట్లపై అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులతో చర్చించి, సూచనలు అందించారు. జేసీ భార్గవ్ తేజ, మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు ఇతర అధికారులున్నారు.

త్వరలో స్మార్ట్ స్ట్రీట్ బజార్లు

కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో త్వరలో డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో స్మార్ట్ స్ట్రీట్ బజార్లు ఏర్పాటు చేయనున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కాకాని రోడ్ వై జంక్షన్ నుంచి ఆటోనగర్ వరకు స్మార్ట్ బజార్ ఏర్పాటుకు ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళలను ఆర్థికంగా తీర్చిదిద్దేందుకు వారి ఉత్పత్తుల విక్రయానికి స్మార్ట్ స్ట్రీట్ బజార్లు ఏర్పాటు చేయడానికి నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా గుంటూరు నగరంలో పలు ప్రాంతాలను పరిశీలించి, అనుకూల మైన ప్రాంతాన్ని బజార్ల ఏర్పాటుకు ఫైనల్ చేస్తామని తెలిపారు. స్మార్ట్ స్ట్రీట్ బజార్లలో మెప్మా ద్వారా శిక్షణ పొందిన డ్వాక్రా మహిళలకు షాప్‌లు కేటాయిస్తామన్నారు. అనంతరం స్తంభాల గరువులోని షాదీఖానాను పరిశీలించారు. అందులో ఉన్న నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసి, వారు ఇచ్చే వివరణ మేరకు చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్ రాంబాబునుని కమిషనర్ ఆదేశించారు. ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ రెహ్మాన్, డీఈఈ హనీఫ్ పాల్గొన్నారు.



హైవే వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

ట్రాఫికర్



శంకర్‌విలాస్ ఫ్యాక్టరీ రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

- కంకరగుంట, డొంకరోడ్డు ఆర్‌యూబీల అప్రోచ్‌ల వద్ద అష్టదిగ్బంధం
- రెండేళ్లు ఇదే పరిస్థితి అంటే నరకమే
- ప్రత్యామ్నాయాలను తప్పక ఆలోచన చేయాల్సిందే..

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శంకర్ విలాస్ ఆర్‌వోబీ కూల్చివేత అనంతరం విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు సోమవారం తెరుచుకోవడంతో ఎక్కడెక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందో స్పష్టమైంది. అలానే ఏ సమయంలో ఎక్కువగా వాహనాల రద్దీ ఉంటుంది, ఎప్పుడు తక్కువగా ఉంటుందనే దానిపై కూడా ఒక అవగాహనకు వచ్చేలా చేసింది. ఇప్పటి వరకు పోలీసు శాఖ అమలు చేస్తోన్న ట్రాఫిక్ మళ్లింపులు.. సమస్య పరిష్కారానికి సరిపోవు. ఇంకా కొన్ని ప్రత్యామ్నాయాలను చూడకపోతే సమస్య మరింత జఠిలంగా మారే అవకాశం లేకపోలేదు. ముఖ్యంగా కొన్ని మార్గాల్లో ఒన్‌వే ట్రాఫిక్‌నే తప్పక అమలు చేయాలి. లేకుంటే సంవత్సరాల తరబడి ప్రజలు ఇబ్బంది పడక తప్పదు.

లభించని అనుమతులు..

కోర్టు కేసులు పరిష్కారం కాకుండా.. రైల్వే నుంచి పూర్తి స్థాయిలో అనుమతులు రాకుండానే రోడ్లు, భవనాల శాఖ శంకర్‌విలాస్ ఆర్‌వోబీ కూల్చివేతని చేపట్టింది. ఇంకా చాలామంది భవన యజమానులు నగరపాలక సంస్థకు స్థలాన్ని స్వాధీనం చేయలేదు. కోర్టుల్లో న్యాయ పోరాటం చేస్తున్నారు. మరోవైపు రైల్వేకు ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల ఎంతైతే భూమి కోల్పోతుందో అంతకు సమానంగా భూమిని నగరపాలక సంస్థ ఇవ్వాలి. అలానే ప్రస్తుత బ్రిడ్జి రైల్వే భాగంలో తొలగించాలంటే కచ్చితంగా రైల్వే బోర్డు నుంచి అనుమతి తీసుకోవాలి. ఇందు కోసం గుంటూరు నుంచి నడికుడి, నరసరావుపేట మార్గంలో వెళ్లే రైళ్లను నిలిపేసి బ్రేక్ డౌన్ తీసుకోవాలి. ఇప్పటి వరకు రైల్వే నుంచి దీనికి సంబంధించి ఎలాంటి అనుమతి రాలేదు. అయినప్పటికీ పిల్లర్ల నిర్మాణం పేరుతో బ్రిడ్జి కూల్చివేత చేపట్టారు. దీనికంటే ముందు రీయిన్ ఫోర్స్‌డ్ వాల్ నిర్మాణం చేపట్టి ఉంటే పాత బ్రిడ్జి మరికొన్ని రోజుల పాటు కొనసాగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండేది.

- కంకరగుంట ఆర్‌యూబీ వద్ద కలెక్టరేట్ వైపున ఎక్కువగా సమస్య ఉత్పన్నమవుతోంది. ఇక్కడ ఏటీ అగ్రహారం వైపు నుంచి వాహనాలు వస్తున్నాయి. అలానే కలెక్టరేట్ వైపు నుంచి ఏటీ అగ్రహారం వైపునకు వాహనాలు వెళుతున్నాయి. ఇక ఆర్‌యూబీలోకి కూడా రెండు మార్గాల్లో నుంచి వాహనాలు ప్రవేశిస్తున్నాయి. దీని వల్ల ఇక్కడ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. దీనికి ప్రత్యామ్నాయం ఏటీ అగ్రహారం వైపు నుంచి వచ్చే వాహనాలను మెయిన్ రోడ్డులో నుంచే అంకమ్మ నగర్‌లో మళ్లిస్తే సమస్య కొంత మేరకు పరిష్కారం అవుతుంది.
- అలానే టీజేపీఎస్ కళాశాల వద్ద రాంగ్‌రూట్‌లోకి వాహనాలు వచ్చి ఆర్‌వోబీ పైకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ రాంగ్ రూట్ ప్రయాణాన్ని నిరోధించాలి. నగరంపాలెం పోలీసు స్టేషన్ నాలుగు రోడ్ల కూడలిని మూసేసి ఇరువైపులా కొంత దూరం ప్రయాణించాక యూటర్న్‌లు ఇస్తే సమస్య కొంతవరకు పరిష్కారం అవుతుంది.

ట్రాఫిక్ సమస్యలు ఇలా..

అరండల్‌పేట బ్రిడ్జికి ప్రత్యామ్నాయంగా ట్రాఫిక్‌ని కంకరగుంట ఆర్‌వోబీ/ఆర్‌యూబీ, డొంకరోడ్డు మూడొంతెనల కిందకు పోలీసు శాఖ మళ్లించింది. ఉదయం 8 నుంచి 10 గంటల మధ్యన, సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్యన వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. డొంకరోడ్డు మూడు వంతెనల నుంచి కొత్తపేట వైపునకు ప్రవేశించగానే ట్రాఫిక్ కొత్తపేట సిటిజన్ హాస్పిటల్ వరకు సుమారు 400 మీటర్ల పొడవునా స్తంభించిపోతోంది. అలానే మూడు వంతెనల కింద రాంగ్ రూట్‌లో వాహనాలు ప్రవేశిస్తున్నాయి. దీనికి పోలీసులు అడ్డుకట్ట వేయాలి.



కంకరగుంట బ్రిడ్జిపై ట్రాఫిక్ రద్దీ



క్యాన్సర్ ఆస్పత్రి నమూనా

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి రేపు భూమి పూజ

తుళ్లూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు రెవెన్యూలో బుధవారం బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి భూమిపూజ జరగనుంది. 21 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇండో- అమెరికన్ హాస్పటల్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఉదయం 10.18 నిమిషాలకు హాస్పటల్ సీఈవో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేతుల మీదగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తుళ్లూరు మండల బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు నెలకుదిటి చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.



8

ర్యాగింగ్ వద్దు

- నేటి నుంచి...యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్
- వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు

6

రజిని బీజేపీలోకి వెళ్దామనుకుంది..!

ఫలించిన కేంద్ర పథకం.. జిల్లాలో రూ.256.32 కోట్ల పెట్టుబడులు

- అగ్రి ఆధారిత పరిశ్రమలు, విలువ జోడింపునకు ఊతం

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీం ఫర్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ(పీఎల్ఐఎస్ఎఫ్‌పీఐ) కింద గుంటూరు జిల్లాలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకొచ్చాయి. వీటిల్లో ఇప్పటికే కొన్ని సంస్థలు పరిశ్రమలు స్థాపించి కార్యకలాపాలు కూడా ప్రారంభించాయి. పండ్లు, కూరగాయలు, మెరైన్ ఉత్పత్తుల పరిశ్రమల ఏర్పాటుకు ఈ స్కీం ఊతమిస్తోంది. దీంతో ఐటీసీ సంస్థ.. ఈ కేంద్ర ప్రభుత్వ పథకాన్ని వినియో గించుకొని పెట్టుబడులు పెట్టింది. ఇచ్చిన కమిట్‌మెంట్ కంటే ఎక్కువగానే ఇన్వెస్టు చేసినట్లు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు పూర్తి వివరాలతో కూడిన నివేదికను కేంద్ర ప్రభుత్వం సమర్పించింది.

అంతర్జాతీయ మార్కెట్లో భారత దేశ ఆహార ఉత్పత్తులను ప్రమోట్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. నీతి ఆయోగ్ సంస్థ ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ కార్యక్రమం కింద ఈ స్కీం తీసుకొచ్చింది. 2021-22లో ప్రారంభమైన ఈ స్కీం 2026-27తో ముగుస్తుంది. గుంటూరు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఐటీసీ సంస్థ కూరగాయాలు పండ్ల వ్యాపారంలో రూ. 127.2, రూ. 4.96, మెరైన్ ఉత్పత్తుల్లో 33.31, రూ.44.91, ఐటీసీ లిమిటెడ్(ఎస్‌పీ ఎడిబుల్స్) సంస్థ పండ్లు, కూరగాయలలో రూ.3.34 కోట్లు, ఐటీసీ లిమిటెడ్(శ్రీ సాయి ఆగ్రో) సంస్థ ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్‌లో రూ.16.12 కోట్లు, ఎంటీఆర్ ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ కూడా ఇదే రంగంలో రూ. 26.52 కోట్ల పెట్టుబడులు పెట్టాయి. ఈ విధంగా ఇప్పటికే రూ. 256.32 కోట్ల పెట్టుబడులు ఈ ప్రొడక్షన్ లింకడ్ ఇన్సెంటివ్ స్కీమ్ కింద పెట్టినట్లు కేంద్రం తాజాగా ప్రకటించింది. ఈ పథకం ముగియడానికి మరో ఏడాదికి పైగా గడువు ఉన్నందున మరింతగా పెట్టుబడులు జిల్లా ఆకర్షించే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి.

'ఈ-క్రాప్' తిప్పలు తప్పేనా..!

(5వ పేజీ తరువాయి)

ప్రక్రియ ముగియనుంది.

పొగాకు కొనుగోళ్లలో బయటపడిన ఈ-క్రాప్ తప్పిదాలు

మార్క్‌ఫెడ్ చేపట్టిన పొగాకు కొనుగోళ్ల ఈ-పంట నమోదు అవకతవకలు బయటపడ్డాయి. క్షేత్రస్థాయిలో పొగాకు సాగు వేల ఎకరాల్లో ఉండగా ఈ-క్రాప్ గణాంకాల్లో అది పాతికశాతం కూడా లేదు. పైగా అదే పొలంలో వేరే పంట సాగు చేస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేశారు. రబీలో ఈ-క్రాప్ నమోదు వ్యత్యాసాలు పొగాకు కొనుగోళ్లకు ప్రతిబంధకంగా మారాయి. వాటిని ఒక కొలిక్కి తేవడానికి రాష్ట్రస్థాయిలో కసరత్తు చేయాల్సి వచ్చింది. ఇదే కాకుండా మద్దతు ధరకు తమ ఉత్పత్తులు అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలు బాట పట్టిన రైతులు. నిరాశతో వెనుదిరిగిన ఉదంతాలు కోకొల్లలు.

ఖాళీ భూములతో సహా..

గతంలో జరిగిన ఈ క్రాప్ నమోదులో సాగు చేయకుండా ఖాళీగా ఉన్న భూములకు చోటులేదని కాదు. కానీ, వాటి వివరాలు కూడా పక్కాగా ఆన్‌లైన్ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కౌలుదారుల విషయంలోనూ.. కౌలుదారు కార్డు ఉంటే దాని ఆధారంగా ఈ క్రాప్ చేయనుంది, ఒక వేళ లేకపోయినా సాగుదారుడి కింద కౌలుదారు పేరే నమోదు చేయనుంది. ప్రతి ఎకరం ఫొటో తీసి వివరాలు పక్కాగా నమోదు చేయాల్సిందే. వైసీపీ ప్రభుత్వంలో యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్‌ఫాం యాప్‌తో ఈ-పంట నమోదు చేశారు. దానిలో అనేక లొసుగులు ఉండడంతో డేటా కచ్చితత్వంలో లేకపోవడం వల్ల అన్నదాతలకు అన్యాయం జరిగేది. ఇప్పుడు దాని స్థానంలో ఎన్ఐసీ యాప్ ద్వారా ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌ను ఈ ప్రభుత్వం అమల్లోకి తెచ్చి.. దాని ద్వారా పంట వివరాలను నమోదు చేస్తోంది.

రజిని బీజేపీలోకి వెళ్దామనుకుంది..!

- స్టోన్ క్రషర్ వివాదంలో ఎంపీ లావుకు రాయబారం
- ప్రశ్నించిన వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తోంది
- మాజీ మంత్రిపై సొంత పార్టీ నేతల తిరుగుబాటు

చిలకలూరిపేట, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట వైసీపీలో ముసలం పుట్టింది. పార్టీలో అన్నీ తానై వ్యవహరిస్తున్న మాజీ మంత్రి రజినిపై తిరుగుబాటు మొదలైంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని చిలకలూరిపేట మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్న (గడ్డం చిన్న), పోతవరం గ్రామ సర్పంచ్ షేక్ అబ్దుల్ బాషాను రెండు రోజుల క్రితం వైసీపీ నుంచి సస్పెండ్ చేశారు. వారిద్దరూ వైసీపీలోని మరికొంత నాయకులను కలుపుకుని సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. రజినిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

బొల్లెద్దు చిన్న మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రజని గుంటూరు వెళ్లి.. తిరిగి చిలకలూరిపేటకు పార్టీ ఇన్‌చార్జిగా వచ్చి పార్టీ నాయకులను పట్టించుకోవడం మానివేసిందన్నారు. ప్రధానంగా దళిత, ఇతర సామాజిక వర్గాలకు చెందిన నాయకులను దూరం పెట్టిందని మండిపడ్డారు. వైసీపీ ఓటమి తర్వాత బండి సంజయ్, నాగబాబులను.. మరి కొంతమంది నాయకులను కలిసి పార్టీ మారేందుకు ఆమె ప్రయత్నించారని ఆరోపించారు. పార్టీలో ప్రశ్నించే వారిని పార్టీ నాయకులకు తెలియకుండానే సస్పెండ్ చేస్తున్నారని ప్రకటిస్తున్నారని అన్నారు. ఇటువంటి బెదిరింపులకు భయపడమని చెప్పారు. నియోజక వర్గంలో జగనన్న కాలనీ, స్టోన్ కస్టర్లు, వెంచర్లతోపాటు ఇతర వ్యవస్థలకు చెందిన వారి దగ్గర ఆమె పీఏల చేత అక్రమ వసూళ్లు చేయించడమే కాకుండా పార్టీని నాశనం చేశారని దుయ్యబట్టారు. దళిత నాయకుడు వెంగళ రాయుడు మీద గంజాయి కేసు కూడా పెట్టించినట్టు విమర్శించారు. బోయపాలెంలోని క్రషర్ యాజమాన్యం వద్ద డబ్బులు తీసుకోలేదని బోయపాలెంలోని పార్వతీ అమ్మ వారి గుడి వద్ద ప్రమాణం చేస్తావా అని సవాల్ విసిరారు. ఈ అవినీతి వ్యవహారాన్ని సెటిల్ చేయమని ఎంపీ కృష్ణదేవరాయలు వద్దకు రాయబారం పంపించావా? లేదా అంటూ నిలదీశారు. జగనన్న కాలనీ విషయంలో పసుమర్రు రైతుల దగ్గర నుండి కోట్ల రూపాయలు దోచుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. పీఏ శ్రీకాంత్ రెడ్డి కోసం ఒక సీఐ మీదే గొడవ పెట్టుకున్న రజని.. తన కోసం పనిచేసిన కార్యకర్తల మీద కేసులు పెడుతుంటే ఏనాడైనా పలకరించారా అని నిలదీశారు. పార్టీ విషయాల గురించి వైవీ సుబ్బారెడ్డి, గౌతమ్‌రెడ్డికి వివరించామని, ఈ నెల 17న పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం ఉంటుందని తెలిపారు.

పోతవరం సర్పంచ్ అబ్దుల్ బాషా మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో తాను రూ.5 లక్షలు ఇచ్చానని, తిరిగి ఇవ్వమని అడిగితే ఇవ్వడం లేదని పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళితే.. ఆయన డబ్బులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. ఆ తరువాత రజని తనకు ఫోన్ చేసి బెదిరించడమే కాకుండా అసహ్యంగా మాట్లాడిందన్నారు. పోతవరం పంచాయతీని ఏకగ్రీవం చేస్తామని చెప్పి, మోసాలకు పాల్పడ్డారన్నారు. అప్పుడు రూ.6 లక్షల వరకు ఖర్చు పెట్టానని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని సీనియర్ నాయకులకు వివరించామని, దీంతో రజని పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తమను సస్పెండ్ అయ్యేలా చేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి బతికినంత కాలం ఆయన కోసమే పనిచేస్తామని, రజిని తమకు వద్దని బాషా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో యడ్లపాడు వైసీపీ నాయకులు సాగర్, కనపర్రు సర్పంచ్ వెంకటేశ్వర్లు, పోతవరం ఉప సర్పంచ్ వెంకటస్వామి, నాదెండ్ల ఎంపీపీ భర్త రత్తయ్య, నూతక్కి నాగేశ్వరావు పాల్గొన్నారు.

డీ ఫార్మసీలో ప్రవేశానికి ఆహ్వానం

గుంటూరు (విద్య) ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డీ ఫార్మసీ కోర్సులో ప్రవేశం కోసం దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జాస్తి ఉషారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 19 లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం గుజ్జనగుళ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల(92471 20305, 98480 38769)లో సంప్రదించాలని తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

పొన్నూరుటౌన్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతిచెందిన సంఘటన పొన్నూరు పట్టణంలో సోమవారం వెలుగు చూసింది. రైల్వే పోలీసులు, స్థానిక పోలీసుల కథనం ప్రకారం నిడుబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో ప్రభుత్వాసుపత్రి వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందిన సంఘటనను స్థానికుల ద్వారా పోలీసులు తెలుసుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం బాపట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

పొన్నూరుటౌన్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): మనస్థాపంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని మునిపల్లె గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని మునిపల్లెకు చెందిన బురదగుంట బిందు (28)కి వినోద్ కుమార్‌తో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. ఆదివారం వినోద్ కుమార్‌తో భార్య బిందుకు చిన్నపాటి వివాదం జరిగింది. సోమవారం వినోద్ కుమార్ బంధువుల ఇంటికి వెళ్లి ఇంటికి రాగా బిందు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు వినోద్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ గండు కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బిందు మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం నిడుబ్రోలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

జర్నలిజం డిప్లమో పరీక్షలు ప్రారంభం



తనిఖీ చేస్తున్న సమన్వయకర్త ఆచార్య మన్నవ సుబ్బారావు

పెదకాకాని, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సీఆర్ మీడియా అకాడమీ-ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం వర్సిటీలోని డిప్లమో ఇన్ జర్నలిజం కోర్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయని పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు తెలిపారు. ఈ నెల 14న పరీక్షలు ముగుస్తాయన్నారు. తొలి రోజు పది మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. చరిత్ర విభాగం పరీక్ష కేంద్రంలో జరుగుతున్న ఈ పరీక్షలను ఆయన తనిఖీ చేశారు.

49,176 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 51,722 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,176 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,724 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11000
334	9500	13400	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13200	334	9500	13200
273	---	---	నెంబరు. 5	10000	13300
341	10000	14200	273	---	---
4884	---	---	341	11000	14600
సూపర్ 10	---	----	4884	10000	12500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14200	తేజ	10000	14000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	12500
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10200	12800
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	5000	7000

4 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల



నాగార్జున సాగర్ జలాశయం నుంచి 4 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి 65,800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో సోమవారం ప్రాజెక్ట్ అధికారులు సాగర్ ప్రాజెక్ట్ 4 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. నాగార్జున ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 589.30 అడుగులు ఉంది. ఇది 309.95 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7086 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5800 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,785 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, 4 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 32,108 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 75,879 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో వాటర్‌గా 65,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

కుడి కాలువలో యువకుడి గల్లంతు

మాచర్లటౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కుడి కాలువలో ఈతకు దిగి యువకుడు గల్లంతైన సంఘటన మండలంలోని తాళ్లపల్లి వద్ద చోటు చేసుకుంది. మాచర్ల పట్టణానికి చెందిన యానాల శివ (28) సోమవారం తాళ్లపల్లి బ్రిడ్జి కుడికాలువలో ఈత కొట్టేందుకు దిగి నీటి ఉధృతికి గల్లంతయ్యాడు. పోలీసులు శివ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

విధుల నుంచి హాస్టల్ వార్డెన్ తొలగింపు

వాచ్‌మెన్ కూడా.. జిల్లా కలెక్టర్ ఆదేశం

దాచేపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లి ప్రభుత్వ బాలు ర కళాశాల వసతి గృహంలో ఇటీవల విద్యార్థులు హాస్టల్‌లో ఘర్ష ణ పడటం జరిగింది. దీనికి బాధ్యులుగా చేస్తూ హాస్టల్ వార్డెన్‌ను విధుల నుంచి తొలగించటంతో పాటు హాస్టల్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న సంజేశ్వరరావును విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు, పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. వివరాలు.. దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు తోటి విద్యార్థిపై తీవ్రంగా దాడి చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని తెలుసుకున్న గురజాల డీఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. విచారణలో ఒక విద్యార్థిని మరో ఐదుగురు విద్యార్థులు కలసి దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలోని బీసీ హాస్టల్ లోని గదిలో ఉంచి తీవ్రంగా దాడి చేశారు. ఆ విద్యార్థికి కరెంటు షాక్ కూడా పెట్టి సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తూ చంపుతామంటూ బెదిరింపులకు కూడా పాల్పడ్డారు. ఈ విషయాన్ని డీఎస్పీ దర్యాప్తులో సమాచారాన్ని సేకరించి దాడిచేసిన విద్యార్థులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అనంతరం స్టేషన్ బెయిల్‌పై విద్యార్థులను విడుదల చేశారు. జరిగిన విషయం అంతా జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. వార్డెన్‌ను వసతి గృహ విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు ఇచ్చారు. వాచ్‌మెన్ సంజేశ్వరరావును విధుల నుంచి తొలగించారు. హాస్టల్‌లో ఘర్షణ పడిన విద్యార్థులను హాస్టల్ నుంచి తొలగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

14న వాలీబాల్ జట్ల ఎంపిక

గుంటూరు (విద్య) ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 15 విభాగంలో బాల బాలికల వాలీబాల్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు డీఈఓ సీవీ రేణుక, ఫెడరేషన్ కార్యదర్శి మల్లంపూడి రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న మధ్యాహ్నం ఒంటిగంటకు గుంటూరు నగరంలోని ప్రభుత్వ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో (పాత బస్టాండ్ సెంటర్) ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తదితర వివరాలతో ఎంపి కలకు రావాలన్నారు. 2010 జనవరి 1 తర్వాత జన్మించిన బాల బాలికలు అర్హులన్నారు. 18న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి జట్ల ఎంపికకు పంపుతామని తెలిపారు.

సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీల్లో విజేతగా కృష్ణా



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పిచ్చుకలగుంట మైదానంలో జరిగిన దివ్యాంగుల స్వర్ణాంధ్రా సెంట్రల్ జోన్ ఇంక్లూజివ్ క్రికెట్ పోటీల్లో కృష్ణా జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కృష్ణా నిర్ణీత 16 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 161 పరుగులు చేసింది. గుంటూరు జట్టు 13.5 ఓవర్లలో కేవలం 101 పరుగులు సాధించి ఆలౌట్ అయ్యింది. 61 పరుగుల భారీ తేడాతో కృష్ణా జట్టు ఘన విజయం సాధించింది. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ, అర్జున అవార్డు గ్రహీత ఇల్లూరి అజయ్‌కుమార్ రెడ్డి, క్రోసూరు మండల ఉపాధ్యక్షుడు గల్లా గురుపాదం పాల్గొని విజేతలకు, రన్నర్స్‌కు ట్రోఫీలు అందజేశారు. డీసీఏఏ సెలక్షన్ కమిటీ చైర్మన్ గండా కైలాష్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటర్ వేల్పూరి విజయకుమార్, జిల్లా ఇన్‌చార్జి కె.శ్రీనివాసు పాల్గొన్నారు.

నారాకోడూరు-తెనాలి-మంగళగిరి నాలుగు లైన్ల రహదారి సర్వే



సంగం జాగర్లమూడి బ్రిడ్జి వద్ద సాయిల్ టెస్ట్ కోసం డ్రిల్లింగ్ చేస్తున్న కార్మికుడు

తెనాలి అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నారాకోడూరు-తెనాలి-మంగళగిరి నాలుగు లైన్ల రహదారి సర్వే పనులు ఈ-అసోసియేట్స్ కన్సల్టెన్సీ చేపట్టింది. సంగం జాగర్లమూడి బ్రిడ్జి వద్ద సాయిల్ టెస్ట్ కోసం డ్రిల్లింగ్ చేస్తున్నారు. 40 కి.మీ మార్గంలో నాలుగు లైన్ల రహదారి నిర్మించేందుకు ఈ సంస్థకు డీపీఆర్ సిద్ధం చేసే పనిని అప్పగించారు. ఈ మార్గంలో ఎక్కడ బ్రిడ్జిల అవసరం, ఎంత ఫౌండేషన్‌లో రోడ్డు నిర్మాణం చేయాలి అనే తదితర అంశాలతో డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును ఫిబ్రవరిలోగా ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. ఈ రహదారి నిర్మాణానికి అయ్యే వ్యయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాయి. అంతా సవ్యంగా జరిగితే డీపీఆర్ వచ్చిన తరువాత నిధులు కేటాయించి టెండర్లు పిలుస్తారని, వచ్చే వేసవిలో రహదారి పనులు ప్రారంభం కావచ్చునని అంచనా వేస్తున్నారు.

ఎఫ్ఏ-1 పరీక్షలను తనిఖీ చేసిన ఆర్‌జేడీ

గుంటూరు (విద్య) ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన ఫార్మేటివ్ అసెస్మెంట్ 1(ఎఫ్ ఏ 1) పరీక్షల నిర్వహణను పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ లింగేశ్వర రెడ్డి పరిశీలించారు. గుంటూరు నగరంతో పాటు జిల్లాలోని పలు పాఠశాలల్లో ఆయన తనిఖీ చేపట్టారు. తొలిసారిగా బుక్ లెట్ విధానంలో నిర్వహించిన పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. నగరంలోని కొత్తపేట జలగం రామారావు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ముందుగానే బుక్‌లెట్ విధానంలో జరిగే పరీక్షలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, దాసరి రాజా మాస్టారు తదితరులు

చేనేత కుటుంబాలకు సీఎం చంద్రబాబు చేయూత

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : చేనేత కుటుంబాలకు సీఎం చంద్రబాబు నాయుడు చేయూతనిచ్చారని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు. చేనేత కుటుంబాలకు సంవత్సరానికి రూ.25 వేలు, చేనేత మెషిన్లకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత కరెంట్ ఇస్తూ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి సోమవారం వీవర్స్ కాలనీ 10వ లైన్‌లో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజా మాస్టర్, కన్నా మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కారం చేయాలి

● అధికారులను ఆదేశించిన కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు అందించే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో సోమవారం డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 28 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేర్వేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్ గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా 32 అర్జీలు అందాయన్నారు. డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంఒహెచ్(ఇన్‌చార్జి) రామారావు, మేనేజర్ బాలాజీ, బాషా పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

15 నాటికి స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లు, డ్రెయిన్లు ఆక్రమణ చేసుకొని, ట్రాఫిక్ సమస్య, మురుగు పారుదలకు అడ్డంకిగా ఉన్న ఆక్రమణదారులు ఈనెల 15 నాటికి స్వచ్ఛందంగా తొలగించుకోవాలని తుది హెచ్చరిక చేస్తున్నామని, లేకుంటే జీఎంసీ సిబ్బందే స్పెషల్ టీంలతో ఆక్రమణలను సమూలంగా తొలగిస్తారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ వర్షాల వలన డ్రెయిన్లు పొంగి మురుగు రోడ్ల మీదకు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజల నివాసాల్లోకి వెళ్లడం వలన పలు సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. అలాగే ట్రాఫిక్ సమస్య కూడా తీవ్రంగా ఉంటుందన్నారు. రోడ్ల కు ఇరువైపులా డ్రెయిన్ల మీద ఉన్న ఆక్రమణల వలన పూడికతీత పనులు చేపట్టడానికి ఆటంకంగా ఉంటుందన్నారు. ఆక్రమణదారులకు ఇప్ప టికే పలు దఫాలు ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని తెలిపామని, ఆగస్టు 15 తర్వాత పట్టణ ప్రణాళిక సిబ్బంది తొలగిస్తారని, అందులో జరిగే నష్టానికి ఆక్రమణదారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

పోస్టర్ అడాప్షన్ ద్వారా శాశ్వత దత్తతకు అవకాశం

● కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఆరు సంవత్సరాల పైబడి 18 సంవత్సరాల లోపు పిల్లలను 2 సంవత్సరాలు పెంచి తదుపరి శాశ్వతంగా దత్తత పొందే అవకాశం పోస్టర్ అడాప్షన్ ద్వారా కలుగుతుందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మిషన్ వాత్సల్య, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ రూపొందించిన 'కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే పిల్లలు' అనే అడాప్షన్ ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజతో కలసి ఆవిష్కరించారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ దత్తత తీసుకోవాలనే తల్లితండ్రులకు ఆలస్యం అవుతున్నందున తాత్కాలికంగా పోస్టర్ అడాప్షన్ పరిచయం చేయబడిందన్నారు. ఐసీడీఎస్ పీడీ ప్రసూన మాట్లాడుతూ ఈ దత్తత కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన ఏడుగురితో కమిటీ ఏర్పాటు చేయబడిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, డీఆర్‌ఓ ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ జ్యోతిబసు, హౌసింగ్ పీడీ ప్రసాద్, సీపీవో శేషశ్రీ, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, ఉద్యాన శాఖ అధికారి రవీంద్రబాబు, పశు సంవర్ధక శాఖ డీడీ డాక్టర్ కేవీవీ సత్యనారాయణ, గ్రామ, వార్డు సచివాలయాల కో ఆర్డినేటర్ మోహన్‌రెడ్డి, ల్యాండ్ అండ్ సర్వే శాఖ ఏడీ పవన్‌కుమార్, డీఎఫ్‌ఓ హిమ శైలజ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి, డాక్టర్ విజయలక్ష్మి, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ జిల్లా రిజిస్ట్రార్ డి.శైలజ, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలకు ప్రతీక కూర్మావతారం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంక టేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కళ్యాణవేదికపై కూర్మావతారం-మానవతా విలువలపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. ఆలయ పాలకమండలి వారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోగంటి వేంకట అప్పలాచార్యులు ప్రవచిస్తూ కూర్మావతారం విష్ణువు రెండో అవతారంగా మానవతా విలువలకు ప్రతీక అన్నారు.

తాకట్టులో ఉన్న ఫ్లాట్ విక్రయించి మోసం

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : బ్యాంక్ తాకట్టులో ఉన్న ఫ్లాట్ విక్రయించి మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆరండల్‌పేటకి చెందిన అమర్ నాథ్, అతని స్నేహితుడు ఖలీల్ ద్వారా నరసరావుపేటకి చెందిన బెజవాడ రజని, కాంతాచారిలకు చెందిన అపార్టుమెంట్ లోని ఫ్లాట్ అమ్మకానికి ఉంది అని తెలుసుకొని వారిని సంప్రదించాడు. వారు అమర్‌నాథ్‌కు మాయ మాటలు చెప్పి బ్యాంక్ తాకట్టులో ఉన్న ఫ్లాట్‌ని అగ్రిమెంట్ చేసి రూ.12 లక్షలు తీసుకున్నారు. ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేయకుండా, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుండా రజని, కాంతాచారి మోసం చేసినట్లు ఫిర్యాదు చేశారు.

అపార్టుమెంట్ పైనుంచి పడి మహిళా కూలి మృతి

స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోనే స్తంభాలుగరువులో నిర్మాణంలో ఉన్న అపార్ట్మెంట్ మూడవ అంతస్తులో నుంచి కాలుజారిపడి మహిళా కూలి బి కొండమ్మ (41) మృతి చెందారు. కొండమ్మ భర్త గతంలోనే మృతిచెందారు. ఆమెకు ఇరువురు కుమార్తెలు ఉండగా పెద్ద కుమార్తె రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్ణీత గడువులోనే అర్జీలను పరిష్కరించాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి
● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 225 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవతేజ తదితరులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వ హించారు. కార్యక్రమానికి 225 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవతేజ, డీఆర్వో ఖాజా వలీ, డిప్యూటి కలెక్టర్లు లక్ష్మీకుమారి, గంగరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ శ్రీనివాస్, ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి ఆమె అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిటిషన్లు సకాలంలో పరిష్కరించకుండా బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళితే సంబంధిత అధికారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 15న స్వతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు ప్రకారం ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా 13, 14, 15 తేదీల్లో ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీటీసీ సీతారామిరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి రవీంద్రబాబు, పశు సంవర్ధక శాఖ డీడీ సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి

మహిళలకు ఈ నెల 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపించాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఎన్నికల హామీలో భాగంగా వాహనమిత్ర పథకం కింద డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న డ్రైవర్‌కు ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం ఇవ్వాలన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌పై విధించిన వ్యాట్‌తో పాటు ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీఐటీయూ నాయకులు నన్నపనేని శివాజీ, బి.లక్ష్మణరావు, మస్తాన్‌వలి, శంకరరావు తదితరులు ఉన్నారు.

ఇతర రాష్ట్రాల్లో చదువుకుని వచ్చిన వారికి పథకాలు అందించాలి

కేంద్ర ప్రభుత్వ పథకమైన శ్రేష్ట ద్వారా ఇతర రాష్ట్రాల్లో 8 నుంచి 12వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వర్తింప చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు అర్జీ అందజేశారు. ప్రభుత్వ జీవో 20 ప్రకారం చదువు పూర్తయిన అనంతరం స్థానికేతరులుగా గుర్తించి పథకాలకు దూరం చేస్తున్నారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో పాటిబండ్ల సుధాకర్, అడపా రవి, ఏసు ఉన్నారు.

గుంటూరు ఛానల్ పొడిగింపు పనులను ప్రారంభించాలి

గుంటూరు ఛానల్ పొడిగింపునకు నిధులు కేటాయించి, పనులను ప్రారంభించాలని నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ అర్జీ అందజేశారు. 2019లో ఛానల్ పొడిగింపునకు పరిపాలన అనుమతి ఇచ్చి ఇప్పటికి ఆరు సంవత్సరాలు గడిచినా నేటికి భూసేకరణ కూడా పూర్తి కాలేదన్నారు. వెంటనే భూమిని సేకరించి పనులు ప్రారంభించి దాదాపు 50 గ్రామాల రైతులకు సాగు, తాగునీరు ఇప్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో లావు అంకమ్మ చౌదరి, మన్నవ హరిప్రసాదు తదితరులు ఉన్నారు.

రేషన్ ఇవ్వడం లేదు

తమ ప్రాంతంలో రేషన్ పంపిణీ సరిగ్గా జరగడం లేదని స్థానిక 29వ వార్డు నల్లకుంటకు చెందిన స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రేషన్ ఇవ్వలేమని దానికి సమానంగా డబ్బులు లేదా వస్తువులు ఇస్తామని రేషన్ డీలర్ చెబుతున్నాడని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. బియ్యం, సరుకుల కోసం అడిగితే దురుసుగా సమాధానం చెబుతున్నాడని వాపోయారు. వినతి పత్రం అందజేసిన వారిలో శామ్యూల్, శ్రీరాములు, ఇమ్మానియేల్ ఉన్నారు.

ఓబీసీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలి

● జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతి

గుంటూరు (తూర్పు), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 63 కేంద్ర ప్రభుత్వ శాఖలలోని ఓబీసీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ కోరారు. ఈ మేరకు సంఘ సభ్యులతో కలిసి ఢిల్లీలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్ రాజ్ అహిర్ గంగారాంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగిరేకుల వరప్రసాదు యాదవ్ మాట్లాడుతూ ఓబీసీ విద్య, ఉపాధి రిజర్వేషన్‌ల పరిరక్షణకు వెంటనే తగు చర్యలు చేపట్టాలన్నారు. ఏపీ బొందిలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుజాన్ సింగ్ మాట్లాడుతూ ఏపీ బీసీ జాబితా లోని బొందిలి, సొంటి తదితర 32 బీసీ కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని ఛైర్మన్‌ను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఓబీసీ సంక్షేమ సంఘం ఏపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణంరాజు, ఉరిటి అశోక్ కుమార్, ముంగమూరి హైమారావు, ఖాసీం, ఎం.లలిత తదితరులు ఉన్నారు.

చుట్టుగుంట డ్రెయిన్ పనులు పూర్తి అయ్యేదెప్పుడు?

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చుట్టుగుంట రైతుబజార్ వద్ద అవుట్‌ఫాల్ డ్రెయిన్ పనులు నెలల తరబడి కొనసాగుతోన్నాయి. దీంతో వర్షం కురిసిన ప్రతీసారి ఇక్కడ డ్రైనేజీ పొంగి పొర్లుతున్నది. రైతుబజార్‌లోకి మురుగునీరు ప్రవేశిస్తున్నది. దీంతో కూరగాయలు కొనుగోలు చేసేందుకు లోపలికి వెళ్లలేక వినియోగదారులు నానా తంటాలు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా మార్కెటింగ్ శాఖ కమిషనరేట్‌కు వెళ్లే గేటుని వినియోగిస్తున్నారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రైతుబజార్ వద్ద డ్రైనేజీ పొంగింది. దీంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా మారిపోయింది. రైతుబజార్‌లోకి వెళ్లేందుకు వినియోగదారులు సర్కస్ ఫీట్లు చేయాల్సి వచ్చింది. అలానే కూరగాయాలు తీసుకొచ్చే ఆటోలు బురదలో ఇరుక్కుపోయి మొరాయించాయి. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా అవుట్‌ఫాల్ డ్రెయిన్ పనులు పూర్తి చేసి ఇక్కడ డ్రైనేజీ సమస్యని పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



కూరగాయలు తీసుకొచ్చిన ఆటో ఇరుక్కుపోవడంతో లోపలికి నెడుతున్న స్థానికులు

కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్‌పై ఎస్పీ దృష్టి

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : శంకర్‌విలాస్ బ్రిడ్జి కూల్చివేస్తున్నందున నగరంలోని కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్‌పై ఎస్పీ దృష్టి సారించారు. దీనిలో భాగంగా సోమవారం ఆయన ద్విచక్ర వాహనంపై ఆయా ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎక్కడా ట్రాఫిక్ జామ్ జరగకుండా ట్రాఫిక్ పోలీసులు సమర్థంగా విధులు నిర్వహించాలని ఈస్ట్, వెస్ట్ ట్రాఫిక్ సీఐలు అశోక్‌కుమార్, సింగయ్యలకు ఆదేశాలిచ్చారు. వాహనదారులు రోడ్డుపై కాకుండా నిర్ణీత పార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలిపేలా చూసుకోవాలన్నారు.



నగరంలో ద్విచక్ర వాహనంపై పర్యటిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పెళ్లి చెడగొట్టిన యువకుడిపై కేసు నమోదు

పెళ్లి చెడగొట్టిన యువకుడిపై అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసారు. వెంగళరావునగర్‌కి చెందిన శిఖ రమేష్ తన పెద్ద కుమార్తెకు కొన్ని నెలల క్రితం గుంటూరు అడవితక్కెళ్ళపాడుకు చెందిన తాటిగిరి యశ్వంత్ కుమార్‌తో వివాహం నిశ్చయించి నిశ్చితార్థం కూడా చేశారు. ఆ తరువాత మనస్పర్థలు వచ్చి ఆ సంబంధం చెడిపోయింది. అప్పటి నుంచి రమేష్‌పై గొడవ పడుతూ నిశ్చితార్థం ఫొటోలు అందరికీ పంపిస్తామని యశ్వంత్ కుమార్ అతని కుటుంబ సభ్యులు బెదిరిస్తున్నారు. దీంతో రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల సాంస్కృతిక కార్యక్రమాలు

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుంటూరు జోనల్ స్థాయి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు ఉద్యోగుల కుటుంబ సభ్యుల సమక్షంలో రెవెన్యూ కళ్యాణమండపంలో కోలాహలంగా జరిగాయి. ఇందులో భాగంగా ఆడంబరాల వల్ల వచ్చే తంటాలను తెలియపరుస్తూ కోటిరెడ్డి దర్శకత్వంలో గరికపాటి శ్రీనివాసరావు రచించిన కలహాల కాపురం నాటకం ఆలోచింప చేసింది. చిన్నారుల నృత్య ప్రదర్శన, ఫ్యాన్సీ డ్రెస్ కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పెండ్యాల రమేష్, విజయ సంపత్, చెరుకూరి వీరాంజనేయులు తదితరులకు గుంటూరు పట్టణ రీజనల్ మేనేజర్ కిషోర్ కుమార్, చీఫ్ మేనేజర్ ఆనంద్ కిషోర్, పావులూరి రంగసాయి బహుమతులను అందజేశారు. నాటకరంగాన్ని ప్రోత్సహిస్తున్న స్టేట్ బ్యాంకు ఉద్యోగులను నాటక రంగ ప్రముఖులు జంపని కిషోర్ బాబు, వరికూటి శివప్రసాద్ అభినందించారు.

మా ఫ్లాట్‌లను వేరే వారికి అద్దెకిచ్చి బెదిరిస్తున్నాడు

● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన ప్రభుత్వ ఉద్యోగులు

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మా ఫ్లాట్లను అద్దెకి తీసుకొని మాకు చెల్లించకుండా మా ఫ్లాట్లను వేరే వాళ్లకు అద్దెకిచ్చి ఆ అద్దె డబ్బులు ఆయనే తీసుకుంటున్నాడని, అదేమని అడిగితే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని కటారి రాజ్‌కుమార్ బెదిరిస్తున్నాడని బాధితులు ఇరువురు ప్రభుత్వ ఉద్యోగులు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హిందూ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తాను 2017లో భారతపేట ఒకటో లైన్‌లో కృష్ణ చైతన్య ఎన్‌క్లేవ్‌లో కటారి రాజ్ కుమార్ వద్ద ఫ్లాట్ నెంబర్ 101, అదేవిధంగా 2018 జూలైలో కోడెల రేవతి అనే మహిళ వద్ద ఫ్లాట్ నెంబర్ 30 కొనుగోలు చేసినట్లు షేక్ కాలేషావలి తెలిపారు. ఆ తర్వాత ఆయా ఫ్లాట్లను అద్దెకు ఇచ్చామన్నారు. వారు ఖాళీ చేసి వెళ్లిపోయిన తరువాత అదే అపార్టుమెంట్లో నివాసం ఉంటున్న కటారి రాజకుమార్ ఒక్కో ఫ్లాట్‌కు 10 వేలు అద్దె ఇచ్చే విధంగా రెండు ఫ్లాట్లు అద్దెకు తీసుకున్నాడన్నారు. 2023 వరకు ప్రతినెలా అద్దె సక్రమంగానే చెల్లించాడన్నాడన్నారు. ఆ తర్వాత నుంచి అద్దె చెల్లించకపోవడంతో అద్దె డబ్బులు అడిగేందుకు ఇటీవల తాను రాజ్ కుమార్‌ను కలవడానికి అపార్టుమెంట్ వద్దకు వెళ్లగా అదే అపార్టుమెంట్లో ఉంటున్న ఓ వ్యక్తి మీ ఫ్లాట్లో వేరే వారు అద్దెకు ఉంటున్నారని చెప్పాడన్నారు. దీంతో మా ఫ్లాట్లో అద్దుకుంటున్న వారి వద్దకు వెళ్లి ఈ ఫ్లాట్ తమదని, అద్దె తమకు చెల్లించాలని అడగ్గా తమకు రాజకుమార్ అద్దెకి ఇచ్చాడని, ఆయనకు నెలకు రూ.11 వేలు అద్దె చెల్లిస్తున్నామని, ఆయనతో చెప్పిస్తే ఇస్తామని అన్నారన్నారు. దీంతో రాజ్‌కుమార్‌ను అడగ్గా ఫ్లాటు నా స్వాధీనంలో ఉంది కావున నేను అద్దె తీసుకున్నాను. మీ అద్దె నా దగ్గర డబ్బులు ఉన్నప్పుడు ఇస్తాను అలా కాకుండా మరోసారి ఇక్కడికి వచ్చి ఫ్లాట్ గురించి గానీ అద్దె డబ్బులు గురించి కానీ మాట్లాడితే మీ అంత తేలుస్తా మీపై ఎస్సీ ఎస్టీ కేసు పెడతా అంటూ బెదిరించాడన్నారు. రాజకుమార్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని తమ ఫ్లాట్లను తమకు ఇప్పించాలని బాధితుడు కాలేషావలి ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో వేడుకున్నారు.

ఫ్లాట్‌లో వర్క్ చేయిస్తామని లోనికి రానివ్వడం లేదు

మా ఫ్లాట్లో ఇంటీరియర్ వర్క్ చేయిస్తానని రూ.13 లక్షలకు కాంట్రాక్టు కుదుర్చుకొని రూ.9 లక్షలు తీసుకొని సరిగా పని చేయించకపోగా చూడ్డానికి వెళుతుంటే లోనికి రానివ్వకుండా, మిగిలిన నాలుగు లక్షల ఇస్తేనే లోనికి రానిస్తానంటూ బెదిరిస్తున్నాడని అమరావతిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్టాఫ్ నర్స్‌గా పని చేస్తున్న అన్నవరపు అమలకుమారి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

ఇల్లు విక్రయించి ఖాళీ చేయకుండా బెదిరిస్తున్నారు

తనకు ఇల్లు విక్రయించి ఖాళీ చేయకుండా అందులోనే ఉంటూ తనను రౌడీషీటర్లు అయిన అన్నదమ్ములు బెదిరిస్తూ, భయాందోళనకు గురి చేస్తున్నారని పాతగుంటూరు పరిధిలోని మంగళదాస్‌నగర్ ఒకటో లైన్‌కి చెందిన ఎం.వీరాంజనేయులు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. తాను ఎనిమిదేళ్ల క్రితం కాళహస్తి చిన్న వద్ద 60 చ.గ. వైజాగ్‌లో ఉన్న ఇంటిని కొనుగోలు చేశానన్నారు. అయితే చిన్న కుమారులు సాయి, బాజీ ఓ హత్య కేసులో నిందితులుగా ఉన్నారన్నారు. అయితే ఇల్లు ఖాళీ చేయకుండా తనను బెదిరిస్తూ ఉండడంతో 2022లో ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశానని ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు అలాగే నెల క్రితం మరోసారి ఫిర్యాదు చేస్తే అక్కడ ఎస్ఐ వెంకటేశ్వరరావు రౌడీషీటర్లకు అనుకూలంగా మాట్లాడుతూ దివ్యాంగుడినైన తనకు అన్యాయం చేస్తున్నారన్నారు. అంతేకాక రౌడీషీటర్లు తనను బెదిరిస్తున్నారన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి రూ.13 లక్షలు తీసుకొని మోసం చేశాడని కాకుమానుకు చెందిన ఎస్.చైతన్య అనే యువకుడు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. తనకు పరిచయమైన గుంటూరులోని దరియానగర్ ప్రాంతానికి చెందిన షేక్ రసూల్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇస్తానని ఆశ కల్పించడంతో తాను తన స్నేహితులకు ఉద్యోగాల కోసం వారి నుంచి డబ్బు తీసుకొని రూ.13 లక్షలు ఇచ్చానన్నారు. మూడు నెలలుగా ఉద్యోగం చేస్తున్న తనకు జీతం ఇవ్వలేదన్నారు. తన ద్వారా డబ్బులు ఇచ్చిన తన స్నేహితులు కూడా డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరుతున్నారన్నారు. డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తున్నాడని అన్నారు.

పాతగుంటూరులో రెండు ఇళ్లలో చోరీ

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పాతగుంటూరులోని సత్యనారాయణస్వామి ఆలయం దగ్గర రెండు ఇళ్లలో చోరీలు జరిగాయి. ఆ ప్రాంతానికి చెందిన పర్వతం దివ్య, శ్రీరామచంద్రం రెండు కుటుంబాల వారు ఈనెల 7న తిరుపతి వెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగుల గొట్టి బీరువాలో ఉన్న బంగారం, వెండి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. దివ్య ఇంట్లో 82 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి, శ్రీరామచంద్రం ఇంట్లో 80 గ్రాముల బంగారు, 300 గ్రాముల వెండి చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వర్షం కారణంగా తిరంగా ర్యాలీ రద్దు

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో వర్షం కారణంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ రద్దు అయింది. సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు కలెక్టరేట్ నుంచి విజ్ఞాన మందిరం వరకు ర్యాలీ నిర్వహించాలని తొలుత భావించారు. ఈ మేరకు అన్ని ప్రభుత్వ శాఖలకు కలెక్టరేట్ నుంచి సమాచారం ఇచ్చారు. దాంతో ఉద్యోగస్థులంతా ర్యాలీలో పాల్గొనేందుకు సన్నద్ధం కాగా మధ్యాహ్నం కురిసిన వర్షానికి పలుచోట్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో ర్యాలీని రద్దు చేస్తున్నట్లు డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి ప్రకటించారు.

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం

● మేయర్ రవీంద్ర



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నగర మేయర్ రవీంద్ర, పక్కన ఎమ్మెల్యే మాధవి తదితరులు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో గుంటూరు నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని పశ్చిమ నియోజకవర్గ పరిధిలో రూ.54 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలోని 34వ డివిజన్ కోబాల్డ్‌పేట 3వ లైన్‌లో సీసీ డ్రెయిన్లు నిర్మించేందుకు ఎమ్మెల్యే గళ్లా మాధవితో కలిసి శంకుస్థాపన చేశారు. మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తున్నారని, గత 5 సంవత్సరాలు రాష్ట్రంలో జరిగిన విధ్వంసాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. నగరంలోని అన్ని వార్డులలో అభివృద్ధి పనులు కుల, మత, పార్టీలకతీతంగా ప్రాధాన్యతా క్రమంలో నిర్వహించేందుకు కార్యా చరణ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నామని, శివారు ప్రాంతాలలో డ్రెయిన్లు, రోడ్లు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా పశ్చిమ నియోజక వర్గంలో తాగునీరు, పారిశుధ్య సమస్యలు లేకుండా నగర పాలక సంస్థ అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు అన్వర్, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, బూసి రాజలత, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టాలి

● మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు



మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాదు, పాల్గొన్న కూటమి నాయకులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీని పులివెందుల నుంచి తరిమివేయాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు పిలుపునిచ్చారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన నివాసంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ రాక్షస కబంధహస్తాల నుంచి పులివెందుల ప్రజలను కాపాడాలన్నారు. ప్రజాస్వామ్యంలో అరుదైన అవకాశాన్ని ఎన్నికల రూపంలో కడప జిల్లాలో ఓటర్లకు ఇచ్చారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చిత్తూరు జిల్లాలో దళిత యువకుడిని చితక కొట్టి తిరిగి దళితవాడలలోకి ఓట్లు అడగడానికి వెళ్లడం మీకు సిగ్గుగా లేదా అని వైసీపీ నాయకులను ప్రశ్నించారు. కడప ప్రజలు విజ్ఞతతో ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. మద్యం కేసులో బిగ్ బాస్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ లేవనెత్తిన ఓటర్ల జాబితా అంశంపై ఎన్నికల కమిషన్ స్పందించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అత్తోట జోసఫ్ కుమార్, పాలకాయల వెంకట్, కానుమూలు సురేష్ పాల్గొన్నారు.


ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న సీఎం

● డాక్టర్ జాస్తి వీరాంజనేయులు

గుంటూరు సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. ఆయన గుంటూరులో సోమవారం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి తీవ్ర నష్టం అయినా వెనకడుగు వేయకుండా అమలుపరచటం గొప్ప శుభపరిణామం అని అన్నారు. ఐదు రకాల బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని జీవో ఇచ్చారని తెలిపారు. ఈ హామీ నెరవేర్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంటేనే ప్రతిపక్ష పార్టీలకు నిద్ర పట్టటం లేదని అన్నారు. ఎన్నికల హామీని నెరవేర్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాంతీయ గ్రంథాలయంలో చదువుకొని... ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన తొమ్మిది మంది పాఠకులు

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో చదువుకొని తొమ్మిది మంది పాఠకులు ఇటీవలే ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. ఈ తొమ్మిది మందిలో కొందరు పోలీసు కానిస్టేబుల్స్ అయ్యారు. మరికొందరు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు టెక్నికల్ ఉద్యోగాలను సాధించారు. ఈ సందర్భంగా సోమవారం వారికి గ్రంథాలయంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా గ్రంథాలయ అధికారి వెన్నెటి సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. తొలుత కొత్తగా ఉద్యోగాలు పొందిన పాఠకులు తమకు ఉద్యోగ సాధనలో గ్రంథాలయం, ఆ సంస్థలోని అధికారులు, సిబ్బంది ఏ విధంగా తోడ్పాటు అందించింది వంటి వివరాలను పంచుకొన్నారు. గ్రంథాలయ అధికారి మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం ఎంతోమంది పాఠకులకు మంచి భవిష్యత్తుని కల్పించిందన్నారు.



ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన పాఠకులను సత్కరిస్తున్న ప్రాంతీయ గ్రంథాలయ అధికారులు

గోరంట్లలో టీడీపీ కుటుంబంపై వైసీపీ వర్గీయుల దాడి

● రెండు ద్విచక్ర వాహనాలు, ఇల్లు ధ్వంసం

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోరంట్లలో వైసీపీ వర్గీయులు రెచ్చిపోయారు. ఆదివారం రాత్రి టీడీపీకి చెందిన ఓ కుటుంబం పైనా, వారి బంధువుల పైనా విచక్షణారహితంగా దాడి చేసి ద్విచక్ర వాహనాలు, ఇంటి అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గోరంట్ల లక్ష్మీ నగర్ ఒకటో లైన్‌లో వైసీపీకి చెందిన సంపతి రామకోటయ్యకు చెందిన గేదెలను రోడ్డుపై కట్టేశారు. అటుగా వస్తున్న తాడిపోయిన ఆదినారాయణ గేదెలను ఫొటో తీశాడు. గేదెలను ఎందుకు ఫొటో తీస్తున్నావ్ అంటూ రామకోటయ్య ప్రశ్నించాడు. వివాదం ముదిరి ఘర్షణకు దారి తీయడంతో వైసీపీ నాయకుడు డొక్కు కాటమరాజు, ఆయన భార్య వెంకటలక్ష్మి, ఆయన మామ సంపతి రామకోటయ్య, ఆయన కుమారుడు గోపి, ఆయన భార్యతో పాటు మరికొందరు కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసి లావణ్య, ఆమె భర్త ఆదినారాయణతో పాటు బంధువులు నాగేశ్వరరావు, ఉపేంద్రలను తీవ్రంగా కొట్టారు. అంతటితో ఆగకుండా ఇంటి ముందున్న రెండు ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. ఆ తర్వాత వారు నివాసం ఉంటున్న భావన రెసిడెన్సీలోని వారి ఫ్లాట్ 401 వద్దకు వెళ్లి కిటికీ అద్దాలు, డోర్లు ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న నల్లపాడు సీఐ కే వంశీధర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసుల రాకతో నిందితులు పరారయ్యారు ఈ క్రమంలో కొందరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.


అమర వీరుల స్థూపాలకు రంగులు వేస్తున్న కార్మికులు


గాంధీజీ ప్రసంగించిన కూడలి గాంధీచౌక్

నేడు అమరవీరుల సంస్మరణ

నాటి స్వాతంత్ర్య ఉద్యమంలో తెనాలి ప్రముఖ పాత్ర వహించింది. నాటి అడుగు జాడలు నేటికీ స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటుతున్నాయి. 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో ఏడుగురు తెనాలి పౌరులు ప్రాణత్యాగం చేశారు. బ్రిటీష్ కాల్పుల్లో మరణించిన మాజేటి సుబ్బారావు, శిరిగిరి లింగం, భాస్కరుని లక్ష్మీనారాయణ, తమ్మినేని సుబ్బారెడ్డి, గాలి రామకోటయ్య, ప్రయాగ రాఘవయ్య, జాస్తి అప్పయ్య స్మారక స్థూపాలను రణరంగ చౌక్‌లో ఏర్పాటు చేసి ప్రతిఏటా ఆగస్టు 12న అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. నేటి కార్యక్రమాలకు విస్తృత ఏర్పాట్లు చేశారు.

▶▶ క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రాణాలర్పించిన ఏడుగురు
▶▶ స్వాతంత్ర్య ఉద్యమంలో తెనాలి అడుగు జాడలు

తెనాలి అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ స్వాతంత్ర్య పోరాటంలో మూడు మార్లు తెనాలి వచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమంలో ఏడుగురు ప్రాణాలు అర్పించారు. పలు రహదారులు, పార్కులకు జాతి నేతల పేర్లు ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేస్తుంటాయి. నాజరుపేటలో 1921లో ఏర్పాటు చేసిన తిలక్ జాతీయ విద్యాలయంలో గాంధీ పిలుపు మేరకు ఆంగ్ల భాషను త్యజించి హిందీ భాషను జాతీయ భాషగా గుర్తించి ప్రచారం చేసే కార్యక్రమం చేపట్టారు. ఆయన పిలుపునిచ్చిన హిందీ ఉద్యమాన్ని ప్రచారం చేస్తున్న మహాత్ముడు తొలిసారిగా ఇక్కడకు వచ్చారు. జాతీయ జెండాను కూడా ఆవిష్కరించారు. ఆ జెండా ఎగురవేసిన ఓ టేకు స్థంభం ఈ మధ్య వరకు గుర్తుగా నిలబడి ఉంది. స్వాతంత్ర్య ఉద్యమం కోసం వచ్చే వారు ఇక్కడ సమావేశమై పోరాట ప్రణాళికలు రూపొందించుకునేవారు. ఆ ప్రాంగణం గాంధీ శిబిరంగా పిలుచుకునేవారు. 1930లో శిబిరాన్ని పోలీసులు నేలమట్టం చేశారు. 1938లో హిందీ ప్రేమీ మండలి నిర్మించి ఇప్పటి వరకు హిందీ ప్రచారం చేస్తూ ఉన్నారు.స్వరాజ్య నిధికి ఆయన జోలి పట్టడంతో రూ.2312 విరాళాలు వచ్చాయి.

నాటి మున్సిపల్ చైర్మన్ త్రిపురనేని రామస్వామి చౌదరి ఆధ్వర్యంలో మహాత్మునికి పౌర సన్మానం చేశారు. 1933 డిసెంబరులో మరోమారు గాంధీజీ తెనాలి వచ్చారు. రైల్వే స్టేషన్ పడమర వైపు చెంచుపేటలో ప్రసంగించి కొల్లా తయారమ్మ పాఠశాలను ప్రారంభించారు. అక్కడ ఇప్పుడు శబరి వృద్ధాశ్రమం నడుస్తోంది. కోదండ రామాలయంలో దళితులకు ప్రవేశం కల్పించారు. ఐతానగర్‌లోని ఆలపాటి బాపయ్య గృహంలో బస చేసిన ఆయనకు స్వరాజ్యనిధికి విరాళాలు అందించారు. 1946 జనవరిలో దక్షిణ భారత హిందీ మహాసభలకు మద్రాసు వెళుతూ తెనాలిలో ప్లాట్‌ఫారంపై స్నానం చేశారని చెబుతారు. వేలాది మంది ప్రజలు ఆయనను చూసేందుకు స్టేషన్‌కు చేరుకోగా సోమవారం మౌనవ్రతం కావడంతో అందరికి అభివాదం చేసి మద్రాసు వెళ్లిపోయారు. పట్టణంలోని ఒక పార్కుకు గాంధీ ఇర్విన్ ఒడంబడిక గుర్తుగా ఆ పేరు పెట్టారు. కఠెవరంలో బాంబు పేలుడు సంఘటన బ్రిటీష్ ప్రధానమంత్రి వరకు వెళ్లి తెనాలి ఎక్కడా అని ఆరా తీయడం విశేషం.


నాజరుపేట హిందీ ప్రేమీ మండలి ప్రాంగణం

పట్టణంలోని రహదారులకు టంగుటూరి ప్రకాశం, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, వీవీ గిరి, సరోజిని నాయుడు, కృష్ణారావు వంటి జాతినేతల పేర్లతో పిలుస్తూ స్వరాజ్య స్ఫూర్తిని చాటుతున్నారు. తెనాలి పట్టణంలో గాంధీచౌక్ అంటే తెలియనివారు ఉండరు. స్వాతంత్ర్య ఉద్యమంలో నాలుగు రోడ్ల కూడలి అయిన ఇక్కడ ప్రజలను ఉద్దేశించి గాంధీ ప్రసంగించడంతో ఆ కూడలికి ఈ పేరు వచ్చింది. కూడలిలో నలుగురు జాతి నేతల విగ్రహాలు ఏర్పాటు చేశారు.

మన మిత్రలో మరిన్ని సేవలు



15 నుంచి ఏడు వందల సేవలు అందుబాటులోకి


ప్రభుత్వ సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా వాటిని ఇంటి నుంచే పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకు వచ్చింది. మన మిత్ర పేరిట అమలవుతున్న కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా సేవలు పొందేందుకు, ఫిర్యాదులు చేసేందుకు సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

సత్తెనపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు అందిస్తున్న ప్రభుత్వం వాటిని ఏడు వందలకు పెంచాలని నిర్ణయించింది. ఈ నెల 15వ తేదీ నుంచి మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈ సేవలను అందించేలా చర్యలు చేపట్టారు. ఈ ఏడాది జనవరిలో 26 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 121 సేవలతో మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభం కాగా సేవలను క్రమంగా పెంచారు. ప్రస్తుతం ఐదు వందలు సేవల వరకు అందుతున్నాయి. వీటిని 15వ తేదీ నుంచి ఏడు వందల వరకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాలనలో టెక్నాలజీ వినియోగానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో పౌర సేవలు సెల్ ఫోన్ ద్వారా అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఇందులో విద్యార్థులకు పరీక్షలకు హాల్ టిక్కెట్లు, రేషన్ కార్డుల సేవలు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్టేటస్‌లు తెలుసుకొనే వెసులు బాటు కల్పించారు. తెలుగు, ఆంగ్ల బాషల్లో సేవలు అందుబాటులో ఉన్నాయి. పౌరులు ఒక క్లిక్‌తో లైసెన్స్‌లు, పన్నులు, బిల్లులు చెల్లించవచ్చు. ఆలయాల దర్శనాల బుకింగ్, పరీక్షా ఫలితాలు ఇంటి వద్ద నుంచే తెలుసుకొనే అవకాశం కల్పించారు. అన్ని శాఖల డేటాను ఆర్‌టీజీఎస్‌తో ప్రభుత్వం అనుసంధానం చేసింది. ప్రతి ఒక్కరి వ్యక్తి గత సమాచారం ప్రభుత్వం వద్ద ఉంది. దీనిని శాఖల వారీగా మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌కు అనుసంధానం చేశారు. క్యూఆర్ కోడ్‌తో ధ్రువ పత్రాలు, ఇతర పౌర సేవలు పొంద వచ్చు. భవిష్యత్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయటంతో నకిలీ, అసలు గుర్తించే సౌలభ్యం అందుబాటులోకి రానుంది.

ప్రభుత్వ వాట్సాప్ నెంబరు 9552300009ను మన మిత్ర పేరిట మీ ఫోన్‌లో నమోదు చేసుకోవాలి. ఆ నెంబరుకు హాయ్ అని సందేశం పంపాలి. వెంటనే ఏపీ ప్రభుత్వ లోగోతో ఒక సందేశం వస్తుంది. తద్వారా మీకు కావాల్సిన సేవను ఎంపిక చేసుకోవాలి. వెంటనే వాట్సాప్‌లో ఏఐ ఆధారిత చాట్ బాక్సులో లభ్యమయ్యే అన్ని ప్రభుత్వ సేవల జాబితా కన్పిస్తుంది. ఇందులో మీకు కావాల్సిన సేవను ఎంపిక చేసుకోవచ్చు. వాయిస్ కమాండ్ కూడా ఉపయోగించు కోవచ్చు. మీరు కోరుకున్న సేవకు సంబంధించి చాట్ బాక్స్ మరికొన్ని అదనపు వివరాలు అడగ వచ్చు. ఆధార్ నెంబరు, మొబైల్ నెంబరు లాంటివి మీరు ఇచ్చిన వివరాలను తనిఖీ చేసి తరువాత అందులో సిస్టమ్ మీకు రియల్ టైమ్ అప్‌డేట్ ద్వారా కన్ఫర్మేషన్ సందేశం పంపుతుంది. చెల్లింపులు కోసం భద్రతతో కూడిన ఒక పేమెంట్ లింకును కూడా పంపుతుంది. మీరు జరిపిన లావాదేవీలకు సంబంధించి డిజిటల్ కాపీ లేదా రసీదును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. చాట్ బాక్సులో ధ్రువీకరణ పత్రాలు, రసీదులు లేదా ఎకనాలెజ్‌మెంట్ రూపొందించి మీకు అందిస్తుంది.

రేపల్లె - మార్కాపురం - తెనాలి రైలు పాక్షిక పునరుద్ధరణ

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల - తెనాలి - చుండూరు మధ్యన ప్రీఎన్ఐ, ఎన్ఐ, పోస్టు ఎన్ఐ పనుల కారణంగా రద్దు చేసిన రేపల్లె - మార్కాపురం - తెనాలి ప్యాసింజర్ రైళ్లను రైల్వే శాఖ ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు పాక్షికంగా పునరుద్ధరించింది. 67238 రేపల్లె - మార్కాపురం రోడ్డు ప్యాసింజర్ రేపల్లె - గుంటూరు మధ్యన రద్దు చేసి.. గుంటూరు - మార్కాపురం రోడ్డు మధ్యన సర్వీసుని పునరుద్ధరించారు. 67239 మార్కాపురం - తెనాలి ప్యాసిజంర్‌ని గుంటూరు వరకే నడిపి గుంటూరు - తెనాలి మధ్యన రద్దు చేశారు. 67248 గుంటూరు - విజయవాడ ప్యాసింజర్‌ని 120 నిమిషాల పాటు రీషెడ్యూల్ చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు విజయనగరం వరకే ప్రయాణిస్తుంది. 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు విజయనగరం నుంచి బయలుదేరి గుంటూరుకు వస్తుందని రైల్వే అధికారులు తెలిపారు.


ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న సీఆర్డీఏ కార్యాలయం

తుది దశకు సీఆర్డీఏ కార్యాలయ నిర్మాణం

పరిశీలించిన మంత్రి నారాయణ

తుళ్లూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాయపూడిలో తుది మెరుగులు దిద్దుకుంటున్న సీఆర్డీఏ కార్యాలయాన్ని మంత్రి నారాయణ సోమవారం పరిశీలించారు. ఆధునిక హంగులతో 2,42,481 చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్ 7 అంతస్తుల భవన నిర్మాణం దాదాపుగా పూర్తి అయ్యింది. ప్రతి అంతస్తులో అధికారుల కేబిన్‌లు, ఉద్యోగుల వర్క్ స్టేషన్లు మంత్రి పరిశీలించారు. సీఆర్డీఏ, ఏడీసీతో పాటు మున్సిపల్ శాఖకు చెందిన పలు విభాగాలను ప్రభుత్వం ఈ భవనంలోకి తరలించనుంది. వీలైనంత త్వరగా ప్రారంభోత్సవం చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలకు తూర్పుభాగంలో సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయం కొలువు తీరనుంది. ప్రస్తుతం విజయవాడ లెనిన్ సెంటర్‌లో సీఆర్డీఏ కార్యాలయం కొనసాగుతోంది.


సీఆర్డీఏ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

ముగిసిన రాష్ట్రస్థాయి ర్యాకింగ్ చెస్ పోటీలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక లాంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి ర్యాకింగ్ చదరంగం పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో పలు జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా చదరంగం అధ్యక్షుడు రవీంద్రరాజు, సీనియర్ కోచ్ మురళీ కృష్ణ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీలను టోర్నమెంట్‌డైరక్టర్ వైవీకే చక్రవర్తి పర్యవేక్షించారు.

విజేతలు..

అండర్-6: వైశాలి (కృష్ణా), ఆధ్యశ్రీ(ఎన్టీఆర్), జాషువా(పల్నాడు), వియాన్ కృష్ణ(తిరుపతి)

అండర్-8: కావ్య, తన్విక, అయాన్ (గుంటూరు), గిరిజానందన్(ఎన్టీఆర్).

అండర్-10: హిప్షిత (కృష్ణా), మయూక, పునీత్(గుంటూరు), రోషన్ (ఎన్టీఆర్)

అండర్-12: సుక్రుత, రిషిక్, సాయి (అనంతపురం), గీతిక(ఎన్టీఆర్)

అండర్-14: అనూష, హర్షవర్ధన్(గుంటూరు), హంసిక (ఎన్టీఆర్), నితీష్(అనంతపురం).

అండర్-16: దివ్య(గుంటూరు), వేదప్రియ (ఎన్టీఆర్), బార్గవ శ్రీనివాస్(పల్నాడు), చరణ్ (ఎన్టీఆర్)



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న రవీంద్రరాజు

రాజధాని నిర్మాణానికి రూ. 2,00,116 విరాళం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని నిర్మాణానికి విరాళంగా పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన వృద్ధురాలు కాసా నాగేంద్రమ్మ రూ. 2,00,116లు అందజేశారు. సచివాలయంలో సోమవారం సీఎం చంద్రబాబునాయుడును కలిసి నాగేంద్రమ్మ చెక్కును అందజేశారు. నాగేంద్రమ్మకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆమె వెంట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కూటమి నేతలు వున్నారు.


సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న కాసా నాగేంద్రమ్మ, పక్కన ఎమ్మెల్యే చదలవాడ తదితరులు

బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అండ

● గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి

రేపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి కృషి చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. సోమవారం బాపట్ల జిల్లా రేపల్లె టీడీపీ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్, సత్యప్రసాద్ చిత్రపటాలకు కల్లు, గీత కార్మికులు, చేనేత కార్మికులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే గీతకార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించారు. 2025-26 బడ్జెట్‌లో బీసీల అభ్యున్నతి కోసం రూ.47 వేల కోట్లు కేటాయించటం అభినందనీయమన్నారు. రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కృషిచేస్తున్నారన్నారు. తీరప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తూ ప్రజల మన్ననలు పొందారన్నారు. బీసీలు కూటమిపార్టీలకు ఎప్పుడు అండగా ఉండాలన్నారు. చేనేత కుటుంబాలను ఆదుకుంటామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం చేనేత మగ్గాలకు ఉచిత విద్యుత్ అందించటంతో పాటు నేతన్న భరోసా ద్వారా రూ.25 వేలు ఆర్థిక సాయం, నేతన్నల తయారు చేసే ఉత్పత్తులపై జీఎస్టీని తొలగించారన్నారు. మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ కూటమిప్రభుత్వం బీసీల అభ్యున్నతి కోసం కోట్లాదిరూపాయలు వెచ్చించి ముందుకు వెళ్ళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపశ్చిమ డెల్టాప్రాజెక్టుకమిటి చైర్మన్ పంతాని మురళీధరరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ యేమినేని లక్ష్మీశైలజ, జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు పాల్గొన్నారు.


చంద్రబాబు, పవన్, సత్యప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న గీత, చేనేత కార్మికులు

● వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు

● వైద్య కళాశాలలకు ప్రభుత్వ ఆదేశాలు జారీ

ర్యాగింగ్ వద్దు

● నేటి నుంచి... యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్



గుంటూరు వైద్య కళాశాల

జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) తాజాగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఈ నెల 12వ తేదీ నుంచి 18 వరకు వారం రోజుల పాటు యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్ ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ నిషేధమని, ఇది చట్టరీత్యా నేరమని అధికారులు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సీనియర్ వైద్య విద్యార్థులు ర్యాగింగ్ జోలికి పోకుండా వారిలో అవగాహన పెంచేందుకు ఈ వారం పాటు యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్‌లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు.

గుంటూరు మెడికల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా ప్రవేశాలు పొందే జూనియర్ విద్యార్థులతో సీనియర్లు సత్ప్రవర్తనతో మెలిగి వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్ చేపట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇటీవల రాష్ట్రంలో ఒకటి, రెండు వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ జరిగినట్లు వార్తలు వెలువడటంతో, స్పందించిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ర్యాగింగ్ నిరోధానికి గట్టి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఆరోగ్య మంత్రి సూచనల మేరకు, మంగళవారం నుంచి వారం పాటు యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్ నిర్వహించాలని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెండు ప్రభుత్వ, రెండు ప్రైవేటు వైద్య కళాశాలలు అందుబాట్లో ఉన్నాయి. కొత్తగా మెడిసిన్‌లో చేరే జూనియర్‌ల పట్ల అసభ్యకరంగా, అనైతికంగా వ్యవహరిస్తే అది ర్యాగింగ్ కిందకు వస్తుందని అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సహచరులతో అమానుషంగా వ్యవహరించినా దానిని ర్యాగింగ్‌గానే పరిగణిస్తామని, వారిపై కఠిన చర్యలు తీసుకొనేందుకు వెనుకాడబోమని వైద్యాధికారులు స్పష్టం చేశారు.

విద్యార్థులకు పలు పోటీలు...

యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్‌లో భాగంగా వైద్య విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తారు. యాంటీ ర్యాగింగ్ ఇతివృత్తంతో..నినాదాలు, వ్యాస రచన పోటీలు, ఫోటోగ్రఫీ పోటీలు, వాల్‌పోస్టర్ల తయారీ, వీధి నాటకాలను ఆయా కళాశాలల్లో నిర్వహించాలని హెల్త్ వర్శిటీ కోరింది. ర్యాగింగ్ వ్యతిరేక సందేశాలను ప్రోత్సహించే సంస్థల నుంచి వీడియో సందేశాలను కూడా వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. సదస్సులు, ఇంటరాక్టివ్ సెషన్స్, సెల్ఫీ కార్నర్ వంటి సృజనాత్మక అవగాహన కార్యక్రమాలు జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, ప్రశంసా సర్టిఫికెట్లను ప్రదానం చేస్తారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు పూర్తిస్థాయిలో భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలని స్వయంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు.

ఆవిష్కరణ

రోజుకొక నిమ్మపండు

రోజుకొక యాపిల్ తినడం ఆరోగ్యకరం అని అనుకుంటూ ఉంటాం. అలాగే పలు పోషకాలతో కూడిన అరటి పండు కూడా బలవర్థకమే, కాబట్టి రోజుకొక అరటి పండు తినడం మంచిదని కూడా నమ్ముతూ ఉంటాం. కానీ ఈ రెండింటి కంటే నిమ్మ పండు అన్ని విధాలా శ్రేయస్కర మని వైద్యులంటున్నారు. ఇలా ఎందుకంటున్నారో తెలుసుకుందాం!

న్యూజెర్సీకి చెందిన విలియం ప్యాటర్సన్ యూనివర్శిటీ, ప్రతి ఏటా పోషక విలువల ఆధారంగా పండ్లకు ర్యాంకులను కేటాయిస్తూ ఉంటుంది. అలా ఈ ఏడాది పోషక సాంద్రత, యాంటీఆక్సిడెంట్ల పరిమాణం, ఆరోగ్య ప్రయోజనాల ఆధారంగా, 41 రకాల పండ్లను విశ్లేషించి అన్నిటికంటే నిమ్మపండు ఆరోగ్యకరమని తేల్చింది. ఈ పండులో విటమిన్ సితో పాటు, పీచు, యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు పుష్కలంగా ఉంటాయనీ, జేబులో ఇమిడిపోయే వీలున్న నిమ్మపండు జీర్ణశక్తినీ, రోగనిరోధకశక్తినీ



పెంచుతుందనీ, గుండె ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుందనీ పరిశోధకులు పేర్కొంటున్నారు. నిమ్మ పండ్లు పుల్లగా ఉంటాయనే విషయం మనందరికీ తెలుసు. ఇవి ఆమ్ల గుణాన్ని కూడా కలిగి ఉంటాయి కాబట్టి నిమ్మరసాన్ని శరీరం శోషించుకున్నప్పుడు శరీరం మీద క్షార ప్రభావం పడుతుంది. ఫలితంగా శరీరంలోని పిహెచ్ సమతుల్యమై, పేగుల ఆరోగ్యం మెరుగవుతుంది. నిజానికి నిమ్మపండు కలిగి ఉండే ఆమ్లత్వం కూడా మేలు చేస్తుందనీ, వీటి పుల్లదనం వల్ల రోగ నిరోధకశక్తి కుదుపుకు గురై అప్రమత్తమవతుఉందని కూడా పరిశోధకులు అంటున్నారు. నిమ్మపండుతో పాటు నిమ్మతొక్కలు కూడా ప్రత్యేకతలు కలిగి ఉంటాయి. వీటిలోని లైమోనిన్ నూనెలు యాంటీ మైక్రోబియల్, యాంటీ క్యాన్సర్ గుణాలను కలిగి ఉంటాయి. కాబట్టి నిమ్మతొలును తురిమి వంటల్లో వాడుకుంటూ ఉండాలి.

అధ్యయనం

డైట్ సోడాలతో చేటు

క్యాలరీలు లేని డైట్ సోడాలు ఆరోగ్యానికి చేటు కలిగించవని అనుకోవడం పొరపాటు. వాటితో గుండెకూ, మెదడుకూ చేటు కలుగుతుందని అధ్యయనాలు నిరూపిస్తున్నాయి. రోజుకు ఒకటి లేదా రెండు డైట్ సోడాలు తాగే వారికి దాదాపు మూడు రెట్లు గుండెపోటు, అల్జీమర్స్ ముప్పు పొంచి ఉంటుందనే ఒక తాజా అధ్యయనం అమెరికన్ హార్ట్



అసోసియేషన్ జోర్నల్‌లో ప్రచురితమైంది. ఈ అధ్యయనంలో భాగంగా 2,800 మంది, 45 నుంచి 55 ఏళ్ల వయస్కులను పరీక్షించినప్పుడు, వారికి గుండెపోటు, అల్జీమర్స్ ముప్పు 30% కంటే ఎక్కువ ఉన్నట్టు గుర్తించడం జరిగింది. అలాగే డైట్ సోడాలోని ఫాస్ఫరస్ ఎముకల సాంద్రతను సన్నగిల్లేలా చేసి ఎముకలను గుల్లబారుస్తుంది. అలాగే దాన్లోని కృత్రిమ చక్కెరలైన ఆస్పర్టేమ్ లేదా స్టీవియాలు నాడీ క్షీణతను పెంచుతాయి. డైట్ సోడాను విపరీతంగా తాడే వారిలో, మూత్రపిండాల సామర్థ్యం కూడా త్వరితంగా క్షీణిస్తుందని నర్సెస్ హెల్త్ స్టడీకి చెందిన పరిశోధకులు కనిపెట్టారు. దాహార్తిని తీర్చుకోవడం కోసం డైట్ సోడాల మీద ఆధారపడడం వల్ల ఈ పానీయంలోని కెఫీన్ ఫలితంగా దాహార్తి తీరకపోగా, అత్యధిక మూత్రవిసర్జనతో శరీరంలో డీహైడ్రేషన్ పెరుగుతుందని కూడా వారు హెచ్చరిస్తున్నారు. దీన్లోని కెఫీన్‌తో నిద్రలేమి సమస్య కూడా వేధిస్తుందనీ, అదే పనిగా డైట్ సోడాలు తాగడం వల్ల కాలేయం దెబ్బతింటుందని కూడా పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

వానాకాలం వెతలు



వానాకాలం విజృంభించే జ్వరాల గురించి మనందరికీ తెలిసిందే! అయితే మారుతున్న కాలంతో పాటు శరీరంలో చోటుచేసుకునే మార్పులకు తగ్గట్టు ఆహార, జీవనశైలులను మార్చుకోగలిగితే వానాకాలం జ్వరాల నుంచి రక్షణ పొందవచ్చని ఆయుర్వేదం చెప్తోంది.



జలుబు, జ్వరాలకు చెల్లుచీటీ



శరీరంలోని వాత, పిత్త, కఫాల్లోని హెచ్చుతగ్గులతో జ్వరాలు సోకుతూ ఉంటాయి. వాత జ్వరం, పిత్త జ్వరం, కఫ జ్వరంతో పాటు రెండు, మూడు దోషాలు కలిసిన సన్నిపాతిక జ్వరాలు కూడా వానాకాలంలో సోకుతూ ఉంటాయి. అలాగే ఇన్‌ఫెక్షన్లు, దోమ కాట్ల వల్ల సోకే విషమ జ్వరాలు కూడా ఈ కాలంలో వేధిస్తూ ఉంటాయి. సంతత, సతత, అన్యేదుష్య, త్రితీయక, చాతుర్థక అనే ఐదు రకాల విషమ జ్వరాలే... మలేరియా, డెంగు, వైరల్ జ్వరాలు. మనమిప్పుడు ఆధునిక వైద్యంలో ఆచరిస్తున్నట్టు, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, దోమలు దరి చేరకుండా జాగ్రత్త పడడం లాంటి ముందస్తు జాగ్రత్తలతో ఈ జ్వరాలను అడ్డుకోవచ్చు. అలాగే ఈ కాలంలో ఆహార కలుషితం వల్ల ఇన్‌ఫెక్షన్లు కూడా పెరుగుతాయి. కాబట్టి మారే రుతువులకు అనుగుణంగా మన దినచర్య, రుతు చర్య, జీవనశైలులను మలుచుకోవాలి.

జలుబు, జ్వరాలకు అడ్డుకట్ట

ఆయుర్వేదంలో జ్వరాలకు పలు రకాల చికిత్సలున్నప్పటికీ ఇంట్లో స్వయంగా చేసుకోగలిగే కొన్ని స్వల్ప చికిత్సలు కూడా ఉన్నాయి. సాధారణంగా ఈ కాలంలో జలుబుతో కూడిన జ్వరం ఎక్కువ మందిని వేధిస్తుంది. జలుబు జ్వరంగా మారక ముందే మొదలుపెట్టే వీలున్న చికిత్సలు కూడా ఉన్నాయి. అవేంటంటే...

- ఐదు తులసి ఆకులు, ఐదు మిరియాలు దంచి, మూడు పూటలా నమిలి తినాలి. దీంతో ఉన్న జలుబు తగ్గడంతో పాటు రాకుండా రక్షణ కూడా దక్కుతుంది
- అలర్జీ సంబంధిత జలుబుతో ముక్కు నుంచి నీరు కారుతున్నప్పుడు ఇంట్లో దంచుకున్న పసుపు రెండు చిటికెలు తీసుకుని, అరగ్లాసు పాలలో కలుపుకుని తాగాలి. దాంతో రోగనిరోధకశక్తి పెరిగి, అలర్జీ తగ్గిపోతుంది
- జలుబుతో పాటు గొంతు గరగరలాడుతుంటే, మిరియాలు పొడి చేసుకుని, పాలలో కలిపి తాగాలి
- గుడూచి... జ్వరానికి ఉత్తమమైన ఔషధం. జ్వరం మొదలైన వెంటనే మూడు లేదా నాలుగు గుడూచి ఆకులను దంచి, రసాన్ని తాగాలి
- జ్వరం తీవ్రమైనప్పుడు అనుభవం ఉన్న ఆయుర్వేద వైద్యులను సంప్రతించి, ఆనందభైరవ రసం, త్రిభువనకీర్తి రసం తీసుకోవాలి
- ముందస్తుగానే జ్వరాన్ని అడ్డుకోవడం కోసం మాత్రల రూపంలో దొరికే మృత్యుంజయ రసాన్ని తీసుకోవచ్చు. దీన్ని రోజుకు రెండు పూటలా, వారం రోజుల పాటు వాడుకోవాలి
- దగ్గు మొదలైనప్పుడు లవంగాది వటి తీసుకోవచ్చు
- అడ్డసరం రసం తాగినా ఈ కాలంలో వేధించే దగ్గుల నుంచి ఉపశమనం దక్కుతుంది

వానాకాలం ఆహారం

"శరీరం మొత్తం వాత, పిత్త, కఫ దోషాలు ఆవరించి ఉంటాయి. ఇవి సమ స్థితిలో ఉన్నప్పుడు ఆరోగ్యం నిక్షేపంగా ఉంటుంది. కానీ ఈ కాలంలో కఫాన్ని పెంచే చల్లని పదార్థాలు, తీపి పదార్థాలు తినడం వల్ల జలుబు, దగ్గు, జ్వరాలు వేధిస్తాయి. అలాగే ఈ కాలంలో జీర్ణశక్తి తగ్గుతుంది. కాబట్టి తేలికగా జీర్ణమయ్యే పదార్థాలు మాత్రమే తీసుకోవాలి. మాంసాహారం, పాలు, వెన్న, మీగడ, తీపి పదార్థాలు మానేయాలి. పెరుగుకు బదులు మజ్జిగ తీసుకోవాలి. అలాగే ఇడ్లీ, దోసెల రూపంలో మినప్పప్పు ఎక్కువగా తింటూ ఉంటాం. కానీ మినప్పప్పు ఎక్కువ సాంద్రతను కలిగి ఉంటుంది కాబట్టి కఫం పెరిగి, బరువు పెరుగుతాం. జలుబు, దగ్గు వేధిస్తాయి. కాబట్టి ఈ కాలంలో మినప్పప్పు వాడకం తగ్గించాలి. కాయగూరలు ఎక్కువగా తినాలి. తినే ఆహారం వేడిగా ఉండేలా చూసుకోవాలి. కడుపును మూడు భాగాలు చేసుకుని, ఒక భాగం ఆహారంతో, రెండో భాగం నీటితో నింపి, మూడో భాగాన్ని ఖాళీగా వదిలేస్తూ ఉండాలి. ఇలాంటి అలవాటుతో జీర్ణశక్తి కుంటుపడకుండా ఉంటుంది. ఇలా ఆయుర్వేద శాస్త్రం సూచించే అలవాట్లను అలవరుచుకోగలిగితే వానాకాలం వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు."

ఆచారాల్లోనే ఆరోగ్యం

ఈ కాలంలో తినే ఆహారం తాజాగా ఉండాలి. ఏ పూటకాపూట వండుకుని, వేడిగా తినాలి. నిల్వ ఉన్న ఆహారం, నీరు తాగకూడదు. మరీ ముఖ్యంగా వర్షాలు ఉధృతంగా కురుస్తున్నప్పుడు ఆకుకూరలు తినడం మానేయడం మంచిది. నిజానికి వానాకాలం నుంచి రక్షణ కల్పించే అలవాట్లు మన సంప్రదాయాల్లోనే ఉన్నాయి. ఈ కాలంలో మాంసాహారం తేలికగా జీర్ణమవక శరీరంలో ఆమం పెరుగుతుంది. వానాకాలంలో వచ్చే శ్రావణమాసంలో మాంసాహారానికి దూరంగా ఉండడం వెనకున్న కారణం ఇదే! అలాగే చవితి నాటి పత్రికి బ్యాక్టీరియా, వైరస్‌లను తరిమే గుణాలుంటాయి. అలాగే ఆ రోజు తుమ్మి కూర తింటాం. దాంతో వ్యాధినిరోధకశక్తి పెరిగి వానాకాలం వ్యాధులు దరి చేరకుండా ఉంటాయి. వాకిళ్లకు, పెళ్లిళ్లలో పందిళ్లకు కట్టే మామిడి తోరణాలకు కూడా కొన్ని ప్రయోజనాలున్నాయి. చెట్టు నుంచి కోసిన తర్వాత వారం రోజుల వరకూ కూడా మామిడాకుల నుంచి ఆక్సిజన్ విడుదల అవుతూనే ఉంటుంది. అలాగే ఈ ఆకులు వైరస్, బ్యాక్టీరియాల నుంచి రక్షణ కల్పిస్తాయి. ఇలా ప్రతి ఆచారం వెనక నిగూఢమైన ఆయుర్వేద శాస్త్రం దాగి ఉంటుంది. కాబట్టి ఆయా ఆయుర్వేద ఆరోగ్య సూత్రాలను అనుసరించగలిగితే, వానాకాలం రుగ్మతల నుంచి ప్రతి ఒక్కరూ సులువుగా బయటపడగలుగుతారు.

డాక్టర్ ఎన్. ఉమా శ్రీనివాస రావు
ప్రొఫెసర్ అండ్ వైస్ ప్రిన్సిపాల్,
డాక్టర్ బి.ఆర్.కె.ఆర్. గవర్నమెంట్
ఆయుర్వేదిక్ కాలేజి, హైదరాబాద్.



పోకడ

జిమ్‌లో గుండెపోట్లు

జిమ్‌లో వ్యాయామం చేస్తూ గుండెపోటుతో కుప్పకూలిపోతున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఇలాంటప్పుడు ఆరోగ్యాన్ని అందించవలసిన వ్యాయామాలు ప్రాణాలనే హరించేస్తున్నాయనే అనుమానాలు, అయోమయాలు తలెత్తడం సహజం. కానీ గుండెపోటుకు గురవడానికి అసలు కారణాలు మన అంతర్గత ఆరోగ్య పరిస్థితులే!

అందరి శరీరాలూ ఒకేలా ఉండవు. శరీరం శక్తిని ఖర్చు చేసుకోగలిగే సామర్థ్యం ప్రతి వ్యక్తికీ వేర్వేరుగా ఉంటుంది. ఆ సామర్థ్యం జిమ్ వ్యాయామాలను భరించే స్థాయిలో ఉండవచ్చు, ఉండకపోవచ్చు. అలాగే ఇన్సులిన్ రెసిస్టెన్స్, రక్తంలో చక్కెరలు, హార్మోన్ల హెచ్చుతగ్గులు, తీవ్రమైన ఇన్‌ఫ్లమేషన్... ఈ కారణాలన్నీ భౌతిక శ్రమకు లోనైనప్పుడు మరింత తీవ్రమైన సమస్యలకు దారి తీస్తూ ఉంటాయి. 20 ఏళ్ల వయసులో ఎంచుకున్న జీవనశైలి మార్పుల ముప్పు 30, 40 ఏళ్లకు ముంచుకొస్తుంది. కదలకుండా గంటల తరబడి కూర్చోవడం, అనారోగ్యకరమైన ఆహారపుటలవాట్లు, తీవ్ర ఒత్తిడి, అస్తవ్యస్థ నిద్రవేళలు శరీరాన్ని కుంగదీస్తాయి. పైకి చూడడానికి ఆరోగ్యంగా, చలాకీగా కనిపిస్తున్నప్పటికీ, అంతర్గత వ్యవస్థలైన గుండె, అంతఃస్రావ వ్యవస్థలు ఒత్తిడికి లోనై ఉంటాయంటున్నారు బెంగుళూరు, మణిపాల్ హాస్పిటల్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, డాక్టర్ కతేరియా.

వీళ్లు మరింత అప్రమత్తం

రక్తంలో ఏ కాస్త చక్కెర మోతాదు పెరిగినా, రక్తనాళాలు, నాడులు దెబ్బతిని, గుండె జబ్బుకు దారి తీస్తాయి. ఈ కోవకు చెందినవాళ్లు వ్యాయామ సమయంలో శ్రమకు లోనైనప్పుడు, గుండె మీద ఒత్తిడి పెరుగుతుంది. ఆరోగ్యకరమైన వ్యక్తులతో పోలిస్తే, తేలికపాటి వ్యాయామాలు చేసే సమయంలో ఊబకాయుల్లో రక్తపోటు త్వరితంగా పెరిగిపోతూ ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో గుండెకు రక్తప్రవాహం పెరిగి, గుండె వేగంగా కొట్టుకోవడం మొదలు పెడుతుంది. నిజానికి వ్యాయామ సమయంలో గుండె కొట్టుకునే వేగాన్ని పర్యవేక్షించడం ఎంతో ముఖ్యం. మరీ ముఖ్యంగా ఊబకాయులు, మధుమేహం, అధిక రక్తపోటు లాంటి ఆరోగ్య సమస్యలున్నవాళ్లు ఆరోగ్యానికి చేటు చేయని, సురక్షితమైన వ్యాయామ పద్ధతులను అనుసరించడం కోసం వ్యాయామ సమయంలో గుండె కొట్టుకునే వేగాన్ని పర్యవేక్షించుకోవాలి.

మధుమేహం ముప్పు

మధుమేహం వంశపారంపర్యం. అయినప్పటికీ ఆరోగ్యకరమైన జీవనశైలి, వ్యాయామాలతో మధుమేహాన్ని కొంత మేరకు వాయిదా వేయవచ్చు. కానీ తల్లితండ్రుల నుంచి సంక్రమించకుండా అడ్డుకోలేం! సాధారణంగా కొందరు ఆరోగ్యకరమైన ఆహార, జీవనశైలులను అనుసరించినంత కాలం మధుమేహం దరి చేరదు అనే అపోహలో ఉంటూ ఉంటారు. మధుమేహం చాప కింద నీరులా నిశ్శబ్దంగా శరీరాన్ని ఆక్రమిస్తుంది. లక్షణాలు స్పష్టంగా కనిపించవు కాబట్టి స్వల్ప స్థాయి మధుమేహం నిర్లక్ష్యానికి గురవుతూ, దీర్ఘకాలంలో గుండెకు చేటు చేసి, గుండెపోటు రూపంలో కుప్పకూల్చేస్తూ ఉంటుంది. ఈ పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే వంశపారంగా మధుమేహం సంక్రమించే వీలున్న వారు, క్రమం తప్పక రక్తంలోని చక్కెర మోతాదులను పరీక్షించుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించాలి. మధుమేహం ఎంత స్వల్పంగా ఉన్నప్పటికీ, వైద్యులు సూచించే మందులు వాడుకోవాలి. అంతే తప్ప వ్యాయామంతో మధుమేహాన్ని తగ్గించుకోగలమని అనుకోకూడదు. అలాగే కొందరు ఆరోగ్యాన్ని అంచనా వేయడం కోసం ఎండ్యూరెన్స్ పరీక్ష లేదా స్ట్రెస్ పరీక్షల మీద ఆధారపడుతూ ఉంటారు. ఇలాంటి సందర్భాల్లో గుండె రక్తనాళాల్లోని స్వల్ప అవరోధాలు పరీక్షల్లో బయల్పడకపోవచ్చు. ఈ పరీక్షలు పెద్ద పెద్ద అవరోధాలను మాత్రమే




కనిపెట్టగలుగుతాయనే విషయం అందరూ గుర్తుపెట్టుకోవాలంటున్నారు డాక్టర్ కతేరియా. మధుమేహులు వ్యాయామంలో భాగంగా శరీరాన్ని శ్రమకు లోను చేసినప్పుడు రక్తనాళాల్లోని ఈ మెత్తని అవరోధాలు ఒక్కసా రిగా ఊడి, కుప్పగా మారి, రక్త ప్రవాహానికి అడ్డుపడతాయని హెచ్చరిస్తున్నారాయన.

మీకు తెలుసా?


మనలో 40% మందికి క్యాన్సర్

మనలో 40% మంది వారి జీవితంలో క్యాన్సర్ బారిన పడుతూ ఉంటారని జాతీయ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ చేపట్టిన తాజా సర్వేలు సూచిస్తున్నాయి. క్యాన్సర్ ప్రపంచవ్యాప్త ఆరోగ్య సవాళ్లలో ఒకటిగా మారిపోయింది. ఒక్క అమెరికాలో, ఈ ఒక్క ఏడాదిలోనే రెండున్నర లక్షల కొత్త క్యాన్సర్ కేసులు వెలుగులోకొచ్చాయి. ఆరు లక్షల మంది క్యాన్సర్ రోగులు మరణం అంచున ఉన్నారు. మన దేశంలో ప్రస్తుతానికి అత్యధికంగా 15 లక్షల మంది క్యాన్సర్ రోగులున్నారు. మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, అండాశయాల క్యాన్సర్ సర్వసాధారణమైతే, పురుషుల్లో ఊపిరితిత్తులు, నోరు, నాలుక క్యాన్సర్లు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. అయితే మిగతా దేశాలతో పోలిస్తే, మన దేశంలో క్యాన్సర్లను తొలి దశల్లోనే గుర్తిస్తున్న పరిస్థితి నెలకొని ఉంది. అయితే స్థూలంగా స్త్రీపురుషుల జీవితకాలంలో క్యాన్సర్ ముప్పు 38.9%కి పెరిగింది. ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్షలతో, సమర్థమైన చికిత్సలతో క్యాన్సర్ మరణాల సంఖ్య క్రమేపీ తగ్గుతున్నప్పటికీ, ఆ వ్యాధి బారిన పడే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే ఆరోగ్యకరమైన ఆహార, జీవన శైలులను అనుసరించడంతో పాటు, దైనందిన జీవితంలో వ్యాయామానికి స్థానం కల్పించాలి.





ఇటీవల కర్నాటకలో ఒక మహిళకు సర్జరీ చేస్తున్న క్రమంలో 'క్రిబ్' అనే ఒక కొత్త రక్త గ్రూపు వెలుగులో కొచ్చింది. ఇలాంటి కొత్త రక్త గ్రూపులు, వాటి పూర్వాపరాల గురించి వైద్యులేమంటున్నారో తెలుసుకుందాం!



కొత్త రక్తం... క్రిబ్



సాధారణంగా ఎవరికైనా ప్రధానంగా ఎ, బి, ఎబి, ఒ (పాజిటివ్ లేదా నెగటివ్) రక్త గ్రూపులుంటాయనే మనందరం అనుకుంటూ ఉంటాం. కానీ రక్త గ్రూపుల్లో 25 భిన్నమైన మైనర్ రకాలు కూడా ఉంటాయి. ప్రధాన గ్రూపు 'ఎ', 'బి', 'ఎబి', 'ఒ'లే అయినా, వాటిలోని యాంటీజెన్లను బట్టి వాటిని భిన్నమైన రక్త గ్రూపులుగా పరిగణిస్తారు. 'ఎ' బ్లడ్ గ్రూపు రక్తకణాలకు 'ఎ' అనే యాంటీజెన్ ఉంటుంది. 'బి' బ్లడ్ గ్రూపు రక్తకణాలకు 'బి' యాంటిజెన్ ఉంటుంది. కాబట్టి ఆయా రక్త గ్రూపులను ఆయా యాంటీజెన్ల పేర్లతో పిలుస్తారు. 'ఒ' బ్లడ్ గ్రూపుకు 'ఎ', 'బి' యాంటిజెన్లు రెండూ ఉండవు. అలాంటి భిన్నమైన మరొక రక్తగ్రూపు బోంబే బ్లడ్ గ్రూపు. దీన్ని ముంబైలో 1950ల్లోనే గుర్తించారు. ఇది చూడడానికి 'ఒ' బ్లడ్ గ్రూపులాగే కనిపించినా, అదే బ్లడ్ గ్రూపుతో సరిపోలదు. బాంబే బ్లడ్ గ్రూపుకు 'ఎ', 'బి'లతో పాటు 'హెచ్' యాంటిజెన్ కూడా ఉండదు. దాంతో ఇది 'ఒ' రక్తగ్రూపును అనుకరిస్తుంది. అలాగని అదే గ్రూపు రక్తంతో సరిపోలదు. కాబట్టి ఈ కోవకు చెందిన వారికి అదే తరహా రక్తం మినహా మరే రక్తమూ మ్యాచ్ కాదు.

అరుదైన రక్త గ్రూపులున్నాయి

సాధారణంగా రక్త మార్పిడి సమయంలో ఒకే గ్రూపుకు చెందిన రక్తాలు మ్యాచ్ కాని సందర్భాల్లో వైద్యులు లోతైన పరీక్షలు చేపడుతూ ఉంటారు. అలాంటి సందర్భాల్లో కొత్త రక్త గ్రూపులు బయల్పడుతూ ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా లక్ష మందిలో ఒకరికి, ప్రతి పది వేల భారతీయుల్లో ఒకరికి బాంబే బ్లడ్ గ్రూపు ఉంటుంది. మెడికల్ టూరిజం ద్వారా ఆఫ్రికా, ఇరాక్.. ఇలా మధ్య ప్రాచ్య దేశాల నుంచి ఎంతో మంది మన దేశానికి వస్తూ ఉంటారు. వీరిలో కొందరు ఆఫ్రికన్లకు ఇతరత్రా జన్యుపరమైన రక్తగ్రూపులున్నాయి కాబట్టి ప్రధాన రక్తగ్రూపు సరిపోలినా, మైనర్ రక్తగ్రూపు సరిపోలదు. మనకు లేని యాంటీజెన్లు వాళ్లకు ఉంటాయి. కాబట్టి ఆ జాతీయుల నుంచే రక్తాన్ని సేకరించి, మ్యాచ్ చేయవలసి వస్తూ ఉంటుంది. కొన్ని సందర్భాల్లో అరుదైన రక్త గ్రూపులు కలిగి ఉన్న వారికి అత్యవసర సమయాల్లో రక్తం దొరక్కపోవచ్చు. భవిష్యత్తులో అలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఉండడం కోసం, సదరు వ్యక్తుల నుంచి ముందుగానే రక్తాన్ని సేకరించి, నిల్వ చేసుకునే విధానాన్ని కూడా వైద్యులు అనుసరిస్తూ ఉంటారు. అందుకోసం ఈ కోవకు చెందిన వారికి ఇంజెక్షన్లతో ఎముక మజ్జను ప్రేరేపించి ఎక్కువ రక్తాన్ని వృద్ధి చేయడం ద్వారా అదనపు రక్తాన్ని సేకరిస్తారు.

కారణాలున్నాయి

తాజాగా బయల్పడిన 'క్రిబ్' రక్త గ్రూపు పూర్తిగా కొత్తది. దీనికి క్రోమర్ ఇండియా బెంగళూరు అని పేరు పెట్టారు. ఇలా కొత్త రక్త గ్రూపులు పుట్టుకు రావడానికి కారణాలు లేకపోలేదు. బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్లు, జన్యుపరమైన వ్యత్యాసాల వల్ల కొత్త రక్త గ్రూపులు పుట్టుకురావచ్చు. ఇలా కొత్త రక్త గ్రూపులు బయల్పడడం వల్ల కొన్ని ప్రయోజనాలుంటాయి. వీటిని శాస్త్రీయ సాహిత్యంలో చేర్చడం ద్వారా ఎంత మందికి ఈ రక్త గ్రూపు ఉందనే విషయం వెల్లడవుతుంది. అలాగే అత్యవసర పరిస్థితుల్లో రక్త మార్పిడికి వీలుగా ముందస్తుగా రక్తాన్ని సేకరించి నిల్వ చేసుకునే వెసులుబాటు చిక్కుతుంది.

బ్లడ్ జాండిస్

రక్తానికి సంబంధించి ఎంతో మందికి తెలియని అత్యంత ముఖ్యమైన విషయం.. బ్లడ్ జాండిస్. కామెర్ల వ్యాధి కాలేయానికే పరిమితం కాదు. కామెర్లకు రక్తంతో కూడా సంబంధం ఉంటుంది. ఎర్రరక్త కణాలు విచ్ఛిన్నమవుతున్నా కామెర్లు సోకుతాయి. కాలేయం దెబ్బతినే పరిస్థితి, కాంజుగేటెడ్ జాండిస్ అయితే, రక్తకణాలు విచ్ఛిన్నమయ్యే పరిస్థితి... అన్‌కాంజుగేటెడ్ జాండిస్. రక్తపు జాండిస్‌లో కూడా, కాలేయ జాండిస్ లక్షణాలే కనిపిస్తాయి. అదనంగా నీరసం ఆవరించినా, అదంతా పత్యం వల్లే అనుకుంటారు. కానీ అది రక్తపు జాండిస్ కాదని నిర్ధారించుకోవడం కోసం 'డైరెక్ట్ కూంబ్స్ టెస్ట్' అనే పరీక్ష చేయించుకోవాలి. ఫలితంలో రక్తపు జాండిస్ ఉందని తేలితే సత్వర చికిత్స మొదలుపెట్టాలి. ఇలాంటి రక్త కామెర్లు సోకిన వాళ్లకు ఎర్ర రక్త కణాల మీద పైపొర ఏర్పడుతుంది. దాంతో రక్తకణాలు పగిలిపోతూ ఉంటాయి. కాబట్టి వైద్యులు స్టిరాయిడ్స్ ఇచ్చి, ఆ పరిస్థితిని సరిదిద్దుతారు.

మెడికల్ న్యూస్



డాక్టర్ పద్మజ లోకిరెడ్డి
హెమటో ఆంకాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్
హైదరాబాద్.



ఈక్విటీ ఫండ్లలోకి నిధుల వరద



జూలైలో రూ.42,702 కోట్ల రాక .. జూన్‌తో పోలిస్తే 81 శాతం వృద్ధి

- సరికొత్త ఆల్‌టైం గరిష్ఠ స్థాయి ఇది
- రూ.28,464 కోట్లతో సిప్ రికార్డు
- రూ.75 లక్షల కోట్లు దాటిన మొత్తం ఫండ్ల ఆస్తుల విలువ

న్యూఢిల్లీ: జూలై నెలలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) పథకాల్లో నికర పెట్టుబడులు సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.42,702 కోట్లకు పెరిగాయి. ఈ జూన్‌లో నమోదైన రూ.23,578 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే ఏకంగా 81 శాతం వృద్ధి నమోదైంది. గత నెలలో ఈక్విటీ మార్కెట్లు తీవ్ర ఒడుదుడుకులకు లోనైన తరుణంలోనూ ఈ విభాగ మ్యూచువల్ ఫండ్ పథకాల్లోకి రికార్డు స్థాయిలో కొత్త పెట్టుబడులు రావడం గమనార్హం. థీమాటిక్, ఫ్లెక్సీ క్యాప్ ఫండ్లలో పెట్టుబడులు గణనీయంగా పెరగడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. కాగా, ఈక్విటీ ఫండ్ పథకాల్లోకి నికర పెట్టుబడులు రావడం వరుసగా ఇది 53వ నెల అని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) సోమవారం తన నివేదికలో వెల్లడించింది. "సుంకాల పోరు నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు పెరిగినప్పటికీ, భారత వృద్ధికి ఢోకా లేదనడానికి ఈక్విటీల్లోకి పెరిగిన నిధుల వరదే నిదర్శనం. దిగివచ్చిన ధరలు (ద్రవ్యోల్బణం), మెరుగైన ద్రవ్య లభ్యత, పెరిగిన కుటుంబ ఆదా వంటి అంశాలు ఇందుకు దోహదపడుతున్నాయ"ని యాంఫీ సీఈఓ వెంకట్ ఎన్ చలసాని అన్నారు. మరిన్ని విషయాలు..

- మ్యూచువల్ ఫండ్ పథకాల్లోకి క్రమానుగత పెట్టుబడులూ (సిప్) సరికొత్త రికార్డు స్థాయికి పెరిగాయి. గత నెలలో ఫండ్ మదుపరులు రూ.28,464 కోట్లు సిప్ చేశారు. అంతక్రితం నెలలో నమోదైన రూ.27,269 కోట్ల సిప్‌లతో పోలిస్తే 4 శాతం అధికం ఇది.
- ఈ జూన్‌లో డెట్ ఫండ్ల నుంచి నికరంగా రూ.1,711 కోట్లు వెనక్కి తీసుకున్న ఇన్వెస్టర్లు.. జూలైలో ఏకంగా రూ.1.06 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారు. లో డ్యూరేషన్, మనీ మార్కెట్ ఫండ్లతో పాటు లిక్విడ్, ఓవర్‌నైట్ ఫండ్లలో భారీగా కొత్త పెట్టుబడులు రావడం ఇందుకు తోడ్పడింది.
- గత నెలలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్)ల్లోకి నికరంగా రూ.1,256 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అంతక్రితం నెలలో వచ్చిన రూ.2,081 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే మాత్రం గణనీయంగా తగ్గాయి. అయితే, వీటిల్లోకి నికర పెట్టుబడులు రావడం వరుసగా ఇది మూడో నెల.
- మొత్తంగా జూలైలో ఎంఎఫ్ ఇండస్ట్రీలోకి రూ.1.8 లక్షల కోట్ల కొత్త పెట్టుబడులు వచ్చాయి. జూన్‌తో పోలిస్తే 49,000 కోట్లు, మే నెలలో వచ్చిన దానికంటే రూ.29,000 కోట్లు అధికం. తత్ఫలితంగా దేశంలోని మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ (ఏయూఎం) జూలైలో 1.3% పెరిగి రూ.75.36 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇండస్ట్రీ ఏయూఎం రూ.75 లక్షల కోట్ల మైలురాయిని దాటడం ఇదే తొలిసారి. జూన్‌లో ఇది రూ.74.4 లక్షల కోట్లుగా నమోదైంది.

కనీస నిల్వ నిర్ణయం.. బ్యాంకుల ఇష్టం

ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



గొజారియా (గుజరాత్): బ్యాంకులకు పొదుపు ఖాతాల కనీస నగదు నిల్వ పరిమితిని నిర్ణయించే స్వేచ్ఛ ఉందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ఇది ఆర్‌బీఐ నియంత్రణ పరిధిలోకి రాదని ఆయన స్పష్టం చేశారు. దేశంలో రెండో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకింగ్ సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్ తన పొదుపు ఖాతాల కనీస నిల్వ పరిమితిని 10,000 నుంచి ఏకంగా రూ.50,000కు పెంచడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గుజరాత్‌లోని గొజారియా గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన ఓ ఆర్థిక సమ్మిళిత కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మల్హోత్రాను మీడియా వర్గాలు ఇదే విషయంపై ప్రశ్నించాయి. "పొదుపు ఖాతాల కనీస నిల్వ పరిమితిపై నిర్ణయాన్ని ఆర్‌బీఐ ఆయా బ్యాంకులకే వదిలేసింది. కొన్ని బ్యాంకులు కనీస నిల్వను రూ.10,000గా నిర్ణయించగా.. మరికొన్ని రూ.2,000కు పరిమితం చేశాయి. ఈ మధ్యనే కొన్ని బ్యాంకులు పరిమితిని పూర్తిగా ఎత్తివేశాయి. ఇది ఆర్‌బీఐ నియంత్రణలో లేని అంశ"మని మల్హోత్రా సమాధానమిచ్చారు.

ఆర్థిక శాఖకు లేఖ రాసిన బీబీడీబీఎం: ఐసీఐసీఐ బ్యాంక్ తాజా నిర్ణయాన్ని బ్యాంక్ బచావో దేశ్ బచావో మంచ్ (బీబీడీబీఎం) తప్పుపట్టింది. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలంటూ కేంద్ర ఆర్థిక శాఖకు ఈ సంస్థ లేఖ కూడా రాసింది. ఈ అన్యాయమైన, తిరోగమన నిర్ణయం బ్యాంకింగ్ సేవల సమ్మిళితం, వృద్ధి లక్ష్యాలకు విఘాతమని లేఖలో పేర్కొంది.

ప్రభుత్వ బ్యాంకుల్లో కనీస నిల్వ పరిమితి ఎత్తివేత: ఎస్‌బీఐ సహా పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ).. పొదుపు ఖాతాల కనీస నిల్వ పరిమితిని ఎత్తివేశాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు వెల్లడించారు. దేశంలో ఆర్థిక సేవలను అందరికీ అందుబాటులో తేవాలన్న లక్ష్యాన్ని ప్రోత్సహించేందుకు కొన్ని పీఎస్‌బీలు ఈ పరిమితిని తగ్గించాయని లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.

హైదరాబాద్‌లో జెడ్ఎస్ కార్యాలయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్, టెక్నాలజీ సంస్థ జెడ్ఎస్ హైదరాబాద్‌లో కొత్త కార్యాలయం ప్రారంభించింది. హైటెక్ సిటీలోని రహేజా ఐటీ పార్కులో 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయంలో 500-600 మంది ఉద్యోగులు పని చేయవచ్చని జెడ్ఎస్ వెల్లడించింది. దేశంలోని హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ జీసీసీల కోసం తన సర్వీస్ సామర్థ్యాలు విస్తరించే వ్యూహంలో భాగంగానే ఈ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపింది. హైదరాబాద్‌లో తాము కార్యకలాపాలు ప్రారంభించిన ఏడాది లోగానే ఈ వ్యూహాత్మక విస్తరణ కూడా చేపట్టినట్టు కంపెనీ రీజినల్ మేనేజింగ్ ప్రిన్సిపల్ మోహిత్ సూద్ తెలిపారు. అమెరికాలోని ఇవాన్‌స్టన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న జెడ్ఎస్ ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్న 35 కార్యాలయాల్లో 13,000 మంది పని చేస్తున్నారు. భారత్‌లోని పుణె, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, గురుగ్రామ్, నోయిడా కార్యాలయాల్లో 10,000 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	520
వరంగల్	482	గోదావరి	510
చిత్తూరు	543	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	109
వరంగల్	100	గుంటూరు	114
కరీంనగర్	100	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	90
కర్నూలు	100	నెల్లూరు	95
విశాఖపట్నం	104	అనంతపురం	95
గోదావరి	109		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,02,280 ▼	93,750 ▼	1,27,000 ▲
విజయవాడ	1,03,000 ▼	97,000 ▼	1,16,900 ▼
విశాఖపట్నం	1,02,900 ▼	93,750 ▼	1,27,000 ▲
రాజమండ్రి	1,02,200 ▼	93,750 ▼	1,17,900 ▼
ప్రొద్దుటూరు	1,00,700 ▼	92,640 ▼	1,17,100 ▼
ముంబై	99,957 ▼	91,561 ▼	1,13,501 ▼

కేజీ బేసిన్‌లో ఓఎన్‌జీసీ రూ. 4,600 కోట్ల పెట్టుబడి

10 బావుల అభివృద్ధి, ఆఫ్‌షోర్ పైప్‌లైన్ ఏర్పాటు

హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని చమురు, సహజ వాయువుల సంస్థ (ఓఎన్‌జీసీ) కృష్ణా గోదావరి (కేజీ) బేసిన్‌లో చేపడుతున్న పలు ప్రాజెక్టులపై రూ.4,600 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. 10 బావులు తవ్వడంతో పాటు రెండు అన్‌మ్యాన్డ్ ప్లాట్‌ఫారాలు, ఒక ఆఫ్‌షోర్ పైప్‌లైన్ ఏర్పాటు చేయనుంది. దీనికి తోడు ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ జిల్లాలో ఒక ఆన్‌షోర్ గ్యాస్ ప్రాసెసింగ్ యూనిట్ కూడా ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టులకు తాజాగా పర్యావరణపరమైన అనుమతులివ్వాలని పర్యావరణ, అడవుల మంత్రిత్వ శాఖను ఓఎన్‌జీసీ కోరింది. ఈ మంత్రిత్వ శాఖకు అనుబంధంగా పని చేస్తున్న నిపుణుల అప్రైజల్ కమిటీ (ఈఏసీ) జూలై 24వ తేదీన నిర్వహించిన సమావేశం తీర్మానాల్లో ఈ అంశాలున్నాయి. తూర్పు కోస్తాలో 697 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల కేజీ/ఓఎస్‌డీఎస్ఎఫ్/చంద్రిక/2021 (చంద్రిక), 148 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల కేజీ/ఓఎస్‌డీఎస్ఎఫ్/జీఎస్49 /2021 ఆఫ్‌షోర్ ఆయిల్ అండ్ గ్యాస్ కాంట్రాక్ట్ ప్రాంతాలకు 2022 సెప్టెంబరులో డీఎస్ఎఫ్-3 (కనుగొన్న చిన్న క్షేత్రం-3) కింద డైరెక్టర్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ లెటర్ ఆఫ్ అవార్డ్ (ఎల్ఓఏ) జారీ చేశారు. ఈ ప్రాజెక్టుకు 26.3 హెక్టార్ల (ఓడల రేవు టెర్మినల్) భూమి అవసరమవుతుందని, అందులో 8.7 హెక్టార్లలో (మొత్తం ప్రాజెక్టు ప్రదేశంలో 33%) హరిత ప్రాంతాలను అభివృద్ధి చేస్తారని ఈఏసీ తెలిపింది. పర్యావరణ నిర్వహణ ప్రణాళిక (ఈఎంపీ) పెట్టుబడి వ్యయం రూ.14 కోట్లు కాగా దీనిపై ఏడాదికి రూ.3 కోట్ల ఈఎంపీ వ్యయం కూడా భరించాల్సి ఉంటుంది. వాణిజ్యపరంగా లాభదాయకమైన నిల్వలున్నట్టు నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే ఈ బావులు తవ్వారు. ఈ ప్రాజెక్టు ద్వారా 150 మందికి ప్రత్యక్ష ఉపాధి, 310 మందికి పరోక్ష ఉపాధి లభించనుంది.

మార్కెట్లో ఊరట ర్యాలీ

- 746 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- రూ.3.50 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: వరుసగా ఆరు వారాలుగా నష్టపోతూ మూడు నెలల కనిష్ఠానికి జారుకున్న ఈక్విటీ సూచీలకు సోమవారం కాస్త ఊరట లభించింది. ఇంధన, వాహన, బ్యాంకింగ్ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు వాల్యూ బైయింగ్‌కు పాల్పడటంతో మార్కెట్ మళ్లీ లాభాల్లో పయనించింది. సెన్సెక్స్ 746.29 పాయింట్ల వృద్ధితో 80,636.05 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 221.75 పాయింట్ల లాభంతో 24,585.05 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.5 లక్షల కోట్ల పెరుగుదలతో రూ.444.13 లక్షల కోట్లకు చేరుకుంది. అమెరికా మార్కెట్ల సానుకూల సంకేతాలు, వరుసగా అమ్మకాలకు పాల్పడుతూ వచ్చిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) మళ్లీ మన మార్కెట్లో పెట్టుబడులు పెట్టడం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను బలపరిచిందని విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నెల 15న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ కానున్నారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం ముగిసేందుకు ఈ సమావేశం బాటలు వేయనుందన్న అంచనాలూ మార్కెట్ ర్యాలీకి దోహదపడ్డాయి.

అఫర్డబుల్ ఇళ్ల అమ్మకాలకు ట్రంప్ గ్రహణం

న్యూఢిల్లీ: భారతీయ ఉత్పత్తులపై అమెరికా భారీ సుంకాలు విధించిన నేపథ్యంలో దేశంలో అఫర్డబుల్ ఇళ్ల అమ్మకాలు తగ్గే అవకాశం కనిపిస్తోంది. అమెరికా సుంకాలతో చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలు (ఎంఎస్ఎంఈ), వాటి సిబ్బంది ఆదాయాలు క్షీణించి అఫర్డబుల్ రియల్టీపై ప్రభావం పడుతుందని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ తెలిపింది. రూ.45 లక్షల లోపు విలువ గల ఇళ్ల కొనుగోలుదారుల్లో అధిక శాతం మంది ఎంఎస్ఎంఈ ఉద్యోగులు, చిన్న వ్యాపారాలు చేసే వారే కావడం ఇందుకు కారణం. అమెరికాకు వస్తు ఎగుమతుల్లో ఎంఎస్ఎంఈ ఉత్పత్తులే అధికంగా ఉంటాయి. వీటిపై అధిక సుంకాలు విధిస్తే మార్కెట్లో వాటి పోటీ సామర్థ్యం తగ్గుతుంది. ఫలితంగా వ్యాపార ఆర్డర్లు తగ్గి ఆయా కంపెనీల్లో పని చేసే సిబ్బంది ప్రతికూలంగా ప్రభావితం అవుతారని అనరాక్ రీసెర్చ్ అండ్ అడ్వైజరీ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రశాంత్ ఠాకూర్ అన్నారు. వాస్తవానికి కొవిడ్-19 తర్వాత అఫర్డబుల్ ఇళ్ల అమ్మకాలు, కొత్త ప్రాజెక్టులు కూడా తగ్గిపోయాయి. 2025 ప్రథమార్థంలో దేశంలోని ఏడు ప్రధాన నగరాలో 1.9 లక్షల ఇళ్లు అమ్ముడుపోగా వాటిలో అఫర్డబుల్ ఇళ్లు 34,565 మాత్రమే ఉన్నాయి.

- టఫే (ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్).. రెండో ఎడిషన్ మాసే డైన స్టార్ కాంటెస్ట్ సీజన్-2లో కర్ణాటకలోని బెల్గాంకు చెందిన అవినాష్ దేశాయ్ విజేతగా నిలిచినట్లు ప్రకటించింది. దేశాయ్‌కు మాసే ఫెర్గూసన్ డైనాస్మార్ట్ 2డబ్ల్యూడీ ట్రాక్టర్‌ను బహుమతిగా అందించినట్లు వెల్లడించింది. ఐటీ ఉద్యోగి నుంచి రైతుగా మారిన దేశాయ్ మాసే ఫెర్గూసన్ డైనాట్రక్ 241తో నడిచే మొబైల్ స్లర్రీ డీవాటరింగ్ మెషిన్‌కు వినూత్నమైన నవకల్పనను రూపొందించినట్లు వెల్లడించింది. ఈ పోటీకి దేశవ్యాప్తంగా 16,000 ఎంట్రీలు రాగా 12 మంది ఫైనలిస్టులను ఎంపిక చేసినట్లు వెల్లడించింది. ఇందులో రైతులు, గ్రామీణ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, వ్యవసాయ విద్యార్థులు ఉన్నారని తెలిపింది.

స్పోర్ట్స్

అడ్డంకులను అధిగమిస్తాం

మహిళల వన్డే వరల్డ్‌కప్‌పై హర్మన్‌ప్రీత్



50 రోజుల కౌంట్‌డౌన్



ముంబై: ఈ ఏడాది భారత్, శ్రీలంకల్లో ప్రతిష్ఠాత్మక మహిళల వన్డే వరల్డ్‌కప్ జరుగబోతోంది. సెప్టెంబరు 30 నుంచి నవంబరు 2 వరకు జరిగే ఈ టోర్నీ 50 రోజుల కౌంట్‌డౌన్‌తో పాటు ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఇందులో ఐసీసీ అధ్యక్షుడు జైషా, సీఈవో సంజోగ్ గుప్తా, బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా, మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, మిథాలీ రాజ్‌తో పాటు భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్ పాల్గొన్నారు. అయితే 1973 నుంచి జరుగుతున్న ఈ మెగా టోర్నీలో భారత జట్టు విజేతగా నిలువలేకపోయింది. 2005, 2017లో మాత్రం రన్నరప్‌గా నిలిచింది. అందుకే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కప్‌పై ధీమాను వ్యక్తపరుస్తోంది. 'ఈసారి మాత్రం అన్ని అడ్డంకులను అధిగమించి, భారత అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న కప్‌ను సాధిస్తాం. దేశం కోసం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉంటాం. అలాగే యువరాజ్‌ను చూసి నేనెంతో ప్రేరణ పొందుతా' అని హర్మన్ తెలిపింది.

దేశం కోసం...: యువీ

దేశం కోసం మ్యాచ్‌లను గెలవాలనే కసి ప్రతీ ప్లేయర్‌లో ఉండాలని మాజీ ఆటగాడు యువరాజ్ సింగ్ సూచించాడు. 'చరిత్ర సృష్టించేందుకు మీకిదే అద్భుత అవకాశం. కానీ ఆరంభం నుంచే అంచనాలు పెట్టుకోకుండా పరిస్థితులకు తగ్గట్టు ఆడండి. ఫలితాలు అవే వస్తాయి. మీ అనుభవంపై నమ్మకం పెట్టుకోండి. ఎలాంటి స్థితిలోనైనా దేశం కోసం గెలవాలనే తపనను వీడకండి' అని మహిళా జట్టుకు ఉద్బోధించాడు.

బెంగళూరు మ్యాచ్‌లపై అస్పష్టత

వరల్డ్‌కప్‌లో ఐదు మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వాల్సిన బెంగళూరు చిన్నస్వామి స్టేడియంపై ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. జూన్ 4న అక్కడ జరిగిన తొక్కిసలాట కారణంగా స్టేడియంలో మ్యాచ్‌లపై కర్ణాటక ప్రభుత్వం నిషేధం విధించింది. అయితే అనుమతి కోసం కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం ఇప్పటికే ప్రభుత్వానికి లేఖ రాసినా స్పందనలేదు. ఒకవేళ అక్కడ మ్యాచ్‌లు జరుగకపోతే వైజాగ్, గువాహటిలకు తరలించే చాన్సుంది. అయితే పాకిస్థాన్‌తో పాటు కొన్ని ఇతర జట్ల మ్యాచ్‌లకు శ్రీలంక కూడా ఆతిథ్యం ఇవ్వనుంది.

క్రీడా బిల్లుకు గ్రీన్ సిగ్నల్

లోక్‌సభ ఆమోదం



- దేశ క్రీడా రంగంలో అతిపెద్ద సంస్కరణ
- మంత్రి మన్‌సుఖ్ మాండవ్య
- డోపింగ్ నిరోధక సవరణ బిల్లుకూ ఓకే

న్యూఢిల్లీ : జాతీయ క్రీడా పరిపాలన బిల్లు (ఎన్ఎస్‌జీబీ)ను లోక్‌సభ సోమవారం ఆమోదించింది. స్వాతంత్ర్యం తర్వాత దేశ క్రీడా రంగంలో తీసుకొచ్చిన ఏకైక అతి పెద్ద సంస్కరణగా ఈ బిల్లును కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య అభివర్ణించారు. బిహార్‌లో ఎన్నికల జాబితాలో సవరణలపై ప్రతిపక్షం వ్యక్తంజేస్తున్న నిరసనల మధ్యే క్రీడా బిల్లును సభ ఆమోదించడం గమనార్హం. అలాగే జాతీయ డోపింగ్ నిరోధక (ఎన్ఏడీ) సవరణ బిల్లుకూ లోక్‌సభ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 'స్వాతంత్ర్యం వచ్చాక క్రీడల్లో చేపట్టిన అతి పెద్ద సంస్కరణ ఈ బిల్లు. క్రీడా సమాఖ్యలలో జవాబుదారీతనం, అథ్లెట్లకు న్యాయం చేకూర్చడంతో పాటు ఉత్తమ పరిపాలనను ఈ బిల్లు అందిస్తుంది' అని విపక్ష సభ్యుల నినాదాల మధ్య మాండవ్య ప్రకటించారు. బిహార్ ఎన్నికల జాబితాలో సవరణలను వ్యతిరేకిస్తూ ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయం ముట్టడికి వెళ్లిన నేపథ్యంలో.. లోక్‌సభలో క్రీడా బిల్లు ఆమోదం సమయంలో ప్రతిపక్ష పార్టీ నేతలెవరూ లేరు. అయితే తర్వాత ఇద్దరు విపక్ష ఎంపీలు బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొంటూ తమ మద్దతు తెలిపారు. నిరసన కార్యక్రమం తర్వాత సభలో ప్రవేశించిన విపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. ఈ గందరగోళ పరిస్థితుల మధ్యనే 'వాయిస్ ఓటు'తో క్రీడా బిల్లును సభ ఆమోదించింది.

ప్యానెల్‌కు నివేదించాలి: దిగ్విజయ్ సింగ్

అంతకుముందు..క్రీడలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ దిగ్విజయ్ సింగ్ మాట్లాడుతూ క్రీడా పరిపాలన బిల్లును పార్లమెంటరీ ప్యానెల్‌కు పంపాలని లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లాను కోరారు. ఈ బిల్లును ప్యానెల్ కూలంకషంగా పరిశీలించడంతోపాటు చర్చించిన అనంతరమే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని అభిప్రాయపడ్డారు. అయితే దేశ క్రీడా రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతోపాటు 2036 ఒలింపిక్స్ నిర్వహణకు ప్రయత్నిస్తున్న తరుణంలో ప్రపంచ స్థాయి క్రీడా సంస్కృతిని ప్రవేశపెట్టేందుకు ఈ రెండు బిల్లులు ఎంతో కీలకమైనవని మాండవ్య చెప్పారు. 'దేశ క్రీడా రంగంలో సంస్కరణలకోసం 1975 నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. 1985లో మేం తొలి ముసాయిదా బిల్లు ప్రవేశపెట్టాం. కానీ వ్యక్తిగత లబ్ధి కోసం క్రీడలను కూడా రాజకీయం చేశారు. ఈ బిల్లును ముందుకు తెచ్చేందుకు గతంలో క్రీడా మంత్రులు ప్రయత్నించారు. కానీ సఫలం కాలేకపోయారు' అని మాండవ్య వివరించారు.

బిల్లులోని ముఖ్యాంశాలు..

- సివిల్ కోర్టు అధికారాలతో నేషనల్ స్పోర్ట్స్ ట్రైబ్యునల్ (ఎన్ఎస్‌టీ) ఏర్పాటు చేస్తారు.
- నేషనల్ స్పోర్ట్స్ బోర్డు (ఎన్ఎస్‌బీ) ఏర్పాటు కానుంది.
- ఎన్నికలు నిర్వహించని జాతీయ క్రీడా సమాఖ్యల గుర్తింపును రద్దు చేసే అధికారాన్ని ఎన్ఎస్‌బీ కలిగి ఉంటుంది.
- నేషనల్ స్పోర్ట్స్ ఎలక్షన్ ప్యానెల్ ఏర్పాటు కానుంది.
- బీసీసీఐ మినహా గుర్తింపు పొందిన అన్ని క్రీడా సమాఖ్యలు సమాచార హక్కు చట్టం పరిధిలోకి రానున్నాయి.

ఐఓసీతో నిరంతర చర్చలు

2036 ఒలింపిక్స్ నిర్వహణ బిడ్డింగ్‌కు సంబంధించి అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) 'ఫ్యూచర్ హోస్ట్ కమిటీ'తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్టు మంత్రి మాండవ్య తెలిపారు. ఆప్ సభ్యుడు గుర్మీత్‌సింగ్ లోక్‌సభలో సోమవారం అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

అమరావతి రాయల్స్ మరో గెలుపు

ఆంధ్ర ప్రీమియర్ లీగ్



రాహుల్ (61)

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఏపీఎల్ సీజన్-4 టోర్నీలో భాగంగా సోమవారం నాటి తొలి మ్యాచ్‌లో అమరావతి రాయల్స్ ఐదు వికెట్ల తేడాతో తుంగభద్ర వారియర్స్‌పై గెలుపొందింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన తుంగభద్ర వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 188 పరుగులు చేసింది. డీవీ ప్రశాంత్ (59), కె.ఆనందజోసయ్య (32), కేవీ శశికాంత్ (36 నాటౌట్) రాణించారు. రాయల్స్ బౌలర్లలో మల్లికార్జున, కార్తీక్ రామన్ రెండేసి, అయ్యప్ప, వినయ్‌కుమార్ చెరో వికెట్ తీశారు. ఛేదనలో అమరావతి రాయల్స్ 19.1 ఓవర్లలో ఐదు వికెట్లకు 193 పరుగులు చేసి టోర్నీలో రెండో విజయాన్ని నమోదు చేసింది. ఎస్వీ రాహుల్ (61), సందీప్ (33), ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్ (42 నాటౌట్), పాండురంగరాజు (39 నాటౌట్) సత్తా చాటి విజయాన్నందించారు. తుంగభద్ర బౌలర్లలో కేవీ శశికాంత్‌కు రెండు వికెట్లు దక్కగా.. స్టీఫెన్, తోషిత్ యాదవ్, సౌరభ్‌కుమార్ తలో వికెట్ పడగొట్టారు. మరో మ్యాచ్‌లో కాకినాడ కింగ్స్ 5 వికెట్లతో సింహాద్రి వైజాగ్ లయన్స్‌ను ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సింహాద్రి జట్టు నిర్ణీత ఓవర్లలో 207 రన్స్‌కు ఆలౌటైంది. ఛేదనలో కాకినాడ 19.2 ఓవర్లలో 5 వికెట్లకు 208 పరుగులు చేసి నెగ్గింది. పిన్నింటి తపస్వి 94 పరుగులతో రాణించాడు.

ధోనీ పరిహారం కేసులో అడ్వకేట్ కమిషనర్‌కు హైకోర్టు సుముఖం

చెన్నై (ఆంధ్రజ్యోతి): పరువు నష్ట పరిహారం కోరుతూ దాఖలైన కేసులో మాజీ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ వాంగ్మూలం నమోదు కోసం అడ్వకేట్ కమిషనర్‌ను నియమించేందుకు మద్రాసు హైకోర్టు సుముఖత వ్యక్తం చేసింది. ఐపీఎల్ బెట్టింగ్ కేసుకు సంబంధించి టెలివిజన్ చర్చలో కొందరు తన పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ ధోనీ మద్రాసు హైకోర్టులో రూ.100 కోట్లకు దావా వేశాడు. పది సంవత్సరాలకుపైగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ కార్తికేయన్ సోమవారం విచారించారు. ప్రముఖ వ్యక్తినైన తాను స్టేట్‌మెంట్ ఇవ్వడానికి స్వయంగా వస్తే కోర్టులో గందరగోళం ఏర్పడే అవకాశమున్నందున స్టేట్‌మెంట్ రికార్డ్ చేయడానికి అడ్వకేట్ కమిషనర్‌ను నియమించాలని ధోనీ అభ్యర్థించాడు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. అడ్వకేట్ కమిషనర్‌ను హైకోర్టు జాబితాలో ఉన్నవారి పేర్ల నుంచి ఎంపిక చేస్తానని ప్రకటించారు.

స్నేహిత్‌కు కాంస్యం



వడోదర: జాతీయ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్స్ టోర్నీలో ఎస్ఎఫ్ఆర్ స్నేహిత్ పతకం దక్కించుకున్నాడు. సోమవారం జరిగిన సింగిల్స్ సెమీస్‌లో స్నేహిత్ 9-11, 12-14, 12-10, 10-12, 9-11తో రోనిత్ చేతిలో ఓటమిపాలై కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. కాగా సింగిల్స్ టైటిల్‌ను మానుష్ షా గెలిచాడు.

అర్జున్‌కు డ్రా

చెన్నై: చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నీలో అర్జున్ ఇరిగేసికి మరో డ్రా ఎదురైంది. సోమవారం జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో సహచరుడు ప్రణవ్‌తో అర్జున్ పాయింట్ పంచుకొన్నాడు. తెల్లపావులతో ఆడిన అర్జున్ 78 ఎత్తుల అనంతరం ప్రణవ్‌తో డ్రాకు అంగీకరించాడు. అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో కార్తికేయన్ మురళి, అవోండర్ లియాంగ్ (అమెరికా)తో నిహాల్ సరీన్ తన గేమ్‌లను డ్రా చేసుకొన్నారు. కాగా, చాలెంజర్స్‌లో ద్రోణవల్లి హారికకు నాలుగో ఓటమి ఎదురైంది. అభిమన్యు పురానిక్ చేతిలో హారిక, హర్షవర్ధన్ చేతిలో వైశాలి పరాజయం పాలయ్యారు.

సిరాజ్ ఏం తింటాడో?

డేవిడ్ గోవర్ ఆసక్తి





లండన్: ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల్లోనూ పూర్తి ఫిట్‌నెస్‌తో బరిలోకి దిగడమే కాకుండా.. వికెట్ల వేటలోనూ అదరగొట్టిన భారత పేసర్ మహ్మద్ సిరాజ్‌పై ఆ దేశ మాజీ కెప్టెన్ డేవిడ్ గోవర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ముఖ్యంగా అతని ఫిట్‌నెస్ అబ్బురపరిచిందని తెలిపాడు. 'సిరాజ్ అసలు ఏం తింటాడు? ఏం తాగుతాడనే విషయాలు తెలుసుకోవాలనుకుంటున్నా. ఎందుకంటే వాటిని ఇంగ్లండ్ బౌలర్లకు అందివ్వాలి. సిరీస్‌లో ఏ టెస్టునూ వదలకుండా అన్నింట్లో బరిలోకి దిగాడు. చివరి టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌లో 30 ఓవర్లకు పైగా బౌలింగ్ చేసినా అతనిలో అలసటనేదే కనిపించలేదు. గెలిచి తీరాలన్న కసితో పాటు ఫిట్‌నెస్‌లోనూ ఆదర్శంగా నిలిచాడు. మా ఇంగ్లండ్ బౌలర్లు మాత్రం కొంతకాలంగా ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతున్నారు' అని గోవర్ వివరించాడు.

రితికకు స్వర్ణం

ఆసియా బాక్సింగ్



బ్యాంకాక్: ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్ అండర్-22 విభాగంలో చివరి రోజు భారత్ స్వర్ణ పతకం అందుకుంది. సోమవారం జరిగిన మహిళల 80+ కిలోల ఫైనల్లో కజకిస్థాన్ బాక్సర్ అసెల్ టొక్టాసిన్‌ను ఓడించిన రితిక విజేతగా నిలిచింది. యాత్రీ పటేల్ (57 కిలోలు), ప్రియ (60 కిలోలు) తుదిపోరులో ఓటమితో రజత పతకాలతో సరిపెట్టుకున్నారు. అలాగే ఫైనల్లో ఓడిన నీరజ్ (75 కిలోలు), ఇషాన్ (90+ కిలోలు) కూడా రజత పతకాలతో వెనుదిరిగారు.

రంగులు మార్చే కార్లు!





దశాబ్దాల క్రితమే ప్రతిపాదనలు.. అప్పట్నుంచీ చర్చ.. బీఎండబ్ల్యూ, నిస్సాన్, ఫోర్డ్ సంస్థల ప్రయోగాలు

- అన్నీ ఇంకా ప్రతిపాదనలు, పరిశోధనల దశలోనే!
- నీతా అంబానీ వద్ద ఈ తరహా ఔడీ కారుందంటూ వైరల్ అవుతున్న వార్తలన్నీ వదంతులే : నిపుణులు

'కారు కొన్నాం'.. అని ఎవరైనా చెప్పగానే సహజంగా అందరూ అడిగేది.. 'కార్ కలర్ ఏంటి?' అని! కారు రంగుకు అంత ప్రత్యేకత ఉంటుంది. కంటికి ఆహ్లాదకరంగా కనిపించడానికే కాదు.. గుర్తింపునకు కారు రంగు ఉపయోగపడుతుంది. ఏదైనా నేరం జరిగినప్పుడు.. నేరగాళ్లు వాడే వాహనం (కారు/వ్యాన్.. ఇలా ఏదైనా) రంగు దర్యాప్తు సంస్థలకు కీలకంగా మారుతుంది. అందుకే కారు రిజిస్ట్రేషన్ సందర్భంగా తప్పనిసరిగా కారు రంగును పేర్కొంటారు. అంత కీలకమైన కారు రంగు.. ఎప్పుడు పడితే అప్పుడు, ఎలా కావాలంటే అలా మారిపోతే? వినడానికే చాలా ఉత్సాహంగా ఉన్న ఈ ఆలోచన కార్ల తయారీదారులు, వినియోగదారులకు చాలా కాలంగానే ఉంది. రిలయన్స్ చీఫ్ ముకేశ్ అంబానీ భార్య నీతా వద్ద రంగులు మార్చే సత్తా ఉన్న ఔడీ-ఏ9 కారు ఉందని.. దాని విలువ రూ.100 కోట్లని.. ప్రపంచం మొత్తమ్మీదా ఇలాంటి కార్లు 11 మాత్రమే ఉన్నాయని.. వాటిలో ఒకటి నీతా వద్ద ఉందన్న వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కానీ.. అది వదంతి మాత్రమేనని, అందులో నిజంలేదని ఆటోమొబైల్‌రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ డిజైన్‌ను 2010లో స్పెయిన్‌కు చెందిన డేనియల్ గ్రేసియా అనే డిజైనర్ ప్రతిపాదించాడని వారు తెలిపారు. ఆయన ప్రతిపాదనకు, ఔడీ సంస్థకు ఎలాంటి సంబంధమూలేదని.. అలాంటి ఒక ప్రసిద్ధ కంపెనీ పేరుతో ఈ ఆలోచనను మార్కెట్లోకి తీసుకెళ్తే ఎక్కువ ప్రచారం లభిస్తుందనే ఉద్దేశంతోనే అలా చేశారని సమాచారం. అప్పట్నుంచీ ఇది అడపాదడపా వార్తల్లో కనిపిస్తూనే ఉంది. డేవిడ్ గ్రేషియా ప్రతిపాదన అప్పట్నుంచీ కాన్సెప్ట్ దశలోనే ఉంది తప్ప.. వాస్తవరూపం దాల్చలేదు. ఆయన ప్రతిపాదన ప్రకారం నానో టెక్నాలజీ సాయంతో కారు రంగులు మారేలా చేయొచ్చు. కానీ అది ఖర్చుతో కూడుకున్న పని కావడం, ఔడీ సంస్థకు ఆయనకు ఏ సంబంధమూ లేకపోవడంతో ఆ ప్రాజెక్టు అసలు పట్టాలే ఎక్కలేదు.

ఆటోమొబైల్ పరిశ్రమలో సాంకేతికత ఎప్పటికప్పుడు మారుతూ వస్తోంది. మారనిదల్లా కార్లకు వేస్తున్న రంగులు మాత్రమే. రంగుల టెక్నాలజీలో మార్పులు వచ్చాయిగానీ.. ప్రాథమికంగా చాలా కార్లు తెలుపు, నలుపు, బూడిద, నీలం, ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లోనే కనిపిస్తాయి. కొన్ని మాత్రమే వీటికి భిన్నమైన రంగుల్లో కనిపిస్తాయి. ఒకే రంగు కాకుండా కావాలనుకున్నప్పుడు కావాలనుకునే రంగులోకి మారే కార్ల తయారీపై ఉత్పత్తి సంస్థలకు చాలాకాలంగా ఆసక్తి ఉంది. ఈక్రమంలోనే బీఎండబ్ల్యూ, లెక్సస్, ఫోర్డ్, నిస్సాన్ వంటి కార్ల కంపెనీలు పలు ప్రయోగాలు చేశాయి. ఈ-ఇంక్ టెక్నాలజీ, కెమెలియన్ ర్యాప్, కెమెలియన్, టెంపరేచర్ సెన్సిటివ్ పెయింట్‌వంటి పరిజ్ఞానాలతో కార్ల రంగులు మార్చే ప్రయత్నాలు చేశాయి.

ఈ-ఇంక్ టెక్నాలజీ: బీఎండబ్ల్యూ 2022లో జరిగిన కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో (సీఎస్ఈ)లో తొలిసారి ఒక కలర్ చేజింగ్ కార్‌ను ప్రదర్శనకు పెట్టింది. ఇంద్రధనుస్సులో ఉండే అన్ని రంగులూ కనిపించే కారు కాదది. కేవలం నలుపు, తెలుపు, బూడిదరంగుల్లోని రకరకాల షేడ్స్‌లోకి మారుతుందది. ఎలక్ట్రో ఫోరేటిక్ ఇంక్ (ఈ-ఇంక్) ప్యానెల్స్ ద్వారా ఆ కారు రంగులు మారుస్తుంది. దీన్ని మరింత ఆధునీకరించి.. నలుపు, తెలుపు, బూడిదరంగుల్లోని 32 షేడ్స్‌లోకి మారేలా చేశారు. 2023 సీఈఎస్‌లో దాన్ని 'బీఎండబ్ల్యూ ఐ విజన్ డీ' పేరుతో ప్రదర్శించారు. ఈ రెండు కార్లూ ఇంకా ప్రోటోటైప్ దశలోనే ఉన్నాయి. మార్కెట్లోకి రాలేదు.

కెమెలియన్ ర్యాప్: కారుపై పెయింట్‌కు బదులు పల్చటి, బలమైన వినైల్ షీట్‌ను అతికిస్తారు. ఆ షీట్‌లో కలర్ షిఫ్ట్ పిగ్మెంట్లు ఉండటం వల్ల కారును మనం ఒక్కో కోణంలో చూస్తే ఒక్కో రంగులో కనిపిస్తుంది. 2010-2012 మధ్య లెక్సస్ తయారుచేసిన ఎల్ఎఫ్ఏ మోడల్ కార్లను కొన్న సంపన్నులు.. వినైల్ షీట్లను అతికించి హల్‌చల్ చేశారు. 2012 తర్వాత ఈ మోడల్ కార్ల తయారీని లెక్సస్ నిలిపేసింది.

కెమెలియన్ పెయింట్ : నిస్సాన్ 'కెమెలియన్ పెయింట్'పై ప్రయోగాలు చేసింది. ఇందులో భాగంగా వాడే 'ఎలక్ట్రోక్రోమిక్ పెయింట్'లోని మాలిక్యూల్స్ రంగు.. ఓల్టేజ్‌ను బట్టి మారుతుంది. కారులోని డ్రైవర్ చిన్న బటన్ నొక్కి ఓల్టేజీలో మార్పులతో కారు కలర్ మారేలా చేయొచ్చు. కారును పగలు తెల్లగా.. రాత్రిపూట నల్లగా మార్చుకోవచ్చు. కానీ, ఇదింకా పరిశోధన దశలోనే ఉంది.

టెంపరేచర్ సెన్సిటివ్ పెయింట్

అమెరికాకు చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోర్డ్.. టెంపరేచర్ సెన్సిటివ్ (థెర్మోక్రోమిక్) పెయింట్‌పై విస్తృత పరిశోధనలు చేసింది. ఈ పెయింట్ వేసిన కారు వేడి తగిలితే ఒక రంగులోకి, చల్లగా ఉన్నప్పుడు మరో రంగులోకి మారిపోతుంది (ఫోర్డ్ ఒక డెమోలో భాగంగా.. కారుపై వేడినీరు పోసినప్పుడు బాడీ కలర్ మారింది). కానీ ఇది కాన్సెప్ట్ దశలోనే ఆగిపోయింది. కారుపై ఈ పెయింట్ వేస్తే వాతావరణ ప్రభావానికి సులభంగా దెబ్బతింటుంది. మన్నిక తక్కువ. నిర్వహణ ఖర్చు ఎక్కువ. అందుకే దీని ఉత్పత్తి ప్రారంభించలేదు.

చివరాఖరు: నీతాఅంబానీ వద్ద రంగులు మార్చే రూ.100కోట్ల కారు లేదుగానీ.. ఆమె వాడే అత్యంత ఖరీదైన కారు.. 'రోల్స్‌రాయిస్ ఫాంట్ 8 ఈడబ్ల్యూబ' మోడల్. అది బేసిక్ మోడలే రూ.12కోట్ల దాకా ఉంటుందని అంచనా. దానికి నీతా కోరిన మరిన్ని హంగులతో అందించేందుకు ఇంకా భారీగానే ఖర్చై ఉంటుందని చెబుతారు.

- సెంట్రల్ డెస్క్

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

బ్యాచిలర్ పెళ్లి కష్టాలు



నారా రోహిత్ కథానాయకుడిగా నూతన దర్శకుడు వెంకటేశ్ నిమ్మలపూడి తెరకెక్కించిన చిత్రం 'సుందరకాండ'. సందీప్ పిక్చర్ ప్యాలెస్ బేనర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మించారు. సినిమా ఈనెల 27న విడుదలవుతోంది. ఇప్పటికే రిలీజైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలు పెంచాయి. తాజాగా చిత్ర ట్రైలర్‌ను హీరో ప్రభాస్ లాంచ్ చేశారు. హీరో పెళ్లి కష్టాలు ప్రధానంగా తీర్చిదిద్దిన ట్రైలర్ నవ్వులు పూయించింది. ఓ మధ్య తరగతి బ్యాచిలర్ తనకు కాబోయే భాగస్వామిలో ఐదు మంచి లక్షణాలను వెతకడం చుట్టూ కథ సాగుతుంది. నారా రోహిత్ కామెడీ టైమింగ్ అదిరిపోయింది. ఆయనకు తోడు నరేశ్, సత్య, వీటీవీ గణేశ్, అభినవ్ గోమటం తెరపై వినోదాన్ని పుష్కలంగా పండించారు. ఈ చిత్రానికి డీవోపీ: ప్రదీప్ ఎం వర్మ, సంగీతం: లియోన్ జేమ్స్.

అణ్వాయుధం కన్నా ప్రమాదకరం



-ఆర్. నారాయణమూర్తి

అణ్వాయుధాలతో దాడికన్నా పరీక్షల్లో కాపీయింగ్ మన దేశానికి అత్యంత ప్రమాదకరమని ఆర్. నారాయణమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలకు చదువును ఆస్తిగా ఇవ్వడానికి తల్లిదండ్రులు సర్వస్వాన్ని విద్యాలయాల ఫీజులకే ధారపోస్తున్న దయనీయ స్థితి ఒకవైపు, పేపర్‌లీకేజీలు మరొకవైపు, ప్రైవేటు విద్యా సంస్థల మాఫియా ఇంకోవైపు... ఈ సమస్యలపై తాను ఓ సామాజిక సైనికుడిగా స్పందించి 'యూనివర్సిటీ-పేపర్‌లీకేజీ' సినిమా తీసినట్లు నారాయణమూర్తి వెల్లడించారు. విద్య, వైద్యరంగాలను జాతీయం చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రులు, విద్యా సంస్థలను బలోపేతం చేయాలన్న డిమాండ్‌ను ఈ సినిమా బలపరుస్తుందని వివరించారు. ఇదే సినిమాకు మద్దతుగా సోమవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కాశీమ్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో సినిమా భావజాలాన్ని సమాజంలోకి తీసుకెళుతున్న ప్రజానటుడు నారాయణమూర్తి అని వక్తలు కొనియాడారు.

పల్లె అందాలతో కన్యాకుమారి




దర్శకరత్న దాసరి నారాయణరావు 1977లో 'కన్య-కుమారి' పేరుతో ఓ చిత్రం రూపొందించారు. అందులో కన్యగా జయమాలిని, కుమారిగా శ్రీవిద్య నటించారు. నాటి ప్రేక్షకులను ఆ చిత్రం ఆకట్టుకుంది. చాన్నాళ్ల తర్వాత ఇప్పుడు అదే టైటిల్‌తో మరో సినిమా వస్తోంది. నటి మధుశాలిని ఈ చిత్రానికి సమర్పకురాలు కావడం విశేషం. గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ నటించిన ఈ చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో సృజన్ అట్టాడ నిర్మించారు. ఈ నెల 27న వినాయకచవితి సందర్భంగా 'కన్యాకుమారి' చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. 'అన్ ఆర్గానిక్ ప్రేమ కథ' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా టీజర్ ఇప్పటికే ఆకట్టుకుంది. శ్రీకాకుళం బ్యాక్‌డ్రాప్‌లో పల్లె అందాలు, ఆకట్టుకునే ప్రేమ కథతో ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతి కలిగిస్తుందని దర్శక నిర్మాత చెప్పారు.

నాకంటూ ఓ చరిత్ర ఉంది..



రవితేజ కథానాయకుడిగా భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మాస్ జాతర'. శ్రీలీల కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. సినిమా ఈనెల 27న విడుదలవుతోంది. ఇప్పటికే రిలీజైన గ్లింప్స్, పాటలు ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి టీజర్ విడుదలైంది. రవితేజ పోలీస్ పాత్రలో 'నాకంటూ ఓ చరిత్ర ఉంది'.. అంటూ మాస్ డైలాగులతో అదరగొట్టారు. మాస్ ప్రేక్షకులు మెచ్చే అంశాలతో పాటు వినోదాన్ని మేళవిస్తూ టీజర్‌ను మలిచిన తీరు ఆకట్టుకుంది. శ్రీలీల మరోసారి బలమైన పాత్రలో మెరిసిపోయారు. టీజర్‌లో రవితేజ, శ్రీలీల జోడీ మరోసారి మాయచేసింది.

విచ్చుకత్తుల మధ్య ఒకే ఒక్కడు



నాని హీరోగా నటిస్తున్న యాక్షన్ మూవీ 'ద ప్యారడైజ్'. తను ఇంతకుముందెన్నడూ చేయని పాత్రను ఇందులో నాని పోషిస్తున్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చెరుకూరి సుధాకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'స్పార్క్ ఆఫ్ ప్యారడైజ్' పేరుతో సోమవారం గ్లింప్స్ విడుదల చేశారు. జైలు బ్యాక్ డ్రాప్‌లో సాగే 'స్పార్క్ ఆఫ్ ప్యారడైజ్' వీడియోలో రామోజీ ఫిల్మ్ సిటీలో 15 రోజుల పాటు షూట్ చేసిన పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్ గ్లింప్స్ కనిపించాయి. కత్తులు పట్టుకున్న ఖైదీలు చుట్టుముట్టినప్పటికీ నాని చేతిలో ఎటువంటి ఆయుధం లేకుండా సీట్లో కూర్చుని వారికి సవాల్ విసరడం ఆసక్తికరం. బలమైన క్యారెక్టర్స్ కలిగిన కథతో, అద్భుతమైన విజువల్స్‌తో రూపుదిద్దుకుంటున్న 'ద ప్యారడైజ్' చిత్రం 2026 మార్చి 26న విడుదల కానుంది. మొత్తం ఎనిమిది భాషల్లో చాలా గ్రాండ్‌గా చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు.

ఎనిమిది పాత్రలతో సైఫై యాక్షన్ థ్రిల్లర్



సీనియర్ నటుడు మురళీమోహన్ ప్రధాన పాత్ర పోషిస్తున్న 'సుప్రీమ్ వారియర్స్' చిత్రం షూటింగ్ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హరిచందన్ దర్శకత్వంలో పెదపూడి బాబూరావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇందులో ఓ కీలక పాత్ర కూడా పోషిస్తున్నారు. ముహూర్తపు షాట్‌కు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, దర్శకుడు దవళ సత్యం, మురళీమోహన్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ 'ఎన్నారై అయిన బాబూరావు సినిమాల మీద ప్యాషన్‌తో ఇండస్ట్రీలోకి వచ్చారు. ఇందులో నటుడిగానూ ఆకట్టుకోబోతున్నారు. ఆయన విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు. నిర్మాత బాబూరావు మాట్లాడుతూ 'రెండేళ్ల నుంచి ఈ కథ మీద వర్క్ చేస్తున్నాం. సైఫై యాక్షన్ థ్రిల్లర్‌గా చిత్రం రూపుదిద్దుకుంటుంది. పేరున్న హీరోలు ఇందులో నటిస్తారు. అందరినీ ఆశ్చర్యపరిచేలా ఈ సినిమా ఉంటుంది' అన్నారు. 'ఎనిమిది పాత్రల చుట్టూ తిరిగే కథ ఇది. మిలటరీ, ఆర్మీకుటుంబాల ఎమోషన్స్ ఎక్కువగా ఉంటాయి. రెండున్నర ఏళ్లుగా స్క్రిప్ట్ మీద పని చేస్తున్నాం' అని చెప్పారు దర్శకుడు హరిచందన్.

నేటితో సమ్మెకు ముగింపు?

తెలుగు చిత్ర పరిశ్రమలో సోమవారం పూర్తిస్థాయి బంద్ జరిగింది. ఇప్పటి వరకు 30 శాతం వేతనాలు పెంచుతామన్న నిర్మాతల షూటింగ్‌లు జరగగా. సోమవారం నుంచి అవి కూడా నిలిచిపోయాయి. కాగా, కొందరు నిర్మాతలు ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్‌ను కలిశారు. మరోవైపు హైదరాబాద్‌లో తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రితో ఫెడరేషన్ సభ్యులు సమావేశమయ్యారు.

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

సమస్యల పరిష్కారానికి కమిటీ



సినిమా కార్మికుల సమస్యల పరిష్కారానికి ఒక కమిటీని ఏర్పాటుచేయనున్నామని, ఈ కమిటీ అన్ని పక్షాలతో, అందరితో చర్చించేలా చర్యలు తీసుకుంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం సచివాలయంలో నిర్మాతలు, కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సినీ కార్మికుల సమ్మెతో షూటింగ్‌లు నిలిచిపోయాయని, సమస్యల పరిష్కారానికి సమ్మె సరైన మార్గంకాదని సూచించారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం నుంచి షూటింగ్స్ పునఃప్రారంభమవుతాయంటూ ఆశాభావం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉందని, అదే సమయంలో పరిశ్రమలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఆలోచనలో ఉందన్నారు. సమావేశంలో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు, హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా పాల్గొన్నారు.

అన్ని వివరాలు మంత్రికి చెప్పాం: ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులు

తమ సమస్యలు, పరిష్కారానికి సంబంధించిన విషయాలను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వివరించామని ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులు తెలిపారు. మంగళవారం భేటీలో అంతిమ నిర్ణయం వెలువడుతుందన్నారు. సమావేశానికి మంత్రి కోమటిరెడ్డి వస్తానని చెప్పారని అన్నారు. తమ తరపున కమిటీ సభ్యులు హాజరవుతారని చెప్పారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

త్వరలో నూతన ఫిల్మ్ పాలసీ



రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం త్వరలో నూతన ఫిల్మ్ పాలసీని తెస్తున్నామని పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు. ఈ ఏడాది నంది అవార్డులిస్తామని ప్రకటించారు. సోమవారం అమరావతి సచివాలయంలో పలువురు తెలుగు సినీ నిర్మాతలు ఆయనతో భేటీ అయ్యారు. సినిమా రంగ సమస్యలపై రూపొందించిన డాక్యుమెంట్‌ను మంత్రికి అందజేశారు. సినీ పరిశ్రమకు సంబంధించిన 24 విభాగాల అభివృద్ధిపై చర్చించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. వారిద్దరి అపాయింట్‌మెంట్లు ఇప్పించాలని కోరుతూ తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్, గౌరవ కార్యదర్శి దామోదర ప్రసాద్ మంత్రికి విజ్ఞాపన అందజేశారు. రాష్ట్రంలో సినిమా షూటింగులు, కొత్త సినిమాల విడుదల, నూతన ఫిల్మ్ పాలసీ తదితర అంశాలపై నిర్మాతలతో మంత్రి చర్చించారు. సెప్టెంబరు మొదటి పక్షంలో సీఎం, డిప్యూటీ సీఎంతో సమావేశం ఏర్పాటు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

అమరావతి (ఆంధ్రజ్యోతి)

నిర్మాతలెవరూ సంతోషంగా లేరు



నిర్మాతలెవరూ సంతోషంగా లేరని, తాము బాగుంటేనే ఇండస్ట్రీ బాగుంటుందని అన్నారు పలువురు చిన్న నిర్మాతలు. సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో నిర్మాతలు ఎస్‌కేఎన్, ధీరజ్, రాజేశ్ దండా, ప్రైమ్‌షో చైతన్య, ఛాయ్ బిస్కట్ శరత్, అనురాగ్, మధుర శ్రీధర్, మహేశ్వర్‌రెడ్డి, రాకేశ్ వర్రె తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేశ్ దండా మాట్లాడుతూ 'చిన్న నిర్మాతలు బాగుంటేనే ఇండస్ట్రీ బాగుంటుంది. ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్న మాకు వేతనాలు పెంచాలంటూ కార్మికులు చేస్తున్న సమ్మె మరింత ఇబ్బందుల్లోకి నెట్టింది. మా సినిమా దీపావళికి విడుదల చేయాలనుకున్నాం. ఇప్పుడు బంద్ వల్ల షూటింగ్ ఆపేయాల్సి వచ్చింది' అని అన్నారు. మధుర శ్రీధర్ మాట్లాడుతూ 'ఒక సీన్ చిత్రీకరణకు జనరేటర్ పెట్టాలన్నా యూనియన్ అనుమతి కావాలి. హీరో, ఫ్రెండ్ సీన్ కోసం మేకప్, కాస్ట్యూమ్స్, వాళ్లకు వడ్డించే ప్రొడక్షన్... ఇలా 80 మందిని పెట్టుకోవాలి. చిన్న నిర్మాతలకు ఇది పెనుభారం' అని అన్నారు.

● భర్తను పోగొట్టుకున్నా

'కుటుంబ సభ్యులు, బంధువులు, తెలిసినవాళ్లు నాసిరకం మద్యం తాగొద్దని ఎంత చెప్పినా నా భర్త వినలేదు. అనారోగ్యం పాలై మరణించాడు. నాసిరకం మద్యం కారణంగానే నా భర్తను పోగొట్టుకున్నా' అని తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ గొల్లపల్లికి చెందిన సుజాత ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె భర్త మునిచంద్ర (46) గతంలో టైలర్‌గా పనిచేసేవాడు. కుమార్తె, కుమారుడు ఉన్నారు. టైలరింగ్‌లో గిరాకీలు తగ్గిపోవడంతో కూలి పనులకు వెళ్లేవాడు. ఆ క్రమంలో మద్యానికి అలవాటు పడ్డాడు. రెండేళ్ల కిందట ఆరోగ్యం దెబ్బతింది. ఆస్పత్రిలో చూపిస్తే లివర్ పాడైందని చెప్పారు. అప్పులు చేసి రూ.6 లక్షల వరకు ఖర్చు పెట్టి వైద్యం చేయించినా ఫలితం లేకుండాపోయింది. ఈ ఏడాది జూన్ 2న మృతిచెందాడు. ఇప్పుడు అప్పులు మిగిలాయి. కూతురిని, కొడుకును బంధువులు చదివిస్తున్నారు. ఇటీవలి దాకా ఉపాధి పనులకు వెళ్లిన సుజాత తాజాగా ఓ ఆస్పత్రిలో హౌస్ కీపింగ్ పనికి కుదిరింది. అప్పులకు వడ్డీలు కట్టడమే కష్టంగా ఉందని వాపోయింది.


కొడుకుతో మునిచంద్ర భార్య సుజాత

● భార్య కూలి పనులకు...

అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలానికి చెందిన ఈయన పేరు పసుపులేటి సుబ్రమణ్యం(50). గత వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం మద్యం తాగి అనారోగ్యానికి గురయ్యాడు. లివర్ పాడైపోయి, కళ్లు కనిపించకుండా పోవడం, కాలు సమస్యలు వంటివి వచ్చాయి. ఉన్న ఆస్తి అమ్మి దాదాపు రూ.10 లక్షలు వైద్యానికి ఖర్చు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయినా అతని ఆరోగ్యం బాగుకాలేదు. ఎటువంటి పని చేయలేని పరిస్థితి. ప్రస్తుతం అతని భార్య సుభాషిణి కూలి పనులకు వెళ్తూ భర్తను పోషిస్తోంది.



ఇంటి పెద్దను కోల్పోయి...

విజయనగరం జిల్లా గజపతినగరం పట్టణానికి చెందిన అప్పలస్వామి అనే వ్యక్తి తాపీ పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఇతనికి మద్యం సేవించే అలవాటు ఉండేది. నాసిరకం మద్యం తాగొద్దని భార్య కుమారి ఎంత చెప్పినా వినలేదు. దీంతో అప్పలస్వామి అనారోగ్యం పాలయ్యాడు. విజయనగరంలోని ఓ ఆసుపత్రికి తీసుకురాగా... అప్పలస్వామి లివర్ డ్యామేజి అయినట్లు వైద్యులు చెప్పారు. ఆరు నెలలు గడిచిన తరువాత 2024 ఆగస్టులో అప్పలస్వామి మృతి చెందాడు. అప్పలస్వామికి ఓ కూతురు ఉంది. ఇంటి పెద్దను కోల్పోవటంతో ఆ కుటుంబం రోడ్డున పడింది.

అవయవాలన్నీ పాడైపోయి..

విశాఖపట్నంలో రుషికొండ బీచ్‌కు వెళ్లే మార్గంలో ఓ గ్రామానికి చెందిన 35 ఏళ్ల టాక్సీ డ్రైవర్ మద్యం కారణంగా అవయవాలన్నీ డ్యామేజీ అయి చనిపోయాడు. ఆయనకు భార్య ఉంది. పిల్లలు లేరు. ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పనిచేసేవాడు. నాసిరకం మద్యం తాగి రెండేళ్లు బాగా ఇబ్బంది పడ్డాడు. ఆస్పత్రిలో చేర్చగా మొదట లివర్, ఆ తరువాత కిడ్నీలు.. ఇలా ఒక్కో అవయవం పాడై ఏడాది క్రితం మరణించాడు. మాయదారి మందే తన భర్త ప్రాణాలు తీసిందని, ఏ దిక్కు లేకుండా పోయిందని భార్య వాపోతోంది.

మద్యం కాదు.. 'విషం' అమ్మారు!

ప్రాణాలు తోడేశారు



మందు కాదు.. విషం..

చీప్ లిక్కర్ కొత్తేమీ కాదు.. అయితే జగన్ సర్కారులో ప్రమాదకరమైన నాసిరకం మద్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. మలినాలు, ప్రమాదకర పదార్థాలున్న స్పిరిట్‌తో నాసిరకం జేబ్రాండ్లు తయారు చేసి అమ్మించారు. ఈ మద్యం స్లో పాయిజన్ లాంటిది. నాడు ప్రభుత్వ పెద్దలు వేల కోట్లు దోచుకోవడానికి వేలాదిమంది పేదలను బలి చేశారు. నాసిరకం మద్యంతో చనిపోయినవారి కుటుంబ సభ్యులు చాలా మంది పరువు పోతుందని బయటకు చెప్పడానికి ఇష్టపడటం లేదు.

ఐదు పదులు దాటకనే భర్తను కోల్పోయిన భార్య.. చిన్న వయసులోనే కొడుకును పోగొట్టుకున్న తల్లిదండ్రులు.. గత ఐదేళ్లలో మద్యం మహమ్మారికి ఇలా ఛిన్నాభిన్నమైన కుటుంబాలు రాష్ట్రంలో వేల సంఖ్య ఉన్నాయి. నాడు జగన్ ప్రభుత్వంలో కాసులకు కక్కుర్తిపడి నాసిరకం జే బ్రాండ్లు అమ్మిన పాప ఫలితాన్ని అమాయకులు అనుభవిస్తున్నారు. ఎందరో మహిళలు, పిల్లలు, వృద్ధులు రోడ్డునపడ్డారు.

నాసిరకం మద్యంతాగి తీవ్ర అనారోగ్యంపాలైన వారిని కాపాడుకునేందుకు ఎందరో లక్షల్లో అప్పులు చేశారు. లివర్, కిడ్నీలు పాడైపోవడంతో ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ఫలితం దక్కలేదు. చివరకు ఇంటి పెద్ద దిక్కును కోల్పోగా.. వైద్యం కోసం చేసిన అప్పులే మిగిలాయి. ఎన్నడూ గడప దాటని మహిళలు కూడా కుటుంబ పోషణకు కోసం కూలి పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

నాసిరకం మద్యం తాగి ఎందరో ప్రాణాలు కోల్పోతే.. చాలామంది తీవ్ర అనారోగ్యం పాలై ఇప్పటికీ మంచానికే పరిమితమయ్యారు. లివర్ పాడై ఒంట్లో నీరు చేరడం, పక్షవాతం, కిడ్నీలు పాడైపోవడం వంటి జబ్బులతో లేవలేని పరిస్థితిలో ఉన్నారు. మహిళలు, పిల్లలు కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటూ.. జీవచ్ఛవాలుగా ఉన్న బాధితులను చూసుకోవాల్సిన దయనీయ పరిస్థితి.

(మొదటి పేజీ తరువాయి)

కాలేయం, నరాలు, కిడ్నీ వ్యాధులు రెట్టింపయ్యాయి. వేలాది కుటుంబాలు ఆర్థికంగా, అనారోగ్యపరంగా చితికిపోయాయి. అందులోనూ కుటుంబ బాధ్యత మోసే మధ్య వయస్కులే ఎక్కువ మంది ఈ వ్యాధుల బారిన పడ్డారు. దీంతో ఆ కుటుంబాలు ఛిన్నాభిన్నమయ్యాయి. మద్యం తయారీలో ఉపయోగించిన ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కాహాల్(ఈఎన్ఏ) నాసిరకంగా ఉండటమే వినియోగదారులు రోగాల బారిన పడటానికి ప్రధాన కారణం. సుదీర్ఘకాలం నుంచి మార్కెట్‌లో ఉన్న అంతర్జాతీయ, జాతీయ పాపులర్ బ్రాండ్లు నాణ్యత విషయంలో రాజీపడవు. ఎందుకంటే.. ఆ బ్రాండ్లు క్రెడిబిలిటీ ఆధారంగా మద్యం వ్యాపారంలో ఉన్నాయి. కానీ వైసీపీ హయాంలో తీసుకొచ్చిన జే బ్రాండ్లు ఇవేం పట్టించుకోలేదు. తక్కువ ఖర్చుతో ఎక్కువ సొమ్ము రాబట్టుకోవాలనే కక్కుర్తితో 'నాణ్యత'ను పూర్తిగా మరిచిపోయాయి. జే బ్రాండ్లలో ఈఎన్ఏ స్థాయి వరకు శుద్ధిచేయని స్పిరిట్ తోనే మద్యం తయారు చేశారు. దానివల్ల ఆ స్పిరిట్‌లో మలినాలు, ఇతర ప్రమాదకర పదార్థాలు మిగిలిపోయి, తాగినవారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపింది. ఇదే విషయాన్ని అప్పట్లో చెన్నైలోని ఎస్‌జీఎస్ ల్యాబ్ ధ్రువీకరించింది. కానీ అధికార బలంతో ఆ నివేదికను అప్పట్లో తొక్కిపెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారు. మద్యపాన నిషేధం చేస్తామని అధికారంలోకి వచ్చిన జగన్ దోపిడీ వనరుగా మార్చారు. మద్యం ధరలను రెట్టింపు చేసి పేదలు, దినసరి కూలీలు, సామాన్యుల నుంచి వేలకోట్లు దోచుకున్నారు. గత ప్రభుత్వంలో మద్యం స్కామ్‌లో 3500 కోట్లు దోచుకున్నట్టు సిట్ తేల్చిన సంగతి తెలిసిందే. ఇందులో జగన్‌కు వాటాలు వెళ్లినట్టు చార్జిషీట్‌లో పేర్కొంది. మద్యం స్కామ్‌పై సిట్ విచారణ జరుపుతోంది. నాడు ముడుపుల కోసం నాసిరకం మద్యం విక్రయించి ఎందరో జీవితాలను నాశనం చేశారు.

కుటుంబం ఛిన్నాభిన్నం

పశ్చిమగోదావరి జిల్లా తణుకు సమీపంలోని రేలంగి గ్రామంలో ప్రకాశం దంపతులు కష్టపడి కుటుంబాన్ని పోషించుకునేవారు. ఇద్దరు పిల్లలను చదివించుకునేవారు. కరోనా సమయంలో నాసిరకం మద్యాన్ని సేవించిన ప్రకాశం ఆరోగ్యం క్షీణించింది. పక్షవాతం వచ్చినట్టుగా ఒక వైపు కాళ్లు, చేతులు పనిచేయడం లేదు. ఇప్పుడు మంచానికే ప్రకాశం పరిమితమయ్యాడు. అంతకు ముందు ఆయన ఓ రైసు మిల్లు కార్మికుడిగా పనిచేసేవాడు. ఇప్పుడు కుటుంట పోషణ భారంగా మారడంతో ప్రకాశం భార్య సునీత దుబాయ్ వెళ్లింది. గల్ఫ్ దేశంలో కష్టపడుతూ సొంతూరులో ఉన్న భర్తను పోషించుకుంటోంది. ఇద్దరు కుమారుల్లో ఒక బ్బాయి ప్రభుత్వ స్కూల్‌కు వెళుతున్నాడు. మరో కొడుకు కూలి పనులకు వెళుతూ తండ్రిని చూసుకుంటున్నాడు.


మంచానికే పరిమితమైన దేవళ్ల వెంకటేశ్వర్లు

రక్తం అంతా నీరు

పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన దేవళ్ల వెంకటేశ్వర్లు కొన్నేళ్లుగా మద్యం తాగేవాడు. గత ప్రభుత్వ హయాంలో జే బ్రాండ్లు తాగి తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఏడాది క్రితం కదలలేని స్థితిలో ఉన్న వెంకటేశ్వర్లును గుంటూరు జీజీహెచ్‌కి తీసుకెళ్లగా.. కిడ్నీ, లివర్ పాడయ్యాయని వైద్యులు గుర్తించారు. దేహంలో రక్తం బదులు చెడునీరు నిండటంతో కాళ్లు సన్నబడి నిలబడలేని స్థితిలో ఉన్నాడు. ప్రస్తుతం మంచానికే పరిమితం కావడంతో భార్య, పిల్లలు సపర్యలు చేస్తున్నారు.

మద్యం ఎలా తయారు చేయాలి..
జగన్ ప్రభుత్వంలో ఎలా తయారు చేశారు?
- రేపటి సంచికలో ప్రత్యేక కథనం..

వైసీపీ ప్రభుత్వం పొట్టన పెట్టుకుంది



వైసీపీ పాలనలో నాణ్యత లేని మద్యం తాగి మా కుమారుడు భక్తుల హరి చనిపోయాడు. మాకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు. కుమారుడు హరి (37) తాడిపత్రి ట్రాన్స్‌కో కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో లైన్‌మన్‌గా పనిచేసేవాడు. మమ్మల్ని పోషిస్తాడని ఆశలు పెట్టుకున్నాం. పెళ్లి చేయాలని సంబంధాలు చూసే సమయంలో లివర్ వ్యాధికి గురై చనిపోయాడు. ఇందుకు నాణ్యతలేని మద్యమే కారణం. గత వైసీపీ ప్రభుత్వం మా కుమారుడిని పొట్టన పెట్టుకుంది. మేం తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా టీ స్టాల్, టిఫిన్ సెంటర్‌ను నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాం. కూటమి ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

- భక్తుల రమణ, రమాదేవి, తాడిపత్రి

ఏ పనీ చేయలేకపోతున్నా..

నేను ఆటో డ్రైవర్‌ను. నాకు పదేళ్ల నుంచి మద్యం తాగే అలవాటు ఉంది. 2022లో అకస్మాత్తుగా తీవ్రంగా కడుపునొప్పి వచ్చింది. జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలకు తీసుకెళ్లారు. పెద్దపేగుకు పాంక్రియాస్ వ్యాధి సోకిందని తేల్చారు. అప్పటి నుంచి ఆరోగ్యంలో తేడా వచ్చింది. ఏలూరు, గుంటూరు, విజయవాడలో చూపించుకున్నా ప్రయోజనం లేదు. వైద్య ఖర్చుల కోసం రూ.3 లక్షల వరకు అప్పులు చేశాం. రెండు ఆటోలను ఫైనాన్స్ వ్యాపారులు తీసేసుకున్నారు. ఐదేళ్ల నుంచి ఏ పనీ చేయలేకపోతున్నాను. అమ్మ నాగమణి, భార్య సత్యవతి కూలి పనులకు వెళ్లి రెక్కలు, ముక్కలు చేసుకుని అప్పులు తీరుస్తున్నారు. వారే నా కుటుంబానికి జీవనాధారం. మాకు ముగ్గురు చిన్న పిల్లలున్నారు. మందులేసుకుంటే గానీ అడుగు తీసి అడుగు వేయలేకపోతున్నాను. నాసిరకం మద్యం తాగడం వల్ల నా ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది.



- జల్లా సురేశ్, పుట్లగట్లగూడెం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా

అప్పులే మిగిలాయి



నా భర్త మాదన్న (43) గత పదేళ్లుగా ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. అప్పుడప్పుడు మద్యం తాగేవాడు. మూడేళ్లుగా నాసిరకం మద్యం తాగి అనారోగ్యంతో గత ఏడాది ఏప్రిల్ నెలలో మృతి చెందాడు. అర ఎకరా పొలం ఉంది. ఇంటి వద్ద చిన్నపాటి కిరాణా దుకాణం నడుపుతూ ఇద్దరు కుమారులను చదివించుకుంటున్నాను. రూ.5 లక్షలకు పైగా అప్పు ఉంది. ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

- నామాల గాయత్రి, తెర్నేకల్, దేవనకొండ మండలం, కర్నూలు జిల్లా



ఒళ్లంతా నీరు పట్టేసి...

తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ నియోజకవర్గం కడియం మండలంలోని కడియపు లంక శివారు బుర్రిలంక గ్రామానికి చెందిన చక్కపల్లి శ్రీను(42) కడియం నర్సరీలో పనిచేసేవాడు. మద్యం అలవాటున్న శ్రీను సంపాదించిన డబ్బుతో కొంతతాగి, మిగతాది ఇంట్లో ఇచ్చేవాడు. వైసీపీ హయాంలో నాసిరకం మందు తాగడంతో క్రమంగా అతని ఆరోగ్యం దెబ్బతింది. లివర్ పాడైపోయి ఒళ్లంతా నీరు పట్టేసింది. అతని కుటుంబ సభ్యులు అప్పులు చేసి బతికించాలని ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఈ ఏడాది జూలై 10వ తేదీ తీవ్ర అనారోగ్యంతో మృతిచెందాడు. అతనికి భార్య, రెండేళ్ల బాబు, ఎనిమిదేళ్ల పాప ఉంది. వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నారు. వీరంతా దిక్కులేని వారైపోయారు.

ఈ తల్లికి ఎంత కష్టం..?



కృష్ణా జిల్లా పెనమలూరు ఎస్టీ కాలనీకి చెందిన బర్మావత్ బాలాజీనాయక్ గతంలో పెనమలూరు గ్రామ సర్పంచ్‌గా సేవలందించారు. ఎంతో మందికి ఆర్థికంగా సాయం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం తాగడం వల్ల తీవ్ర అనారోగ్యం బారిన పడ్డారు. లివర్, కిడ్నీలు చెడిపోయి హృద్రోగంతో బాధపడుతూ ఆయన మృతి చెందారు. ఆయన భార్య పుట్టింటికి వెళ్లిపోగా... ఎన్నడూ గడప దాటి బయటికి రాని తల్లి సీతకు పెద్ద కష్టం వచ్చింది. విజయవాడ నగరానికి వెళ్లి కూలి పనులు చేసుకొని కడుపు నింపుకొంటోంది. ఆమెకు కనీసం పక్కా ఇల్లు కూడా లేదు. ఏదైనా ప్రభుత్వ సాయం అందుతుందేమోనని తెలిసిన వారినల్లా అడుగుతోంది. నాసి రకం మద్యం వల్లే తన బిడ్డ చనిపోయాడని కన్నీరుమున్నీరయ్యింది.

మూలం ఆ ముగ్గురే!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధం ఉన్న వ్యక్తులతో పీఎస్ఆర్ ఆంజనేయులు 65సార్లు మాట్లాడినట్లు నిరూపించే కాల్ డేటాను సేకరించింది. నిందితుల నెంబర్లు, మాట్లాడిన సమయం, తేదీతో సహా వివరించింది. దీపికా బార్ అండ్ రెస్టారెంట్ సెల్ టవర్ పరిధిలో వీరందరి నంబర్లను ట్రేస్ చేసింది. అక్కడ పలుమార్లు గంటల కొద్ది లంచ్ నుంచి డిన్నర్ దాకా సమావేశమైనట్లు కోర్టుకు ఆధారాలు అందజేసింది. వీరి మధ్య నడిచిన ఫోన్‌కాల్స్‌తో పాటు వాట్సాప్ సందేశాలు,ఇతర రికార్డులూ సమర్పించింది.

చర్యలు వద్దంటూ రజత్ భార్గవపై ఒత్తిడి..

రజత్ భార్గవ, వివేక్ యాదవ్‌తోపాటు ఓఎస్‌డీ నాగేశ్వరరావు, వాసుదేవ రెడ్డి 2024 ఫిబ్రవరి 20న సచివాలయంలో సమావేశమయ్యారు. లిక్కర్ వ్యవహారానికి సంబంధించి ఎటువంటి ఆధారాలు ఉంచొద్దని ఆ సమావేశంలో పీఎస్ఆర్ ఆంజనేయులు వారిని అప్రమత్తం చేశారు. అడ్డగోలుగా ఓఎఫ్ఎస్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలకు రజత్ భార్గవ మెమోలు ఇవ్వగా, బాధ్యులపై చర్య తీసుకోవద్దంటూ ధనుంజయ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి ఒత్తిడి చేసినట్లు సిట్ వివరించింది. 2023లో పాత ఓఎఫ్ఎస్‌లు అన్నీ తీసుకొచ్చి ఆ తేదీలతో సంతకాలు చేయాలని తనపై ఒత్తిడి చేయగా, తాను తిరస్కరించానంటూ రజత్ భార్గవ ఇచ్చిన వాంగ్మూలాన్ని సిట్ చార్జిషీట్‌కు జత చేసింది.

ఆస్తులు పోగేశారు..

జగన్‌తో నిరంతరం ఉండే ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డితో పాటు భారతీ సిమెంట్స్‌లో శాశ్వత డైరెక్టర్ జగన్ భార్య భారతికి నమ్మిన బంటు బాలాజీ గోవిందప్ప లిక్కర్ ముడుపుల సొమ్ముతో భారీగా ఆస్తులు కూడబెట్టారంటూ.. అందులో తాము గుర్తించిన కొన్నింటిని సిట్ వివరించింది. కృష్ణమోహన్ రెడ్డి బాన్స్‌వాడలో భార్య చెల్లెలు లక్ష్మీ నిహారిక పేరుతో ఆస్తులు కొన్నారు. కుమారుడు రోహిత్ రెడ్డి పేరుతో నెల్లూరు జిల్లా కోవూరులో ఆస్తులు కొనుగోలు చేశారు. బాలాజీ గోవిందప్ప నైమిషా ఇన్ ఫ్రా ఎల్ఎల్‌పీ పేరుతో 2021లో ఆస్తులు కొన్నారు. భార్య ప్రియా బాలాజీ పేరుతోనూ ఆస్తులు ఉన్నాయని సిట్ తెలిపింది. ఇందుకు సాక్ష్యంగా వారి ఆస్తులకు బినామీ అయిన గన్నాబత్తుల వరప్రసాద్(40శాతం) వాంగ్మూలాన్ని కోర్టుకు చూపించింది. ముడుపుల డబ్బు మొత్తం ఎస్ఎస్ ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్లోనే గోవిందప్ప తీసుకున్నట్లు స్పష్టం చేసింది. అలా తీసుకున్న సొమ్ములో నుంచి మూడుకోట్ల రూపాయలతో కుమారుడు సంజయ్ బాలాజీ, కుమార్తె నికిత బాలాజీ పేర్లతో ఆస్తులు కొన్నట్లు తెలిపింది. భార్య పేరుతో గండిపేట, నార్సింగిలో ఆస్తులు కొనుగోలు చేసినట్లు ఆధారాలు సమర్పించింది. ముఖ్యమంత్రి కార్యాలయంలో 2019 జూన్ నుంచి 2024 మే వరకూ అత్యంత కీలకంగా కె. ధనుంజయ్ రెడ్డి వ్యవహరించారు. ముడుపుల వసూళ్లకు వీలుగా మద్యం పాలసీ రూపకల్పన నుంచి రాజ్ కసిరెడ్డి గ్యాంగ్ వసూలు చేసిన ముడుపులు అంతిమ లబ్ధిదారుకు చేర్చే వరకూ ఆయన ఏమేమి చేశారనేది చార్జిషీట్‌లో వివరించినట్లు తెలిసింది. హైదరాబాద్, తాడేపల్లిలో లిక్కర్ సిండికేట్ నుంచి తీసుకున్న ముడుపుల సొమ్ములో తన వాటా సొమ్మును బినామీల పేర్లతో ఎక్కడెక్కడ ధనుంజయ్‌రెడ్డి పెట్టుబడులు పెట్టారో ఆధారాలతో వివరించినట్లు తెలిసింది. ఇక.. ఏ1 రాజ్ కసిరెడ్డి రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ పరిసరాల్లో 30.25ఎకరాల 11ఆస్తులు కొనుగోలు చేశారు. వీటి విలువ కోట్లాది రూపాయల్లో ఉంటుంది. రాజ్ కసిరెడ్డి తోడల్లుడు ముప్పిడి అవినాశ్ రెడ్డి డిస్టిలరీస్ తరపున ఆర్థిక లావాదేవీలు జరిపారు. 2019 అక్టోబరు 13న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, విజయ సాయిరెడ్డి, రాజ్ కసిరెడ్డి, వాసుదేవ రెడ్డి, సత్య ప్రసాద్ సమావేశం అయ్యారు. అప్పటి సీఎస్ సిఫారసులు దిక్కరించి సత్యప్రసాద్, వాసుదేవ రెడ్డిని దోపిడీకి అనుగుణంగా నియమించిన విషయాన్ని సైతం సిట్ ప్రస్తావించింది. కాగా, వైసీపీ మద్యం కుంభకోణం కేసులో మొత్తం 48మంది నిందితులు కాగా పది మంది వ్యక్తులు, తొమ్మిది సంస్థల పాత్రపై రెండు చార్జిషీట్లలో సిట్ కోర్టుకు వివరించింది. రాజ్ కసిరెడ్డి, మిథున్ రెడ్డి సహా ఇప్పటికే 12మంది అరెస్టై జైల్లో ఉన్నారు.


గుంటూరు జిల్లా తాడేపల్లి లోని జిల్లా పరిషత్ స్థలం

400 కోట్ల భూమి కోసం రెండు శాఖల

సిగపట్లు

తాడేపల్లిలో ఖరీదైన ప్రాంతంలో
24.49 ఎకరాలు

- 150 ఏళ్ల క్రితం లోకల్ బోర్డుకు కేటాయింపు
- కాలక్రమంలో పంచాయతీరాజ్ చేతిలోకి
- నాటి ఉత్తర్వుల్లో 'నిత్య అన్నదాన సత్రం' పదం
- రంగంలోకి దేవదాయ శాఖ.. భూమి తమదేనంటూ నోటీసులు
- 2001లో కోర్టులో కేసు.. నేటికీ తేలలేదు
- ఇదే అదనుగా భూమిలో కబ్జాదారుల పాగా

(గుంటూరు సిటీ-ఆంధ్రజ్యోతి)

భూమి కోసం రెండు శాఖల సిగపట్లు కబ్జాదారులకు కలిసివస్తోంది. గుంటూరు జిల్లా తాడేపల్లిలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో రూ. 400 కోట్లు విలువ చేసే 24.49 ఎకరాల భూమి తమదంటే, తమదంటూ పంచాయతీరాజ్, దేవదాయ శాఖలు కోర్టులో పోరాటం చేస్తున్నాయి. ఇదే అదనుగా ఆక్రమణదారులు ఆ భూమిని కొంచెం కొంచెం కలిపేసుకుంటున్నారు. అయినా కూడా రెండు శాఖలకు అదేమీ పట్టటం లేదు. గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధిలోని సర్వే నంబర్ 63, 74, 75లో 24.49 ఎకరాలు ఉంది. హైవేకు పక్కన ఉండటం, భూమికి దగ్గరలో అపార్టుమెంట్‌లు కూడా కట్టడంతో ఇటీవల ఆ భూమి విలువ బాగా పెరిగింది. ప్రస్తుతం అక్కడ ఎకరం విలువ రూ. 18 కోట్ల నుంచి రూ. 20 కోట్ల వరకు పలుకుతోంది. సదరు భూమిని 1874లో అప్పటి కృష్ణా జిల్లా కలెక్టర్ లోకల్ బోర్డుకు కేటాయించారు. అప్పట్లో గుంటూరు కూడా కృష్ణా జిల్లాలోనే ఉండేది. 1904లో గుంటూరు జిల్లా రూపుదిద్దుకోవటంతో 24.49 ఎకరాల భూమిని లోకల్ బోర్డుకు బదలాయించారు. అప్పటి నుంచి లోకల్ బోర్డు ఆధ్వర్యంలోనే ఆ భూమి ఉంది. దానిని కౌలుకి ఇస్తూ వచ్చిన ఆదాయాన్ని కూడా లోకల్ బోర్డు తీసుకునేది. జిల్లా పరిషత్‌లు ఆవిర్భవించిన తర్వాత తాడేపల్లి భూమి వ్యవహారం అంతా పంచాయతీ రాజ్ అధికారులు చూసుకుంటున్నారు. ఆ భూమిని లోకల్ బోర్డుకు కేటాయించిన ఉత్తర్వుల్లో నిత్య అన్నదాన సత్రం అనే మాట వాడటంతో 2001లో మొట్టమొదటి సారి దేవదాయ శాఖ స్పందించింది. సత్రం అన్న మాట ఉంది కాబట్టి భూమి దేవదాయ శాఖకు చెందుతుంది అంటూ జిల్లా పరిషత్‌కు నోటీసులు ఇవ్వటంతో గొడవ ఆరంభమైంది. భూమి తమకే చెందుతుందని దేవదాయ శాఖ కమిషనర్ కూడా ఆర్డర్ ఇవ్వటంతో జిల్లా పరిషత్ అధికారులు గుంటూరు కోర్టును ఆశ్రయించారు. అక్కడ విచారణ తర్వాత జిల్లా పరిషత్‌కు వ్యతిరేకంగా కోర్టు తీర్పు వచ్చింది. దీంతో 2005లో జిల్లా పరిషత్ హైకోర్టును ఆశ్రయించింది. వంద సంవత్సరాలకు పైబడి తమ అనుభవంలో ఉన్న భూమి తమదే అంటూ జిల్లా పరిషత్ చేసిన వాదనను హైకోర్టు సమర్థించింది. 2015లో జిల్లా పరిషత్‌కు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. ఆ వివాదం ఇంకా కోర్టు పరిధిలో ఉంది. దేవదాయ శాఖ కూడా కేసును విత్‌డ్రా చేసుకోవడానికి ముందుకు రావడంలేదని చెబుతున్నారు. దీంతో కోర్టు చుట్టూ అధికారులు తిరుగుతున్నారు.

ఏటా రూ. 1.20 లక్షలే ఆదాయం!

రెండు ప్రభుత్వ శాఖలు భూమి కోసం కొట్లాడుకొంటూ ఉండటం కొంతమందికి అనుకూలంగా మారింది. వాస్తవంగా ఉండాల్సిన 24.49 ఎకరాల భూమిలో కొంత ఆక్రమణకు గురైనట్లు తెలుస్తోంది. ఉన్న భూమికి కూడా అతి తక్కువ కౌలు చెల్లించి కొందరు నేతలు ఏళ్ల తరబడి అనుభవిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం అంత విస్తీర్ణం ఉన్న భూమికి ఏటా కేవలం రూ. 1.20 లక్షలు మాత్రమే కౌలు వస్తోంది. అంటే ఒక ఎకరాకు ఏటా కేవలం రూ. ఐదు వేలు కౌలు మాత్రమే ఇస్తున్నారు. అదే భూమిలో ప్రభుత్వం నిర్మాణాలు చేపడితే ఏటా కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని అధికారులు అంటున్నారు.

కూటమి వచ్చాక కదలిక..

కూటమి అధికారంలోకి వచ్చిన తరవాత తాడేపల్లి భూమి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి పెట్టింది. జిల్లాకు చెందిన ఓ ముఖ్యనేత సమక్షంలో అధికారులు భేటీ కూడా అయ్యారు. వివాదం విషయాలు తెలుసుకున్న ఆ ముఖ్యనేత త్వరలోనే పరిష్కారం చూపిస్తామని చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఆ భూమిలో రాష్ట్రస్థాయి శిక్షణ కేంద్రం నిర్మించాలని డిప్యూటీ సీఎం యోచిస్తున్నట్లు సమాచారం. మరోనేత మాత్రం అక్కడ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు అనువైన భవనాలు నిర్మిస్తే బాగుంటుందన్న ప్రతిపాదనను తెరపైకి తెచ్చారని అధికారులు చెబుతున్నారు.



మంత్రి కదుల దుర్గేశ్‌ను కలిసిన సినీ నిర్మాతలు

త్వరలో నూతన ఫిల్మ్ పాలసీ

ఈ ఏడాది నంది అవార్డుల ప్రదానం

సినీ నిర్మాతల భేటీలో మంత్రి దుర్గేశ్ వెల్లడి

పరిశ్రమకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని హామీ

అధ్యయనం చేసి సరైన ప్రతిపాదనలతో రావాలని సూచన

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం త్వరలో నూతన ఫిల్మ్ పాలసీని తెస్తున్నామని పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు. ఈ ఏడాది నంది అవార్డులిస్తామని ప్రకటించారు. సోమవారం అమరావతి సచివాలయంలో పలువురు తెలుగు సినీ నిర్మాతలు ఆయనతో భేటీ అయ్యారు. సినిమా రంగ సమస్యలపై రూపొందించిన డాక్యుమెంట్‌ను మంత్రికి అందజేశారు. సినీ పరిశ్రమకు సంబంధించిన 24 విభాగాల అభివృద్ధిపై చర్చించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. వారిద్దరి అపాయింట్‌మెంట్లు ఇప్పించాలని కోరుతూ తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భరత్‌భూషణ్, గౌరవ కార్యదర్శి దామోదరప్రసాద్ మంత్రికి విజ్ఞాపన అందజేశారు. రాష్ట్రంలో సినిమా షూటింగులు, కొత్త సినిమాల విడుదల, నూతన ఫిల్మ్ పాలసీ తదితర అంశాలపై నిర్మాతలతో మంత్రి చర్చించారు. సెప్టెంబరు మొదటి పక్షంలో సీఎం, డిప్యూటీ సీఎంతో సమావేశం ఏర్పాటు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలో, చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా అధ్యయనం చేసి, సరైన ప్రతిపాదనలతో రావాలని నిర్మాతలకు సూచించారు. అనంతరం మంత్రి దుర్గేశ్ మీడియాతో మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో స్టూడియోల నిర్మాణం, డబ్బింగ్, రీరికార్డింగ్ థియేటర్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సహకారం అందిస్తామని చెప్పారు. త్వరలో సినీ రంగ భాగస్వాములతో భేటీ అయ్యి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. నిర్మాతలు ముందుకు రావడం తొలి మెట్టుగా భావిస్తున్నామని, సినీ రంగానికి అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని వివరించారు. నంది నాటకోత్సవాలు, నంది అవార్డుల విషయంలో సీఎం, డిప్యూటీ సీఎం స్పష్టమైన సూచనలు చేశారని, ఈ ఏడాది తప్పకుండా నంది అవార్డులిస్తామని చెప్పారు. ఆ కార్యక్రమాన్ని ఏ విధంగా నిర్వహిస్తే తెలుగు చిత్ర పరిశ్రమకు ఉపయోగపడుతుందో ఆలోచన చేసి, తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. రెండు రాష్ట్రాలకు తెలుగు సినిమా ఒక్కటేనని చెప్పారు. 'అక్కడ ఉత్తమ చిత్రం.. ఇక్కడా ఉత్తమ చిత్రమే అవుతుంది కదా!' అన్నారు. నంది అవార్డుల ఎంపిక ఇరు రాష్ట్రాలు కలిసి చేయాలా? విడివిడిగా చేయాలా? అనే అంశంపై భిన్నాభిప్రాయాలున్నాయని, సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లి స్పష్టత వచ్చేలా చూస్తామన్నారు. సినిమాల రూపకల్పన, విధి విధానాల విషయంలో బడ్జెట్ ప్రాతిపదికన ఏయే సినిమాలకు ఏ రకంగా సాయం అందించాలన్న అంశంపై నిర్మాతలతో చర్చించినట్లు చెప్పారు. ఏపీలో సినిమారంగంలో పని చేయగల యువతకు శిక్షణ ఇచ్చి, వారి నైపుణ్యాన్ని ఉపయోగించుకోవాలని నిర్మాతలను కోరినట్లు మంత్రి వివరించారు. కాగా, హైదరాబాద్‌లో సినీ కార్మికుల సమ్మె అంశానికి, మంత్రితో భేటీకి ఎలాంటి సంబంధమూ లేదని సినీ నిర్మాతలు కేఎల్ నారాయణ, టీజీ విశ్వప్రసాద్ మీడియాకు తెలిపారు.

రాష్ట్రాభివృద్ధికి పూర్తి సహకారం: మోదీ

ప్రధాని, హోం మంత్రిని కలిసిన టీడీపీ ఎంపీలు

న్యూఢిల్లీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): 'సీఎం చంద్రబాబు సారథ్యంలో ఏపీ అభివృద్ధికి వేగంగా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర పురోగతికి కేంద్రం పూర్తి మద్దతు అందిస్తుంది' అని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసినందుకు, అమెరికా విధించిన టారిఫ్‌ల నుంచి రైతన్నల ప్రయోజనాలు కాపాడతానని ప్రకటించినందుకు టీడీపీ ఎంపీలు మోదీని పార్లమెంట్‌లో కలసి అభినందనలు తెలిపారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ సహా టీడీపీ ఎంపీలందరూ మోదీని కలిసి సత్కరించారు. కాగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును రామ్మోహన్‌నాయుడు ప్రత్యేకంగా పరిచయం చేసినపుడు.... 'ఆయన నాకు బాగా తెలుసు. లోక్‌సభకు ఒక్క రోజు కూడా వదలకుండా హాజరవుతారు. ఎప్పుడూ కొత్త కొత్త విషయాలను అన్వేషిస్తారు' అని మోదీ అభినందించారు. ఎంపీని 'గాడ్ బ్లెస్ యూ' అంటూ దీవించారు. కాగా, కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల నుంచి కేంద్ర నిధులు, పథకాలను గరిష్ఠ స్థాయిలో రాబట్టేందుకు 'ఇంపాక్ట్' అనే పద్ధతిని అనుసరిస్తున్నామని టీడీపీ ఎంపీలు ప్రధానికి వివరించారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో అమలుచేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా వివిధ మంత్రిత్వ శాఖల్లో 70శాతానికి పైగా పథకాలను ఏపీలో అమలు చేయగలుగుతున్నామని తెలిపారు.

ఆర్‌డీటీకి విదేశీ విరాళాలపై అమిత్ షాకు విజ్ఞప్తి

అనంతపురంలోని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టుకు(ఆర్‌డీటీ) ఎఫ్‌సీఆర్‌ఏ గుర్తింపును పునరుద్ధరించి విదేశీ విరాళాలకు వీలు కల్పించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్, టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు నేతృత్వంలో ఎంపీలు, తదితరులు హోంమంత్రి అమిత్ షాను కోరారు. 1969 నుంచీ ఆర్‌డీటీ రాజకీయాలు, మతాలకు అతీతంగా తెలంగాణ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఈ సంస్థ ఇప్పటివరకూ 4,50,000 కుటుంబాలకు చేయూతనిచ్చిందన్నారు. ఆర్‌డీటీ నమోదును పునరుద్ధరించకపోవడం వల్ల ప్రజలకు తీరని నష్టం జరిగిందని తెలిపారు. హోంమంత్రి సానుకూలంగా స్పందించారు.

సరుకు రవాణాకు.. లాజిస్టిక్స్ కార్పొరేషన్

▸▸ ఇతర రాష్ట్రాల కార్గో నిర్వహణా చేపట్టాలి: సీఎం

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌తో పాటు పొరుగు రాష్ట్రాల సరుకును కూడా రవాణా చేసేందుకు లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఓడరేవులు, విమానాశ్రయాలు, రహదారులు, రైలు, అంతర్గత జల రవాణా మార్గాల ద్వారా చేపట్టే సరుకు రవాణాను ఈ కార్పొరేషన్ ద్వారా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమలు, మౌలిక సదుపాయాలపై ఆయన సమీక్ష జరిపారు. ఎయిర్‌పోర్టులు-పోర్టుల అభివృద్ధి, మారిటైం పాలసీలో తీసుకురావలసిన మార్పులు, లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటుపై చర్చించారు. రాష్ట్రంలో 20 పోర్టులు, మరిన్ని ఎయిర్‌పోర్టుల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామని సీఎం తెలిపారు. 'ప్రతి రేవు, విమానాశ్రయ సమీప ప్రాంతాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. ఓడరేవులు, విమానాశ్రయాలకు అనుసంధానించేలా శాటిలైట్ టౌన్‌షిప్పులను అభివృద్ధి చేయాలి. దీనివల్ల కొత్తగా మరిన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. తద్వారా సంపద సృష్టి జరుగుతుంది. ఈ తరహా సమీకృత అభివృద్ధి ఎక్కడెక్కడ చేయగలమో.. ఏవిధంగా చేయగలమో బ్లూప్రింట్ సిద్ధం చేసుకోవాలి. ఇదే సమయంలో సరుకు రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలి. రోడ్డు, రైలు, ఎయిర్‌కార్గో, ఇన్‌ల్యాండ్, మారిటైం కార్గోలకు మన రాష్ట్రమే కేంద్రంగా ఉండాలి. తక్కువ వ్యయమయ్యే మార్గం ద్వారా సరుకులను రవాణా చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఉత్తర-దక్షిణాది రాష్ట్రాలకు వెళ్లాలంటే మన రాష్ట్రమే కేంద్రం. ఇలాంటి పరిస్థితుల్లో మన వద్ద అన్ని రకాల సరుకు రవాణా మార్గాలు అందుబాటులో ఉంటే.. అభివృద్ధి వేగంగా జరుగుతుంది. పోర్టులు, ఎయిర్‌పోర్టులకు అనుసంధానంగా నేషనల్ హైవే కనెక్టివిటీ, రైల్ కనెక్టివిటీ ఉండేలా చూసుకోవాలి. కేంద్రం వద్ద నేషనల్ హైవేలకు, రైల్వే మార్గాలకు నిధుల కొరత లేదు. మనం ప్రణాళికలు సిద్ధం చేసుకుని ప్రతిపాదనలు పంపితే ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉంది. దీనిని మనం సద్వినియోగం చేసుకోవాలి' అని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

మౌలిక సదుపాయాల చోదకశక్తిగా..

రాష్ట్రంలో వివిధ మార్గాల ద్వారా చేపట్టే సరకు రవాణాను సమర్థంగా నిర్వహించేందుకు లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం అన్నారు. ఇది గ్రోత్ ఇంజన్ మాదిరిగా ఉండాలని తెలిపారు. పోర్టులు, ఎయిర్‌పోర్టుల సమీపంలో శాటిలైట్ టౌన్ షిప్పుల అభివృద్ధికి సంస్థలను గుర్తించి పీపీపీ విధానంలో చేపట్టాలని సూచించారు. ఇదే తరహాలో 175 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసుకుంటున్న ఎంఎస్ఎంఈ పార్కుల వద్ద కూడా శాటిలైట్ టౌన్‌షిప్పులను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు చేయాలి. కుప్పం, దగదర్తి విమానాశ్రయాల పనులను వేగవంతం చేయాలి' అని చెప్పారు.

క్రూయిజ్ టెర్మినళ్లు..

పెట్టుబడులను మరింతగా ఆకర్షించేందుకు వీలుగా మారిటైం విధానంలో మార్పులు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. పోర్టులు, టెర్మినల్స్, షిప్ బిల్డింగ్ యూనిట్లు, అంతర్గత జల రవాణా మార్గాలు, క్రూయిజ్ టెర్మినళ్ల ఏర్పాటుకు మార్గం సుగమం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం అమలు చేస్తున్న షిప్ బిల్డింగ్ క్లస్టర్ స్కీం పాలసీలో మార్పులు చేసుకోవాలని అధికారులు చెప్పారు. ఇందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు. మచిలీపట్నం, మూలపేట, చిన గంజాం వంటి ప్రాంతాల్లో షిప్ బిల్డింగ్ యూనిట్ల ఏర్పాటుకు కొన్ని సంస్థలు ముందుకొచ్చాయని అధికారులు తెలిపారు. దీనిపై సీఎం స్పందించారు. 'షిప్ బిల్డింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఎక్కడ అనువుగా ఉందో చూడాలి. స్థానిక మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా చూడాలి. కంటైనర్ పోర్టుల ఏర్పాటు, అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాలి' అని స్పష్టం చేశారు.

డ్రోన్ల పర్యవేక్షణతో

రౌడీషీటర్లలో వణుకు పుట్టించాలి

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ల పర్యవేక్షణతో రౌడీషీటర్లలో వణుకు పుట్టించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ(ఆర్‌టీజీఎస్)ని ఆయన సందర్శించారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు సిద్ధం చేసిన ఆన్‌లైన్ పోర్టల్ 'అవేర్ డ్యాష్ బోర్డు 2.0'ను ప్రారంభించారు. జలాశయాల్లోని నీటి నిల్వలను ఆన్‌లైన్‌లో పరిశీలించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని కూడా తిలకించారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. జీరో మలేరియా లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ పనిచేయాలన్నారు.



హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో పింగళి వెంకయ్యకు నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు కందుల దుర్గేశ్, సత్యకుమార్ తదితరులు

దేశాన్ని అగ్ర భాగాన నిలిపేది జాతీయ భావమే..!

▸▸ సమరయోధుల స్ఫూర్తితో ఇంటింటా జాతీయజెండా: సీఎం

విజయవాడ సిటీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆర్థిక, రక్షణ, సాంకేతిక రంగాల్లో ప్రపంచంతో పోటీపడుతూ మన దేశం అగ్రస్థానానికి చేరుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పౌరుల్లో ఉండే జాతీయభావమే దేశాన్ని అన్నిరంగాల్లో మొదటి స్థానంలో నిలుపుతుందని, స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకుని పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండాను ఇంటింటా ఎగురవేయాలని పిలుపిచ్చారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'హర్ ఘర్ తిరంగా' (ఇంటింటికీ జాతీయ జెండా) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం మాట్లాడుతూ.. శక్తి, స్ఫూర్తి, ఉద్వేగం, అనుబంధం, ఐక్యతకు మారుపేరు మువ్వన్నెల జెండా అని తెలిపారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతి ఒక్కరిలో దేశభక్తిని నింపాలనే ఉద్దేశంతో హర్ ఘర్ తిరంగాకు ప్రధాని శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. కులం, మతం, భాష, ప్రాంతీయ విభేదాల్లేకుండా జాతీయ స్ఫూర్తిని నింపే త్రివర్ణ పతాకాన్ని ప్రతి ఇంటిపైనా ఎగురవేసి, ప్రతి ఒక్కరూ జాతికి పునరంకితమై దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. మోదీ నాయకత్వంలో దేశం బలమైన ఆర్థిక వ్యవస్థగా మారుతోందని చెప్పారు. భారతదేశానిది డెడ్ ఎకానమీ అని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. 143 కోట్ల మంది సామర్థ్యాన్ని చాటే జాతీయ జెండాను అందించిన పింగళి వెంకయ్య తెలుగు వారు కావడం మన అదృష్టమన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్యం కోసం పోరాడిన అల్లూరి సీతారామరాజు, టంగుటూరి ప్రకాశం పంతులు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, సర్దార్ గౌతు లచ్చన్న, దుగ్గిరాల గోపాలకృష్ణయ్యను సీఎం స్మరించుకున్నారు. కార్యక్రమంలో మంత్రులు దుర్గేశ్, సత్యకుమార్, ఎమ్మెల్యే బొండా ఉమా పాల్గొన్నారు. అనంతరం సమరయోధుల కుటుంబీకులను సీఎం ఘనంగా సత్కరించారు. పింగళి జీవితచరిత్ర పుస్తకాన్ని, చిత్రపటాన్ని ఆవిష్కరించారు.

15 వరకు సుపరిపాలనలో తొలి అడుగు

▸▸ 40 రోజుల్లో కోటికిపైగా ఇళ్లకు టీడీపీ శ్రేణులు

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆగస్టు 15తో ముగించాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జూలై 2న కుప్పంలో సీఎం చంద్రబాబు, మంగళగిరిలో మంత్రి లోకేశ్ ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. తొలి 18 రోజుల్లోనే 50 లక్షలకుపైగా ఇళ్లకు వెళ్లిన టీడీపీ శ్రేణులు ఆగస్టు 10నాటికి... కోటికిపైగా ఇళ్లకు వెళ్లి ప్రజాభిప్రాయాలను తెలుసుకుని, అధిష్ఠానానికి నివేదించారు. టీడీపీ మంత్రులు తమ నియోజకవర్గాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 85 నియోజకవర్గాల్లో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగన్ భూతాన్ని బయటకు రానీయకూడదు: మంత్రి నిమ్మల

తణుకు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): 'జగన్ అనే భూతాన్ని బయటకు రానీయకూడదు. 2014-2019 మధ్యలో సీసాలో బంధించి బిరడా పెట్టారు. తర్వాత తీశారు. అపుడు రాష్ట్రంలో ఎంత విధ్వంసం జరిగిందో ప్రజలకు తెలుసు. మరలా అవకాశం ఇవ్వకుండా, ఇప్పుడున్న బిరడా తీయకుండా చూసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఉంది' అని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా తణుకులో వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ... రాష్ట్ర విభజన తర్వాత సీఎం చంద్రబాబు అహర్నిశలు కష్టపడి రాష్ట్రాన్ని గాడిలో పెట్టారు. రాష్ట్రం కోలుకునే పరిస్థితుల్లో వైసీపీకి ప్రజలు అధికారం కట్టబెట్టారు. తర్వాత ఎంత విధ్వంసం జరిగిందో అందరికి తెలుసు' అని అన్నారు.

ప్రజాస్వామ్యానికి కాపు కాయకుండా మోదీకి ఈసీ వత్తాసు

▸▸ బీజేపీ చేతిలో కీలుబొమ్మలా ఎన్నికల సంఘం: షర్మిల

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): 'ప్రధాని మోదీ ఓట్ల దొంగ కాబట్టే మా నేత రాహుల్ గాంధీ చెబుతున్న వాస్తవాలపై స్పందించకుండా మౌనం దాల్చుతున్నారు' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. సోమవారం ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. 'భారతీయ జనతా పార్టీ(బీజేపీ) చేతిలో కీలుబొమ్మలా ఎన్నికల కమిషన్ మారింది. దొంగ ఓట్ల చేరికతో వ్యవస్థను భ్రష్టు పట్టించింది. ప్రజాస్వామ్యానికి కాపుకాయాల్సిన ఎన్నికల కమిషన్... మోదీకి వత్తాసు పలుకుతోంది. దొడ్డిదారిలో గెలుపు కోసం బీజేపీ, ఎన్నికల కమిషన్‌ను కలుషితం చేసింది. స్వతంత్ర వ్యవస్థలన్నీ బీజేపీ చేతిలో కీలుబొమ్మలుగా మారాయి. ఆర్ఎస్ఎస్‌లాంటి అనుబంధ సంస్థల జాబితాలో ఈసీ కూడా భాగమైంది' అని షర్మిల అన్నారు.

జిల్లాలపై రేపు మంత్రుల కీలక భేటీ

▸▸ ప్రజల నుంచి వినతుల స్వీకరణకు ఆహ్వానం

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా, మండల, గ్రామాల పేర్లు, సరిహద్దుల చేర్పులు, మార్పులపై రాష్ట్రప్రభుత్వం మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ తొలిసారి 13న ఉదయం 11 గంటలకు అమరావతి సచివాలయంలో సమావేశం కానుంది. ఈమేరకు సోమవారం మంత్రి అనగాని సత్యప్రసాద్ ఒక ప్రకటన చేశారు. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణను అడ్డదిడ్డంగా చేసేసింది. దీంతో జిల్లా కేంద్రానికి వెళ్లడం కొన్ని చోట్ల ప్రయాసతో కూడుకున్నదిగా తయారయింది. అలాగే కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలకు పేర్లు పెట్టడంలోనూ వివాదాలు తలెత్తాయి. మొత్తంగా జిల్లా, మండల, గ్రామాల పేర్లను, వాటి సరిహద్దులను మార్చాలంటూ ప్రజలు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వానికి పదే పదే విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ అంశాలపై అధ్యయనం చేసి పరిష్కార మార్గాలను చూపేందుకు మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, అనిత, బీసీ జనార్దనరెడ్డి, రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్‌తో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రుల బృందం (జీవోఎం) తొలి భేటీ నేపథ్యంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు మార్పుపైన వారి వినతులను జీవోఎంకు సమర్పించవచ్చునని మంత్రి సత్యప్రసాద్ తెలిపారు.

వివేకా హత్య గురించి జగన్‌కు అంతా తెలుసు!

▸▸ కేసును రాజకీయంగా వాడుకుని వదిలేశారు: సునీతారెడ్డి

▸▸ న్యాయం జాప్యం కాలేదు.. తిరస్కరణకు గురైందని ఆవేదన



అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సౌమ్యుడు, ప్రజానాయకుడైన తన తండ్రి వైఎస్ వివేకానందరెడ్డిని ఇంట్లోనే అత్యంత కిరాతకంగా హత్య చేయడం గురించి తన సోదరుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అంతా తెలుసని ఆయన కుమార్తె నర్రెడ్డి సునీతా రెడ్డి స్పష్టం చేశారు. నాన్న చనిపోయిన విషయం బాహ్య ప్రపంచానికి తెలియక ముందే జగన్‌కు తెలుసన్నారు. ఈ విషయాన్ని మాజీ ఐఏఎస్ అధికారి అజేయ కల్లం కూడా దర్యాప్తు సమయంలోనే వెల్లడించారని, సీబీఐ కూడా తెలంగాణ హైకోర్టుకు ఈ సంగతి నివేదించిందని గుర్తుచేశారు. అయితే ఆ కోణంలో సీబీఐ దర్యాప్తు చేయకుండా నిలిపివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. నాన్న హత్య కేసును జగన్ తన రాజకీయ లబ్ధికి వాడుకుని వదిలేశారని ధ్వజమెత్తారు. ఈ హత్య కేసులో న్యాయం జాప్యం కాలేదని.. తిరస్కరణకు గురైందని వాపోయారు. వివేకా హత్యపై పునర్విచారణకు ఆదేశించాలని సుప్రీంకోర్టును సోమవారం అభ్యర్థించారు. 'సీబీఐ చార్జిషీటులో కీలకాంశాలు దాచిపెట్టింది. అసలు దోషులను గుర్తించకుండానే దర్యాప్తు పూర్తయిపోయినట్లు తేల్చేసింది. ఈ కేసులో పెద్ద కుట్ర దాగి ఉందని సుప్రీంకోర్టు గుర్తించింది. ఫలితంగానే హత్య కేసును 2022 నవంబరు 29న ఏపీ నుంచి తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేసింది' అని తెలిపారు. వివేకా 2019 మార్చి 15వ తేదీన హత్యకు గురయ్యారని, ఈ ఘటనను గుండెపోటుగా చిత్రిస్తూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భార్య భారతీరెడ్డి నడుపుతున్న 'సాక్షి' చానల్ ప్రసారం చేసిందన్నారు. దీనినే వైసీపీ ముఖ్యనేతలు పలువురు వల్లెవేశారని.. అత్యంత హేయంగా వివేకాను నరికి చంపిన ఉదంతం బయటకు పొక్కకుండా గుట్టుగా దాచేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. నాన్న గుండెపోటులో మరణించారన్న సమాచారంతో హుటాహుటిన హైదరాబాద్ నుంచి పులివెందుల వెళ్లానని.. తన తండ్రి భౌతిక కాయం రక్తగాయాలతో ఉండడం గమనించానని.. శరీరంపై బ్యాండేజీ కట్టి ఉండడాన్ని కూడా చూశానని తెలిపారు. తర్వాత ఈ హత్యను మరో రాజకీయ పక్షంపై రుద్దడానికి కుట్ర పన్నారని విమర్శించారు. వివేకా హత్య జరిగిన మరుసటి రోజున జగన్ పత్రికలో ఈ హత్యకు టీడీపీ నాయకులే బాధ్యులంటూ ఫుల్ పేజీలో ప్రచురించారని చెప్పారు. హత్యకు తెలుగుదేశం పార్టీ నేతలే కారణమంటూ జగన్ ఏపీ హైకోర్టులో కేసు వేశారని తెలిపారు. న్యాయం చేస్తానని ముఖ్యమంత్రి హోదాలో ఆయన తనకు హామీ ఇచ్చారని.. అయితే ఆ తర్వాత సీబీఐ దర్యాప్తు చేస్తే ఎంపీ అవినాశ్‌రెడ్డి వైసీపీని వీడి మరో పార్టీలో చేరతారని తనతో చెప్పారని తెలిపారు. తాను హైకోర్టును ఆశ్రయించడంతో.. 2020 మార్చి 11వ తేదీన సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిందన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అడుగడుగునా దర్యాప్తునకు అడ్డుతగిలిందని ధ్వజమెత్తారు. ఏకంగా సీబీఐ అధికారులపైనే పోలీసులు తప్పుడు కేసులు పెట్టి వేధించారని విమర్శించారు. ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు తిరస్కరించారని చెప్పారు. తన తండ్రి హత్య విషయంలో న్యాయం చేయాలని ప్రతి తలుపూ తట్టానని సునీతా రెడ్డి తెలిపారు. ఈ కేసులో సీబీఐ మళ్లీ దర్యాప్తు చేయాలని.. పునర్విచారణకు ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరారు. తన న్యాయపోరాటానికి అందరి మద్దతూ కావాలని కోరారు.

'గిరి' తెగింపు

ప్రత్యేక వ్యవస్థతో ఈఎన్‌సీ సబ్బవరపు శ్రీనివాస్ లీలలు

▸▸ ఆమెకు వరలక్ష్మీవ్రత కానుకగా ఆ 25 లక్షలు ఇవ్వాలని..

▸▸ లంచంతో ఏసీబీకి పట్టుబడటంతో కటకటాల పాలు

▸▸ 'కట్టు' కథలతో న్యాయాధికారినే బురిడీ కొట్టించే యత్నం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

ప్రభుత్వ ఉత్తర్వులతో ఆయనకు పని లేదు. ఆయన చెప్పిన విధంగా చేస్తే అదే ఒక ఉత్తర్వు. ఆయన డిమాండ్ చేసినంత సంచుల్లో సర్దడానికి సిద్ధంగా ఉంటే ఎక్కడైనా సంతకాలు పెట్టేస్తారు. లేకపోతే చుక్కలు చూపిస్తారు. ఇవీ గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీ సబ్బవరపు శ్రీనివాస్ లీలలు. ఆయన ఏర్పాటు చేసుకున్న 'గిరు'ల మధ్య ప్రత్యేక వ్యవస్థను నియమించుకున్నారు. సాధారణంగా ఇంజనీరింగ్ పనులు కాంట్రాక్టుకు ఇవ్వాలనుకున్నప్పుడు టెండర్ ప్రకియ నిర్వహిస్తారు. దీనికి కొన్ని నిబంధనలుంటాయి. కాంట్రాక్టర్‌కు ఈ రంగంలో ఐదేళ్ల అనుభవం ఉండాలి. ఐదేళ్ల ఆర్థిక లావాదేవీలను చూపించాలి. కూటమి ప్రభుత్వం దీనిని పదేళ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులు అన్ని శాఖల్లోనూ అమలయ్యాయి. అయితే, ఈఎన్‌సీ శ్రీనివాస్ ఐదేళ్ల అనుభవాన్నే అమలు చేశారు. ఆ విధంగా తన బినామీ కాంట్రాక్టర్లకు ఆయన పనులను కట్టబెట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

'కట్టు' కథలు

ఈఎన్‌సీ సబ్బవరపు శ్రీనివాస్ కాంట్రాక్టర్ కృష్ణంరాజు నుంచి రూ.5 కోట్లు లంచం డిమాండ్ చేసి, తొలిదఫాగా రూ.25 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబట్టిన విషయం తెలిసిందే. ఏసీబీకి చిక్కిన తర్వాత కోర్టులో హాజరుపరిచే ముందు వరకు ఆయన బాగానే ఉన్నారు. తర్వాత ఆయన చేతికి కట్టు కనిపించింది. కాంట్రాక్టర్ కృష్ణంరాజు దాడి చేసి చేయి విరగ్గొట్టారంటూ న్యాయాధికారికి 'కట్టు' కథ వినిపించారు. అయితే, దీన్ని న్యాయాధికారి పరిగణనలోకి తీసుకోలేదు. కాగా, కృష్ణంరాజు నుంచి తీసుకున్న నోట్ల కట్టలను ఈఎన్‌సీ లెక్కపెడుతుండగా ఏసీబీ అధికారులు ఛాంబర్‌లోకి వెళ్లారు. వారిని చూడగానే శ్రీనివాస్ పారిపోయే ప్రయత్నం చేయగా, ఏసీబీ సిబ్బంది వెంటనే ఛాంబర్ తలుపు మూసి శ్రీనివాస్‌ను గట్టిగా పట్టుకోవడంతో చేతికి వాపు వచ్చింది. ప్రభుత్వాస్పత్రిలో ఆ చేతికి వైద్యులు కట్టు కట్టగా, ఆ కట్టునే శ్రీనివాస్ తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. కాంట్రాక్టర్ బలంగా కొట్టడం వల్ల చేయి విరిగిందని కోర్టులో చెప్పిన ఆయన జైల్లోను అదే కథ వినిపిస్తున్నారు. ములాఖత్‌లకు వచ్చిన వారికీ ఇదే చెబుతున్నట్టు తెలిసింది. కాగా, కృష్ణంరాజు నుంచి తీసుకున్న రూ.25 లక్షల లంచాన్ని తనకు ప్రత్యేకమైన మహిళకు శ్రావణ శుక్రవారం కానుకగా ఇవ్వాలని శ్రీనివాస్ నిర్ణయించుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఏసీబీ అధికారులు పట్టుకోకపోతే ఆ మొత్తం నగదు 'వరలక్ష్మీవ్రత' కానుక అయ్యేది.



చేతికి కట్టుతో సబ్బవరపు శ్రీనివాస్

ఎవరా 'నాయకుడు'

ఈఎన్‌సీగా ఈనెలాఖరున ఉద్యోగ విరమణ చేయాల్సిన శ్రీనివాస్ సర్వీసు పొడిగింపు కోసం కొన్ని నెలల నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీని కోసం 'సచ్ఛీలుడి'గా నివేదిక ఇచ్చేలా గిరిజన సంక్షేమ శాఖలో ఒక 'నాయకుడి'ని ఆయన ఒప్పించారు. శ్రీనివాస్‌పై ఇంతకుముందు ఏసీబీ కేసులు ఉన్నందున గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ ఒక కమిటీని ఏర్పాటు చేశారు. విశాఖపట్నంలో జలవనరుల శాఖలో సీఈగా పనిచేస్తున్న ఎస్.సుగుణరావును విచారణాధికారిగా నియమించారు. ఆయనే శ్రీనివాస్‌పై అభియోగాలు నిర్ధారణ కాలేదని, సచ్ఛీలుడని నివేదిక ఇచ్చేశారు. ఆ సుగుణరావు శ్రీనివాస్‌కు బంధువేనని ఆ శాఖలో ప్రచారం జరుగుతోంది. విచారణాధికారిగా సుగుణరావు పేరును స్వయంగా శ్రీనివాసే సూచించడం ఇందులో కొసమెరుపు

ఏ పని కోసం ఈ పెరోల్?

(మొదటి పేజీ తరువాయి)

తనకు 30 రోజులు పెరోల్ కావాలంటూ ఈ ఏడాది మే 28న హోంశాఖ కార్యదర్శికి విన్నవించుకున్నాడు. నిబంధనల ప్రకారం దానిని తిరుపతి జిల్లా ఎస్పీ పరిశీలనకు పంపించారు. ఖైదీలకు పెరోల్ ఇవ్వడం సాధారణంగా జరిగేదే. కానీ... దానికీ కొన్ని నిబంధనలు ఉంటాయి. రౌడీ షీటర్లు, జైలు నుంచి తప్పించుకుని పోయిన వాళ్లకు ఈ వెసులుబాటు ఉండదు. అతడు బయటికి రావడంవల్ల బయట ఎవరికైనా ఇబ్బంది తలెత్తుతుందని భావించినా పెరోల్ ఇవ్వరు. శ్రీకాంత్ పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం... "అతను కరుడుగట్టిన నేరస్థుడు. ఒకసారి జైలు నుంచి తప్పించుకున్నాడు. అతను బయటికి వస్తే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుంది. పెరోల్‌కు అర్హుడు కాదు" అని తిరుపతి ఎస్పీ హోంశాఖతో పాటు నెల్లూరు జైలు సూపరింటెండెంట్‌కు జూన్ 9వ తేదీన లేఖ రాశారు. 'పెరోల్ నాట్ రెకమెండెడ్' అని స్పష్టం చేశారు. హత్య కేసులో శిక్ష అనుభవిస్తూ, ఒకసారి జైలు నుంచి తప్పించుకున్న అనిల్‌కు పెరోల్ ఇచ్చేందుకు నిబంధనలు అంగీకరించవని నెల్లూరు ఎస్పీ, గూడురు పోలీసులు సైతం తేల్చిచెప్పారు. అంతేకాదు... నెల్లూరు, తిరుపతి ప్రాంతాల్లో రౌడీ గ్యాంగ్‌లతో శ్రీకాంత్‌కు ఉన్న సంబంధాలు, అతని ప్రియురాలిగా చెబుతున్న ఒక మహిళ వ్యవహారాలను సైతం అంతర్గత నివేదికలో పొందుపరిచారు. దీంతో... హోంశాఖ జాయింట్ సెక్రటరీ జూలై 16న శ్రీకాంత్ పెరోల్‌ను తిరస్కరిస్తూ ఆదేశాలిచ్చారు. "జీవో నంబర్ 4లోని రూల్ 23 కింద పెరోల్‌కు శ్రీకాంత్ అనే ఖైదీ అర్హుడు కాదు. అతని పెరోల్ దరఖాస్తును తిరస్కరిస్తున్నాం" అని స్పష్టం చేశారు.

అంతలోనే సీన్ మారింది...

ఏం జరిగిందో... తెరవెనుక ఎవరు చక్రం తిప్పారో... 15 రోజుల్లోనే సీన్ మారిపోయింది. రెండు జిల్లాల ఎస్పీలు, జైలు సూపరింటెండెంట్ చేసిన సిఫారసులు, హోంశాఖ జాయింట్ సెక్రటరీ ఇచ్చిన జీవో బుట్టదాఖలయ్యాయి. జూలై 30న శ్రీకాంత్‌కు 30 రోజులు పెరోల్ ఇస్తూ హోంశాఖ కార్యదర్శి జీవో ఇచ్చేశారు. హత్యకేసులో శిక్ష పడ్డ ఆ ఖైదీ... దర్జాగా బయటికి వచ్చేశాడు. ఈ విషయం తెలియగానే మూడు జిల్లాల పోలీసులు అవాక్కయ్యారు. నిబంధనల ప్రకారం... హోంశాఖ జాయింట్ సెక్రటరీ 'ఓకే' అని సిఫారసు చేస్తే, ఆ మేరకు కార్యదర్శి పెరోల్‌పై జీవో ఇవ్వాలి. కానీ... ఇక్కడ ఏం జరిగిందో ఏమో తెలియదుగానీ... 'రిజెక్టెడ్' అని జాయింట్ సెక్రటరీ జీవో జారీ చేసిన 15 రోజులకే... 'పెరోల్ అప్రూవ్డ్' అంటూ హోంశాఖ సెక్రటరీ జీవో నంబర్ 1267 విడుదల చేశారు. ప్రస్తుత ప్రభుత్వం జీవోఐఆర్ వెబ్‌సైట్లో అన్ని జీవోలను అప్‌లోడ్ చేస్తోంది. కానీ... ఈ పెరోల్ జీవోను మాత్రం అప్‌లోడ్ చేయకపోవడం గమనార్హం. ఇలా జీవో విడుదలకావడం, అలా శ్రీకాంత్ జైలు నుంచి బయటికి రావడం జరిగిపోయింది. దీని వెనుక ఏం జరిగింది? ఏ 'పని' మీద అతను బయటికి వచ్చాడు? ఎవరు రప్పించారు? అనే ప్రశ్నలకు సమాధానాలు తెలియక తిరుపతి, నెల్లూరు జిల్లాల పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.



నంద్యాల జిల్లా కాకనూరు-భోజనం గ్రామాల వద్ద వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

రేపు అల్పపీడనం

- వాయుగుండంగా బలపడే అవకాశం.. రాష్ట్రానికి భారీ వర్షసూచన
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో భారీ వర్షం.. ప్రమాదకరంగా కుందూనది

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఉత్తరకోస్తా, దానికి ఆనుకుని తెలంగాణ పరిసరాల్లో సోమవారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. వాతావరణ అనిశ్చితితో సముద్రం నుంచి తేమగాలులు కోస్తాపైకి వీచాయి. వీటి ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. అక్కడక్కడ భారీవర్షాలు పడ్డాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి నుంచి ఎడతెరపి లేని వానకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభించాయి. కుందూనది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. నది పరీవాహక ప్రాంతాల్లోని వరి, మినుము, మొక్కజొన్న పంటలు పూర్తిగా నీట మునిగాయి. కుందూనది వంతెనలపై నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు కాలనీలు నీటమునిగాయి.

నేడు కోస్తా, సీమల్లో భారీ వర్షాలు..

మంగళవారం కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశాకు ఆనుకుని అల్పపీడనం ఏర్పడనుందని, ఆ తర్వాత రెండు రోజుల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. దీని ప్రభావంతో ఈనెల 16వ తేదీ వరకు కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు కురుస్తాయని తెలిపింది. 13 నుంచి 15వ తేదీ వరకు కోస్తాలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. మంగళవారం రాష్ట్రంలోని పలు చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

శ్రీశైలానికి భారీగా వరద

ఎగువ నుంచి వస్తున్న వరదతో శ్రీశైలం జలాశయం నిండుకుండను తలపిస్తోంది. దీంతో కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పాదన ద్వారా 66,202 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు, ప్రస్తుతం 881.80 అడుగులకు చేరింది. డ్యాంలో 197.9120 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఏపీ నాటి కళకళలు?



- అమరావతిలో 'రియల్' స్తబ్ధతకు అనేక కారణాలు
- భారీగా పెరిగిన ప్లాట్ల ధరలతో బయ్యర్ల వెనుకంజ
- వేచి చూసే ధోరణిలో కొనుగోలుదారులు
- తెలుగు రాష్ట్రాల్లో తగ్గిన 'నగదు' సరఫరా ఎఫెక్ట్
- లేఅవుట్లు అభివృద్ధి చేస్తే పరిస్థితి మారే అవకాశం
- వెస్ట్ బైపాస్ వెంటనే అందుబాటులోకి తేవాలి

(మంగళగిరి - ఆంధ్రజ్యోతి)

వైసీపీ సర్కారు 'అమరావతి'ని ఆపేసి... అంతటితో ఊరుకోలేదు. ఈ ప్రాంతంపై కక్ష కట్టినట్టు వ్యవహరించింది. కోట్ల రూపాయల ప్రజాధనంతో వేసిన రాజధాని రోడ్లనే తవ్వేస్తున్నా... 'చూస్తూ' ప్రోత్సహించింది. 2019కు ముందు హైకోర్టు, సచివాలయం ప్రాంతంలో గజం రూ.50వేలకు పైగా పలికిన ప్లాట్ల ధరలు జగన్ హయాంలో పాతాళానికి పడిపోయాయి. 2024లో ప్రభుత్వం మారడంతో అమరావతి రైతులు, ప్లాట్లు కొనుగోలు చేసిన వారిలో ఉత్సాహం రెట్టింపయ్యింది. 2014-19 మధ్య గరిష్ఠంగా రూ.50వేలు పలికిన గజం ధర... కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో ఏకంగా రూ.70వేలకు పెంచేశారు. ఎర్రబాలెం, నవులూరు ప్రాంతాలలో 2014-19లో గజం గరిష్ఠంగా రూ.35 వేలు పలుకగా జగన్ హయాంలో రూ.15వేలకు కూడా అడిగే దిక్కులేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం రాజధానిలో మళ్లీ పనులు మొదలుపెట్టాక... ధరను రూ. 55వేల వరకు తీసుకెళ్లారు. తొలి పదినెలలు బాగానే సందడి కనిపించింది. ఆ తర్వాత... ప్లాట్ల ధరలు అనూహ్యంగా పెరిగిపోవడంతో కొనుగోలుదారులు ముందుకు రావడంలేదనే అభిప్రాయం నెలకొంది. 'మళ్లీ జగన్ వస్తే ఎలా?' అని ఏ మూలనో ఒక ఆందోళన ఉందని... అందుకే బయ్యర్లు వేచి చూస్తున్నారని చెబుతున్నారు. మరోవైపు.. తెలుగు రాష్ట్రాల్లో 'క్యాష్ ఫ్లో' తగ్గిందని.. దీంతో భారీగా పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు రావడంలేదని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ప్రభావం అమరావతిపైనా పడింది.

2019 ఎన్నికలకు ముందు...

రాజధాని ప్రాంతంలో ఎటు చూసినా కోలాహలం! సంచుల్లో డబ్బులు మోసుకొచ్చి... గజాల్లో స్థలాలు కొంటున్న జనం! రాజధాని గ్రామాల్లో ఏ దారిలో చూసినా జనాలు, వాహనాలు! ఎక్కడికక్కడ పుట్టుకొచ్చిన హోటళ్లు! ఆ టేబుళ్లపై రియల్ ఎస్టేట్ ముచ్చట్లు! ఒకే సిట్టింగ్‌లో కోట్లకొద్దీ డీల్స్! మంగళగిరి, మందడం, తుళ్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు నిత్యం కిటకిటే! వైసీపీ సర్కారు వచ్చింది. అమరావతి అటకెక్కింది. అంతా స్తబ్దతే!

మరి ఇప్పుడు...

ప్రభుత్వం మారింది. కూటమి సర్కారు మళ్లీ రాజధానిపై దృష్టి సారించింది. ఇప్పటికి 15 నెలలు దాటింది. అయినా సరే... నాటి కళకళలు, గలగలలు మాత్రం రాజధానిలో కనిపించడంలేదు. 2014-19 నాటి రియల్‌బూమ్ కమ్మేస్తుందన్న అంచనాలు తప్పాయి. విచిత్రమేమిటంటే... అంతకు ముందున్నంత ధరలూ లేవు. కొనేవారు కనిపించడంలేదు.

చిన్న ప్లాట్లకే 'పరిమితం'

ప్రస్తుతానికి రాజధాని అమరావతిలో ప్లాట్ల క్రయవిక్రయాలు చాలా నెమ్మదించాయి. 150, 200 గజాల నివాస ప్లాట్లు, 80, 90 గజాల వాణిజ్య ప్లాట్లు... అదీ అడపాదడపా విక్రయాలు జరుగుతున్నాయి. పెద్ద ప్లాట్ల జోలికైతే ఎవరూ వెళ్లడం లేదు.

వెస్ట్ బైపాస్ మీదే ఆశలన్నీ

అనేకానేక కారణాల వల్ల రాజధానిలో భూముల ధరలు తగ్గాయి. రాజధానిలోని అన్నీ ప్రాంతాల్లో సుమారుగా గజానికి రూ.15 వేల వంతున ధరలు పడిపోయాయి. వెస్ట్ బైపాస్ ప్రారంభమైతే మళ్లీ ధరలు పెరుగుతాయని ఆశపడుతున్నాం. అలాగే నవ నగరాల నిర్మాణంపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

- వెలిమిచర్ల శివన్నారాయణ, యర్రబాలెం



ఇవి చేస్తే మునుపటి కళ...

- రిటర్నబుల్ ప్లాట్ల లేఅవుట్ల అభివృద్ధి పనులు తక్షణం ప్రారంభించాలి. రూ.29వేల కోట్ల వ్యయంతో 26 వెంచర్లలో లేఅవుట్ల అభివృద్ధికి టెండర్లను ఖరారు చేసినప్పటికీ ఏవో కారణాలతో ఆయా పనులు ప్రారంభం కాకుండా వాయిదాలు పడుతూ ఉన్నాయి.
- సీడ్ యాక్సిస్‌రోడ్డు రెండో దశ పనుల్లో ఆశించినంత వేగం కానరావడం లేదు. ఈ పనులు వెంటనే చేపట్టాలి.
- రాజధాని ప్రాంతంలో వున్న కృష్ణా కరకట్ట రోడ్డును నాలుగులేన్ల రహదారిగా విస్తరించాల్సిన పనులను మొదలుపెట్టాలి.
- విజయవాడ పశ్చిమ బైపాస్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తేవాలి. దీనివల్ల రాజధానితో రెండు హైవేల అనుసంధానం జరుగుతుంది.
- ప్రభుత్వ ప్రైవేటు సంస్థల కార్యకలాపాలు... కార్యాలయాల నిర్మాణాలు త్వరగా మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలి.



నిధి అగర్వాల్ ప్రయాణించిన కారు

ప్రభుత్వ కారులో హీరోయిన్ నిధి అగర్వాల్

- సోషల్ మీడియాలో విమర్శలు, ట్రోలింగ్
- అది ప్రభుత్వ కారు కాదు..: అధికార వర్గాలు

విజయవాడ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): 'హరిహర వీరమల్లు' హీరోయిన్ నిధి అగర్వాల్ 'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' అని ఉన్న కారులో ప్రయాణించడం విమర్శలకు కారణమైంది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఓ జువెలరీ దుకాణాన్ని ప్రారంభించేందుకు శనివారం రాత్రి ఆమె హైదరాబాద్ నుంచి విజయవాడ విమానాశ్రయానికి వచ్చారు. అక్కడి నుంచి 'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' బోర్డు ఉన్న కారులో ఆమె విజయవాడలోని ఓ హోటల్‌కు వెళ్లి ఆదివారం మధ్యాహ్నం వరకు అక్కడే బస చేశారు. ఆ తర్వాత వేరే కారులో భీమవరం వెళ్లారు. అయితే.. ఆ బోర్డు ఉన్న కారులో ప్రయాణించడంపై వైసీపీ సోషల్ మీడియాలో వ్యంగ్యంగా పోస్టులు పెట్టింది. విమర్శలపై సోమవారం ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. విజయవాడ విమానాశ్రయం నుంచి నిధి బుక్ చేసుకున్న కారు బ్రేక్ డౌన్ కావడంతో వేరే కారు మాట్లాడుకున్నారని అధికారులు తెలిపారు. ఆ కారు గతంలో ప్రభుత్వ అవసరాల కోసం ఉపయోగించిందని, అగ్రిమెంట్ ముగిసినా.. నిర్వాహకుడు 'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' బోర్డుని తొలగించకపోవడంతో దాన్ని ప్రభుత్వ కారుగా పొరబడ్డారని పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాల్సిందే

- ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం ముట్టడిలో నారాయణ



సదరన్ డిస్కం కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తదితరులు

తిరుపతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): 'పేదలు, రైతుల రక్తాన్ని పీల్చేస్తున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలి' అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండు చేశారు. తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయాన్ని సోమవారం వామపక్ష నేతలు ముట్టడించారు. కార్యక్రమంలో నారాయణ మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వంలోని విద్యుత్ ఒప్పందం వెనుక భారీ లంచాలు, దోపిడీ ఉన్నాయన్నారు. విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసి, స్మార్ట్ మీటర్ల నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలన్నారు.

ఎక్కడి నుంచి ఎక్కడికైనా!



- 'స్త్రీ శక్తి' శుక్రవారం నుంచే అమలు
- 8,458 బస్సులు సిద్ధం.. 'ఆధార్' చాలు జీరో టికెట్

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల్లో మరో హామీ అమలుకు కూటమి ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. రాష్ట్రంలోని మహిళలకు వచ్చే శుక్రవారం నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఈ నెల 15న ప్రారంభించబోయే స్త్రీ శక్తి పథకం సమర్థవంతంగా అమలు చేసేందుకు ఏపీఎస్ఆర్టీసీ యాజమాన్యం కసరత్తు పూర్తి చేసింది. మొత్తం బస్సుల్లో 74శాతమున్న ఐదు రకాల బస్సుల్లో మహిళలు, యువతులు, థర్డ్ జెండర్లు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఆధార్ కార్డు చూపించి కండక్టర్ జారీ చేసే జీరో ఫేర్ టికెట్‌తో ప్రయాణించవచ్చు. ఆర్టీసీలో మొత్తం 11,449 బస్సులు ఉండగా 8,458 బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతిస్తోంది. ఇందుకోసం ప్రభుత్వంపై ప్రతి నెలా రూ.162కోట్ల చొప్పున ఏడాదికి 1,942కోట్ల రూపాయల భారం పడుతుంది. ఈ ప్రయాణ ఖర్చు మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించి ఏపీఎస్ఆర్టీసీకి చెల్లిస్తుందని సోమవారం విడుదల చేసిన జీవోలో రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే పేర్కొన్నారు. అయితే ఎక్స్‌ప్రెస్ బస్సులు రాష్ట్ర పరిధి దాటి తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు వైపు వెళ్లే వాటిలో సరిహద్దులు దాటాక ఉచిత ప్రయాణం వర్తించదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న బస్సులతో మొదలు పెట్టి, అవసరం మేరకు భవిష్యత్తులో ఆర్టీసీ కొత్త బస్సులు సమకూర్చనుంది. డ్రైవర్ల కొరత ఉండటంతో ఆన్ కాల్ డ్రైవర్లను నియమించుకుని ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్త పడుతోంది. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ అమలుపై కసరత్తు చేసి అమలు చేస్తున్నందుకు ఆనందంగా ఉందని, మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యమే 'స్త్రీ శక్తి' అని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి వ్యాఖ్యానించారు.

ఉచిత ప్రయాణానికి అనుమతించే బస్సులు

బస్సు రకం	సంఖ్య
పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు	5,851
ఎక్స్‌ప్రెస్‌లు	1,610
సిటీ ఆర్డినరీ	710
సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్	287
మొత్తం	8,458

ఆన్‌కాల్ డ్రైవర్లు, కండక్టర్లకు డబుల్ డ్యూటీలు

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్టీసీ డిపోల్లోనూ ఇప్పటికే డ్రైవర్ల కొరత ఉంది. అధిగమించేందుకు ఆన్‌కాల్(తాత్కాలిక) ద్వారా తీసుకోబోతున్నారు. ఆయా జిల్లాల ఆర్టీసీ అధికారులు ఇప్పటికే అర్హులను పిలుస్తున్నారు. కొన్ని డిపోల పరిధిలో కండక్టర్ల కొరత కూడా ఉండటంతో ఇతర విధులు(ఓడీ) నిర్వహిస్తున్న వారికి రద్దు చేయనున్నారు. కొన్ని బస్టాండ్లలో నాన్‌స్టాప్ బస్సులకు టికెట్లు జారీ చేసే గ్రౌండ్ బుకింగ్ కేంద్రాల్లో ఉన్న వారికీ కండక్టర్ డ్యూటీలు వేస్తారు. కొన్ని రోజుల పాటు డబుల్ డ్యూటీ చేయాలని డిపో మేనేజర్లు కండక్టర్లను కోరుతున్నారు.

'స్త్రీ శక్తి'తో పురుష ప్రయాణికుల తగ్గుదల!

మహిళలకు ఆగస్టు 15నుంచి ఉచిత ప్రయాణం కల్పిస్తుండటంతో పురుష ప్రయాణికులు బస్సుల్లో భారీగా తగ్గవచ్చని ఆర్టీసీ అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం వంద మంది ప్రయాణికుల్లో 60మంది పురుషులు, 40మంది మహిళలు ఉండగా.. 'స్త్రీ శక్తి' అమలు తర్వాత మహిళల సంఖ్య అనూహ్యంగా 67శాతానికి పెరుగుతుందని, పురుషులు 33శాతానికి పడిపోయే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ వ్యత్యాసం వల్ల ఆర్టీసీపై ఏటా 288కోట్ల రూపాయల రాబడి తగ్గుతుందని, అదనంగా నిర్వహణ ఖర్చులు రూ.201కోట్ల వరకూ పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వానికి నివేదించారు.

లగ్జరీ, ఏసీ బస్సుల్లో టికెట్ కొనాల్సిందే..

ఐదు రకాల బస్సుల్లో రాష్ట్రం లోపల ఉచితంగా ప్రయాణించే అవకాశమున్న మహిళలు.. దూరప్రాంతాలకు వెళ్లే లగ్జరీ, ఏసీ బస్సుల్లో జర్నీ చేయాలంటే టికెట్ కొనాల్సిందే. అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ స్లీపర్, స్టార్ లైనర్, ఏసీ బస్సులు, తిరుమల ఘాట్ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అనుమతించరు.

కొండలరాయుడికి వృశ్చికం సమర్పయామి

- ఇష్టదైవానికి నైవేద్యంగా తేళ్లు..

కోడుమూరులో వింత ఆచారం



స్వామివారికి తేళ్లను సమర్పిస్తున్న భక్తులు



తలపై, నాలుకపై తేళ్లతో భక్తులు

కోడుమూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఏ దేవాలయంలోనైనా.. ఆ దేవుడికి ఇష్టమైన నైవేద్యం అంటూ ఫలమో పత్రమో, పిండి వంటకాలో భక్తిశ్రద్ధలతో సమర్పించడం సర్వసాధారణం. కానీ, కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలోని ఓ ఆలయంలో మాత్రం ఏళ్లతరబడి వింత ఆచారం నడుస్తోంది. కోడుమూరు పట్టణానికి సుమారు 3 కిలోమీటర్ల దూరం ఎత్తులో ఉన్న ఎర్రటి కొండపై వెలసిన కొండల రాయుడుస్వామికి (వేంకటేశ్వరస్వామి)ఇక్కడి భక్తులు తేళ్లను సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. ఏటా శ్రావణమాసం మూడో సోమవారం ఈ ఆచారాన్ని భక్తులు ఆచరిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన కొండపైకి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఇక్కడ చిన్న పిల్లలు కూడా తేళ్లను పట్టుకొని స్వామికి సమర్పించడం విశేషం. ముందుగా స్వామిని దర్శించుకుని, భక్తితో కొండపైనున్న ఏ చిన్న రాయిని కదిపినా తేళ్లు దర్శనమిస్తాయి. వాటిని పట్టుకుని దారం కట్టి స్వామికి నైవేద్యంగా విగ్రహంపై వదిలేస్తారు. ఇదే ఇక్కడి ప్రత్యేకత. ఇలా చేయడం వల్ల అనుకొన్న కోరికలు తప్పకుండా నెరవేరుతాయని భక్తుల నమ్మకం. కొండ చుట్టూ ఉన్న రైతులు కూడా పంట వేసే ముందు.. వర్షాలు అనుకూలించి పంట దిగుబడి రావాలని స్వామికి పూజలు చేస్తారు.

మెగా డీఎస్సీ తుది మార్కులు విడుదల

- టెట్ మార్కులపై అభ్యంతరాలకు అవకాశం
- సవరించుకొనేందుకు రెండు రోజుల సమయం

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 పరీక్షల తుది మార్కులను పాఠశాల విద్యాశాఖ సోమవారం రాత్రి విడుదల చేసింది. డీఎస్సీ పరీక్ష నార్మలైజేషన్ మార్కులు, టెట్ వెయిటేజీ మార్కులు కలిపి ప్రకటించింది. అభ్యర్థులు ఏపీడీఎస్సీ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి మార్కులను చూసుకోవచ్చని పేర్కొంది. టెట్ మార్కులపై ఎవరైనా అభ్యర్థులకు అభ్యంతరాలుంటే.. అక్కడే తమ వాస్తవ మార్కులను అప్‌డేట్ చేసుకొనేందుకు కూడా అవకాశం కల్పించింది. అభ్యర్థులు తెలియజేసిన వివరాలను డేటాబేస్‌తో మరోసారి పరిశీలించి, పొరపాటు జరిగి ఉంటే టెట్ మార్కులను సవరించి.. దాని ఆధారంగా తుది మార్కులు మళ్లీ ఇస్తారు. టెట్ మార్కులను అప్‌డేట్ చేసుకునే రెండు రోజులు అవకాశం ఉంటుందని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. కాగా, ఈ డీఎస్సీలో ఫైనల్ 'కీ'లోనూ అనేక పొరపాట్లు వచ్చాయి. సాధారణంగా ప్రాథమిక 'కీ'లో పొరపాట్లు ఉంటే అభ్యంతరాల ఆధారంగా మార్పులు చేస్తారు. కానీ ఈసారి తుది 'కీ'లోనూ పలు ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా వచ్చాయి. వాటిపైనా అభ్యంతరాలు స్వీకరించి సవరించిన తుది 'కీ' విడుదల చేశారు. వాటి ఆధారంగా ఇప్పుడు తుది మార్కులు వెల్లడించారు. టెట్ మార్కులపై అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం సవరించిన తుది మార్కులను విడుదల చేయనున్నారు. ఆ తర్వాత జిల్లాల వారీగా జాబితాలు ప్రకటిస్తారు. ఆయా జిల్లాల్లో పోస్టులు, రిజర్వేషన్ల ప్రకారం ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను ప్రకటిస్తారు. కాగా, ఇవి మార్కులు మాత్రమేనని, వీటి ఆధారంగా ఎవరికి ఉద్యోగాలు వస్తాయనేది చెప్పలేమని అధికారులు తెలిపారు.

సీమలో భైరవగుండాల అందాలు



పచ్చని చెట్లు, నల్లమల కొండల నడుమ ప్రవహిస్తున్న కాలువ నీరు

చాగలమర్రి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కరువు మాత్రమే కనిపించే రాయలసీమలో ప్రకృతి ప్రసాదించిన అందాలివి. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలంలోని చింతలచెరువు గ్రామ సమీపంలోగల భైరవగుండాల జలాశయం పరిసరాల్లో నల్లమల అందాలు కనువిందు చేస్తున్నాయి. ప్రస్తుత వర్షాలకు జలాశయం నిండుకుండలా ఉంది. జలాశయానికి ఎగువ కొండల నుంచి వర్షపు నీటితో పాటు తెలుగు గంగ ప్రాజెక్టు నుంచి కూడా వరద వస్తోంది. పచ్చని కొండలు, పచ్చదనంతో నిండిన పరిసరాలతో జలాశయం, టీజీపీ కాలువలో ప్రవహిస్తున్న నీరు మనోహరంగా కనిపిస్తోంది. ఈ ప్రకృతి అందాలు సందర్శకులను ఆహ్లాదపరుస్తున్నాయి.

ఏనుగుతో సెల్ఫీ.. ప్రాణాల మీదికి!



చామరాజనగర జిల్లా బండిపుర అభయారణ్యం ప్రాంతంలో రోడ్డు పక్కన వెళ్తున్న ఓ ఏనుగుతో సెల్ఫీ తీసుకునేందుకు పర్యాటకుడు దానికి దగ్గరగా వెళ్లాడు. గమనించిన ఏనుగు, అతడి వెంటపడింది. తప్పించుకునే క్రమంలో పరుగెత్తలేక అతడు కిందపడ్డాడు. అతని వద్దకు వచ్చిన ఏనుగు కాలితో సున్నితంగా తన్ని, అడవిలోకి వెళ్లిపోయింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్వల్పగాయాలతో బయటపడిన అతడిని ఆసుపత్రికి తరలించారు. ఈ వీడియోలు వైరల్ అవుతున్నాయి. - బెంగళూరు, ఆంధ్రజ్యోతి

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.